www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 19-5-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 33 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, బహుళపక్షం, తిథి: షష్ఠి ఉ.6:12 తదుపరి సప్తమి, నక్షత్రం: శ్రవణం రా.7:30 తదుపరి ధనిష్ఠ, వర్జ్యం: రా.11:30-1:06, దుర్ముహూర్తం: మ.12:37-1:28, మ.3:11-4:03, అమృతఘడియలు: ఉ.8:49-10:28, రాహుకాలం: ఉ. 7:30-9:00, సూర్యోదయం: 5:45, సూర్యాస్తమయం: 6:37 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

Galaxy S25 Edge
Galaxy AI

www.andhrajyothy.com

విజయవాడ సిటీ

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 19-5-2025

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


# మృత్యు జ్వాల

## హైదరాబాద్ చార్మినార్ సమీపాన ఘోర అగ్ని ప్రమాదం

**17 మంది మృతి**

మృతుల్లో 8 మంది చిన్నారులు, ఐదుగురు మహిళలు, నలుగురు వృద్ధులు

గుల్జార్‌హౌజ్‌లోని వ్యాపారి ఇంట్లో చెలరేగిన మంటలు


మొదటి అంతస్తులో చిక్కుకుపోయిన పదిహేడు మంది

భయంతో ఒకే గదిలోకి వెళ్లి తలుపులు మూసేసుకున్న పది మంది.. పొగ, వేడి కారణంగా అపస్మారకస్థితికి

ఆస్పత్రికి తీసుకెళ్లేసరికే వారిలో చాలా మంది మృతి



ప్రమాదం జరిగిన భవనం నుంచి ఓ చిన్నారిని బయటికి తీసుకొస్తున్న అగ్నిమాపక సిబ్బంది



హైదరాబాద్ చార్మినార్ సమీపంలోని గుల్జార్ హౌజ్ వద్ద అగ్ని ప్రమాదం జరిగిన భవనం లోపల పూర్తిగా కాలిపోయిన దృశ్యం

11

# కారు డోర్లు లాకై.. నలుగురు చిన్నారులు దుర్మరణం



అక్కాచెల్లెళ్లు జస్విత, చారుమతి



ఉదయ్



మనస్వి

ఆడుకునేందుకు కారెక్కిన చిన్నారులు

డోర్లు ఆటోలాక్ అవడంతో ఊపిరాడక మృతి

విజయనగరం జిల్లా ద్వారపూడిలో విషాదం

అందరూ ఎనిమిదేళ్లలోపు వయసున్న పిల్లలే

విజయనగరం, మే 18(ఆంధ్రజ్యోతి): వారంతా అభంశుభం తెలియని చిన్నారులు. ఓ శుభకార్యంలో కలుసుకున్నారు. ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. ఈ సరదా సమయంలో సమీపంలోని ఓ కారెక్కారు. అందులో ఆడుకునేందుకు ప్రయత్నించారు. కానీ.. అదే వారికి 'చివరి ఆట' అవుతుందని ఊహించలేకపోయారు. ఆకస్మికంగా కారు డోర్లు లాక్ కావడంతో ఊపిరాడక ఆ చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. విజయనగరం సమీపంలోని ద్వారపూడి గ్రామంలో ఆదివారం జరిగిన ఈ విషాద ఘటనలో

మిగతా 12వ పేజీలో...

### ఆటలోనే జల సమాధి!

2 జిల్లాల్లో నీట మునిగి ఐదుగురు చిన్నారుల అకాల మరణం

# లిక్కర్ స్కామ్‌లో అసలు విలన్ ఎవరు?

ఇప్పటిదాకా తేలింది పాత్రధారులే

తెరవెనుక ముఖ్య సూత్రధారి ఎవరు?

సొమ్ము పొందిన ఆ లబ్ధిదారు ఎవరో?

ముడుపుల సొమ్ము ఏమైంది?

ఆ దిశగా సిట్ అధికారుల విచారణ

కస్టడీలో నోరు విప్పని నిందితులు

ఆధునిక టెక్నాలజీ సాయంతో దర్యాప్తు

నిందితుల ఆస్తులు, లావాదేవీలపై ఆరా

కొలిక్కి రావడానికి మరికొంత సమయం?

వైసీపీ ప్రభుత్వంలో జరిగిన మద్యం కుంభకోణంలో సిట్ ఇప్పటికే పెద్ద తలకాయలను అరెస్ట్ చేసింది. వారిలో నాటి సీఎం జగన్ కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, ఐటీ సలహాదారు రాజ్ కసిరెడ్డి, భారతీ సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప బాలాజీ ఉన్నారు. ఈ కేసులో పెద్దలు ఇంకా ఎవరెవరున్నారు? తర్వాత వంతు ఎవరిది? తదుపరి ఏం జరగనున్నది?

మద్యం స్కామ్‌లో ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డిని సిట్ అధికారులు విచారించారు. అరెస్ట్ చేసిన వారినీ కస్టడీలోకి తీసుకుని విచారించారు. కానీ అసలు సూత్రధారి ఎవరన్నది వారు నోరు విప్పలేదు. ఈ స్కామ్‌లో తెరవెనుక ఉండి నడిపించింది ఎవరు? అసలైన విలన్ ఎవరు? ముడుపులు తీసుకొని అంతిమంగా లబ్ధిపొందినది ఎవరు? ఎవరి అరెస్ట్‌తో ఈ కేసు కొలిక్కి వస్తుంది? అన్నది తేలాల్సి ఉంది.



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఢిల్లీ లిక్కర్ కేసును తలదన్నేలా ఏపీ మద్యం కేసు విచారణ కీలక మలుపులు తిరుగుతోంది. నాటి బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సత్యప్రసాద్ ఇచ్చిన కీలక వాంగ్మూలం ఆధారంగా సిట్ అధికారులు తీగలాగారు. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డిని విచారించిన తర్వాతే పాత్రధారుల డొంక కదిలింది. ఎవరెవరు ఏమేం చేశారో గుట్టు రట్టయింది. ఇక తేలాల్సింది ఈ స్కామ్‌ను వెనక ఉండి నడిపించిన ఆ సూపర్ విలన్ ఎవరన్నదే. రాజ్ కసిరెడ్డి, ధనుంజయ్‌రెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డిల బృందమే కలిసి 3,200 కోట్ల మద్యం స్కామ్‌కు పాల్పడలేరు. తెరవెనక ఓ బలమైన శక్తి ఉండి నడిపిస్తేనే

మిగతా 11వ పేజీలో...

### ముంబై తారలతో బంధమేంటో!



మూడో దశ ప్రారంభ సమయంలో పీఎస్ఎల్వీ-సీ61 రాకెట్

# ఇస్రో బాణం గురితప్పింది

పీఎస్ఎల్వీ-సీ61 మూడో దశలో సాంకేతిక సమస్య

గతి తప్పిన రాకెట్.. దిశ మార్చేందుకు ఇస్రో ప్రయత్నం

ఫలించకపోవడంతో నింగిలోనే రాకెట్ పేల్చివేత

కక్ష్యలోకి చేరలేకపోయిన ఈవోఎస్-09 ఉపగ్రహం

సూళ్లూరుపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కు తిరుగులేని విజయాలు అందించిన పీఎస్ఎల్వీలో అపశ్రుతి చోటు చేసుకుంది. సాంకేతిక సమస్యతో ఇస్రో రామబాణం గురితప్పింది. శ్రీహరికోట నుంచి 101వ అంతరిక్ష ప్రయోగంగా ఇస్రో చేపట్టిన పీఎస్ఎల్వీ-సీ61 ప్రయోగం విఫలమైంది. సరిహద్దులపై నిఘా కోసం రూపొందించిన ఈవోఎస్-09 (రీశాట్-1బీ)

మిగతా 6వ పేజీలో...

# విద్యార్థులతో ఇంజనీరింగ్ కాలేజీల బంతాట!

## ఫీజుల నుంచి పరీక్షల వరకు యాజమాన్యాల ఇష్టారాజ్యం



రీయింబర్స్ ఆలస్యంతో ఒత్తిడి.. కొన్నిచోట్ల రోజువారీ ఫైన్లు

డబ్బులు కడితేనే పరీక్షలకు.. ఒరిజినల్ సర్టిఫికెట్లపైనా అంతే

అవి ఇస్తేనే అడ్మిషన్లని మెలిక.. తీసుకోవద్దన్న ఉన్నత విద్యా శాఖ

డ్రాపౌట్‌ల నుంచి పూర్తి ఫీజు.. 5 వేలకు మించొద్దన్నా బేఖాతరు

లబోదిబో మంటున్న విద్యార్థులు

ఇంజనీరింగ్ విద్యార్థులతో పలు ప్రైవేటు కాలేజీలు బంతాట ఆడుకుంటున్నాయి. ఫీజుల నుంచి పరీక్షల వరకు ప్రభుత్వ ఆదేశాలతో సంబంధం లేదన్నట్టుగా వ్యవహరిస్తున్నాయి. 'ఫీజులు మేమే కడతాం..' అని సర్కారు చెప్పినా.. విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయి. ఇక, అడ్మిషన్ల విషయంలోనూ అడ్డగోలుగా వ్యవహరిస్తున్నాయి. ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకోవద్దని ఉన్నత విద్యాశాఖే చెప్పినా పెడచెవిన పెడుతున్నాయి. 'ఒరిజినల్స్ ఇస్తే తప్ప..' అంటూ మెలిక పెడుతున్నాయి.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో పలు ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలు ఇష్టారాజ్యంగా నడుస్తున్నాయి. కొత్తగా చేరే విద్యార్థుల నుంచి ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకోవద్దని ఉన్నత విద్యాశాఖ చెప్పినా వినిపించుకోవడం లేదు. సర్టిఫికెట్ల విషయంలో ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టి సొంత రూల్స్ అమలు చేస్తున్నాయి. అంతేకాదు, కోర్సు మధ్యలో మానేసిన విద్యార్థులకు వెంటనే ఒరిజినల్ సర్టిఫికెట్లు జారీ చేయాలని ఆదేశించినా కాలేజీలు ఏమాత్రం లెక్క చేయట్లేదు. ఒరిజినల్స్ తీసుకుని ఫీజులు కట్టే సమయంలో, సర్టిఫికెట్ల జారీ సమయంలో విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారినా, మంత్రి నారా లోకేశ్ విద్యాశాఖ విషయంలో పదే పదే సమీక్షలు చేస్తున్నా సంస్థల తీరులో ఎలాంటి మార్పూ రావడం లేదు. పైగా ప్రభుత్వం కట్టాల్సిన ఫీజుల(రీయింబర్స్‌మెంట్)ను విద్యార్థులే చెల్లించాలంటూ ఇటీవల కొన్ని జిల్లాల్లో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తెచ్చాయి. అంతేకాదు.. ఫీజులు చెల్లించని వారిని పరీక్షలు రాయకుండా



మిగతా 12వ పేజీలో...

# హైదరాబాద్‌లో పేలుళ్లకు కుట్ర!

భగ్నం చేసిన తెలుగు రాష్ట్రాల పోలీసులు

ఇద్దరి అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు

నిందితులకు నిషేధిత ఐఎస్‌తో సంబంధాలు

ఒకరు విజయనగరం వాసి సిరాజ్-ఉర్-రెహ్మాన్

మరొకరు హైదరాబాద్ వాసి సయ్యద్ సమీర్

ఆన్‌లైన్‌లో సల్ఫేట్ సహా పేలుడు పదార్థాల కొనుగోళ్లు.. యూట్యూబ్ చూసి బాంబుల తయారీ

పక్కా నిఘాతో పట్టేసిన ఇరు రాష్ట్రాల పోలీసులు

సిరాజ్ రెహ్మాన్ తండ్రి, సోదరుడు ఏపీలో పోలీసులు

హైదరాబాద్/విజయనగరం, మే 18(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత నిషేధిత ఇస్లామిక్ స్టేట్(ఐఎస్), ఇతర ఉగ్రవాద సంస్థల నిద్రాణ దళాల(స్లీపర్ సెల్స్)పై పోలీసు నిఘా వర్గాలు దృష్టి సారించాయి. ఈ క్రమంలో తాజాగా హైదరాబాద్‌లో పేలుళ్లకు కుట్ర పన్నిన తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇద్దరు యువకులను అరెస్టు చేసి.. కుట్రను భగ్నం చేశాయి. ఏపీ, తెలంగాణ పోలీసులు సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో.. హైదరాబాద్‌లోని వారాసిగూడకు చెందిన సయ్యద్ సమీర్, ఏపీలోని విజయనగరానికి చెందిన

మిగతా 6వ పేజీలో...

# పాక్‌లో లష్కర్ ఉగ్రవాది సఫీవుల్లా హతం

8

సింధ్ ప్రావిన్స్‌లో గుర్తు తెలియని వ్యక్తి కాల్పులు

భారత్‌లో జరిగిన పలు దాడుల్లో కీలక పాత్ర



తెలంగాణ సచివాలయాన్ని సందర్శించిన ప్రపంచ సుందరి పోటీదారులు

# అందాలొలికిన సచివాలయం

తెలంగాణ సెక్రటేరియట్‌లో ప్రపంచ సుందరీమణుల సందడి

వెయ్యి డ్రోన్లతో ఆకట్టుకునేలా 'డ్రోన్ షో'

12

# హైటెక్ దందా

## తెలంగాణకు ఇసుక అక్రమ రవాణాలో కొత్త పంథా

అడ్డదారుల్లో భారీగా తరలింపు

పోలీసుల కన్నుగప్పేందుకు కొత్త మార్గాలు

ఎన్టీఆర్ జిల్లా నుంచి వెళ్లే లారీలకు ఖరీదైన కార్లతో ఎస్కార్ట్

మై వీల్స్ మొబైల్ యాప్‌తో రూటు డైరెక్షన్

కృష్ణా జిల్లా నుంచి గుంటూరు మీదుగా..

రాజధాని పేరు చెప్పి హైదరాబాద్‌కు

లారీలపై కాంట్రాక్టు సంస్థల లోగో

ఇసుక సిండికేట్ మాఫియా రోజుకో కొత్త పంథాలో ముందుకు సాగుతోంది. ఇందుకు కొత్త మార్గాలను, హైటెక్ పద్ధతులను అనుసరిస్తోంది. ఖరీదైన ఎస్కార్ట్ వాహనాలతో, మొబైల్ యాప్ సాయంతో యథేచ్ఛగా దందా సాగిస్తోంది.



ఇటీవల తెలంగాణలో సీజ్ చేసిన ఇసుక టిప్పర్లు

(విజయవాడ/కంచికచర్ల-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన ఉచిత ఇసుక విధానం వల్ల విజయవాడ నగరం, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలలో ఇసుక అందరికీ అందుబాటులోకి వచ్చేసింది. కారుచౌకగా టన్ను రూ.200లకే లభిస్తోంది. ఇది కొనుగోలుదారులకు వరంగా మారింది. ఇది నాణేనికి ఓ వైపు మాత్రమే. మరోవైపు... ఇసుక సిండికేట్ మాఫియాకు ఈ ధర గిట్టుబాటు కాకపోవడంతో కాసులు దండుకునేందుకు రూటు మార్చారు. తెలంగాణ ప్రాంతానికి ఇసుకను అక్రమంగా విచ్చలవిడిగా తరలిస్తున్నారు. ఇందుకు కొత్త మార్గాలను, హైటెక్ పద్ధతులను అనుసరిస్తున్నారు. ఆంధ్రాలో ప్రధానంగా ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరు నుంచి.. కృష్ణా జిల్లాలో

మిగతా 7వ పేజీలో...

# ఏ వ్యవస్థా గొప్పది కాదు.. రాజ్యాంగమే సుప్రీం!

ప్రజాస్వామ్యంలో 3 స్తంభాలూ సమానమే: చీఫ్ జస్టిస్ గవాయ్

శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు.. పరస్పరం గౌరవించుకోవాలి

చట్టం చేసే అధికారం పార్లమెంటుకు ఉంది.. కానీ మౌలిక స్వరూపం జోలికి వెళ్లకూడదు

అది న్యాయవ్యవస్థ స్వేచ్ఛను, చట్టపాలనను హరింపజాలదు.. నివాస హక్కూ ప్రాథమిక హక్కే: సీజేఐ

కొత్త ప్రధాన న్యాయమూర్తికి ముంబైలో మహారాష్ట్ర-గోవా బార్ కౌన్సిల్ సన్మానం



8

# 1 నుంచి సినిమా థియేటర్లు బంద్

సినీ ఎగ్జిబిటర్ల నిర్ణయం



6

సోమవారం 19 మే 2025

# వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్



## మహాయానం

ఆకులు అరమోడ్చిన చెట్టు కింద
కళ్లమూసుకుని కూర్చున్నారిద్దరు
మధుపాత్రల్లో మౌనాన్ని నింపుకుని

కళ్లచెట్టు రెప్పల కింద నీడల్లో
పాకుతున్న లేత ఎండని
కళ్లమూసుకుని సిప్ చేస్తుండగా
వాళ్లని విప్పారిన కళ్లతో చూస్తూ
మధుపాత్రల్లో తేలే తెల్లమబ్బులు

దూరంగా 'అంబా' అనే దూడ అరుపు
శబ్దం ఇద్దరు మనుషుల్ని కలుపుతుంది
ఇద్దరి మధ్య మౌనం పొరల్లోకి
చేరినిద్రపోతుంది

దిక్కుల్లేని నిశ్శబ్ద సాగరం మీద
తెడ్లు లేని పుట్టి శబ్దం
దానిలో చెట్టుతో సహా ఇద్దరు మనుషులూ
ఒక దూడా
తెల్లమబ్బులతో కలిసి తేలుతూ తూలుతూ
ప్రయాణం
ఒక కల నుంచి ఇంకో కలలోనికా?
లేదా... ఒక మెలకువ నుండి ఇంకో
మెలకువలోనికా?

■ వసీరా

✆ 91777 27076

## ప్రశ్నలు లేవనెత్తే చోట

ప్రశ్నలు లేవనెత్తే చోట
జవాబుల్లో కలుద్దాం,
విగ్రహాలతో కాదు
మనం పుస్తకాల్లో కలుద్దాం!

పంటలతోపాటు
పొలాల్లో కలుద్దాం,
పండించే రైతులకు తోడుగా
మనం రైతులతో కలుద్దాం!

కోర్టులు కచ్చేరీలలో కలుద్దాం
గ్రంథాలయాల్లో కలుద్దాం,
పేదల అందుబాటు న్యాయానికై
నిలబడే వకీళ్లతో కలుద్దాం!

బడులు మదర్సాలలో కలుద్దాం
కాలేజీలు యూనివర్సిటీలలో
కలుద్దాం,

దేశాభివృద్ధికి దారిచూపే
చదువు చెప్పే చోట కలుద్దాం!

విద్య అందరి హక్కు అనే
పని అందరికి కావాలనే,
కోట్లాది విద్యార్థుల్లో కలుద్దాం
కోట్లాది నవయువకులతో నడుద్దాం!

కొత్త సవాళ్లు ఎదురైతే
సమాధానాలలో కలుద్దాం
పోరాటాల మైదానాల్లో
పంటపొలాలు కార్ఖానాల్లో
అధికారానికై పిడికిలి బిగించే
శ్రామికులతో ఏకమవుదాం!

(మునేశ్ త్యాగి
హిందీ కవిత
ఆధారంగా)

■ నిఖిలేశ్వర్

✆ 91778 81201



**'గస్సాల్, మరికొన్ని కథలు'**

కె. ఆనందాచారి కథల సంపుటి 'గస్సాల్, మరికొన్ని కథలు' ఆవిష్కరణ మే 23 సా.5.30గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభలో పెద్దింటి అశోక్ కుమార్, ఏనుగు నర్సింహారెడ్డి, మామిడి హరికృష్ణ, వేముల శ్రీనివాస్, ప్రసేన్, నామోజు బాలాచారి, మువ్వా శ్రీనివాసరావు, ఆర్. సీతారాం తదితరులు పాల్గొంటారు.

తెలంగాణ సాహితి

**'ఏకుదారం' నవల**

బి. నాగశేషు నవల 'ఏకుదారం' ఆవిష్కరణ మే 24న తిరుపతి యూత్ హాస్టల్లో జరుగుతుంది. పుస్తక ఆవిష్కరణ పి.సి. వెంకటేశ్వర్లు, పుస్తక సమీక్ష కె. శ్రీనివాసులురెడ్డి, సభాధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు, విశిష్ట అతిథి వి.ఆర్ రాసాని, ఆత్మీయ అతిథులు వై. సుభాషిణి, బొమ్మిశెట్టి రమేష్. వివరాలకు 9393662821.

ఆర్.సి. కృష్ణ స్వామి రాజు

**కేంద్ర సాహిత్య అకాడమీ 'కవి సంధి'**

కేంద్ర సాహిత్య అకాడమి ఆధ్వర్యంలో అన్నవరం దేవేందర్‌తో 'కవి సంధి' కార్యక్రమం మే 25 సా.6గంటలకు కరీంనగర్‌లోని ఫిల్మ్ భవన్ ఏసీ హాలులో జరుగుతుంది. ఈ కార్యక్రమంలో అన్నవరం దేవేందర్ తన సాహిత్య జీవన యాత్రను వివరించి కవితా పఠనం చేస్తారు. కార్యక్రమ పర్యవేక్షణ: ప్రసేన్.

మృణాళిని

**'దుఃఖం పండుతున్న నేల' కవితా సంపుటి**

కంఠ బంగారాజు కవితా సంపుటి 'దుఃఖం పండుతున్న నేల' ఆవిష్కరణ మే 25ఉ.10గంటలకు విజయవాడ-గవర్నర్ పేటలోని బాలోత్సవ్ భవన్‌లో జరుగుతుంది. ఆవిష్కర్త గోరటి వెంకన్న. రసరాజు, బి. ప్రసాద మూర్తి, బిక్కి కృష్ణ, కోయి కోటేశ్వర రావు తదితరులు పాల్గొంటారు. వివరాలకు: 92464 15150

మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ

**ఖమ్మం ఈస్తటిక్స్ పురస్కారాలకు ఆహ్వానం**

ఖమ్మం ఈస్తటిక్స్ పురస్కారాల కోసం కవిత సంపుటాలకు, కథలకు ఆహ్వానం. మూడు ఉత్తమ కథలకు మొదటి, రెండవ, మూడవ బహుమతులు వరుసగా రూ.25వేలు, రూ.15 వేలు, రూ.10వేలు. ఉత్తమ కవితా సంపుటికి రూ.40వేల బహుమతి. కవితా సంపుటి 2024 ఏప్రిల్ – 2025 మార్చ్ మధ్య ప్రచురితమై ఉండాలి. కనీసం 25 కవితలకు తగ్గకుండా ఉండాలి. కథలు ఈ పురస్కారం కోసమే రాసినవై ఉండాలి. కవితా సంపుటాలు నాలుగు ప్రతులు పంపాలి. కథల యూనికోడ్ టెక్స్ట్‌ను మెయిల్ పంపుతూ నాలుగు ప్రింట్ కాపీలు పోస్ట్ చేయాలి. చిరునామా: ఖమ్మం ఈస్థటిక్స్, హార్వెస్ట్ స్కూల్, 5-7-200/11, పాకబండ బజార్, ఖమ్మం- 507003. ఫోన్: 98491 14369. ఈమెయిల్: khammamaesthetics@gmail.com

రవి మారుత్

# వందేళ్ల నాటి డిటెక్టివ్ నవల 'చతురిక'


**1917లో** అంటే 108 ఏళ్ల కిందట కర్నూలులో ప్రచురితమైన ఉయ్యాలవాడ రామచంద్రరావు రచన 'చతురిక' నవల ఇటీవలే మళ్లీ వెలుగులోకి వచ్చింది. నాలుగు నెలల క్రితం కర్నూలులో సాహితీ స్రవంతి కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంలో దీన్ని మళ్ళీ విడుదల చేశాం. సుందరయ్య విజ్ఞాన కేంద్రం గ్రంథాలయంలో పుస్తకాల డిజిటల్ కాపీలు ఆన్‌లైన్‌లో తిరగేస్తుండగా ఇది నాకు కనిపించడం అనూహ్యమే. నాకు గతంలో తెలిసిన మేరకు, లేదా ఇది కనిపించిన తర్వాత పరిశోధించిన మేరకు ఎక్కడా ఈ నవల, రచయిత నమోదు కాలేదు. రాయలసీమ నవలలపై పరిశోధనలతో సహా ఇంతవరకూ ఎక్కడా ఈ నవల గురించి ప్రస్తావన లేదు.

కర్నూలు డిప్యూటీ కలెక్టరుగా పనిచేసిన నరహరి గోపాల కృష్ణమ శెట్టి 1872లో వెలువరించిన 'శ్రీరంగరాజ చరిత్రము' మొదటి నవల కాగా, 1878లో కందుకూరి వీరేశలింగం ప్రచురించిన 'రాజశేఖర చరిత్ర' రెండవ నవల అని సాహిత్య చరిత్ర చర్చలో ఒక దీర్ఘకాలిక అభిప్రాయం. అంతకన్నా ముందే చరిత్రకు సంబంధించిన నవలలు తెలంగాణలో వచ్చాయని మిత్రులు పలు వివరాలు ప్రకటించారు. తెలుగు నవలా వికాసం గురించి ఇంకా చాలా సమాచారం, ఆధారాలు ఉన్నా ఇక్కడ ఆ వివరాల్లోకి పోలేం. స్థూలంగా తెలుగు సాంఘిక నవల అన్న కోణం మాత్రమే తీసుకుంటున్నాను.

ఈ 'చతురిక' రచయిత ఉయ్యాలవాడ రామచంద్రరావు ఈ నవల నేరుగా షెర్లాక్ హోమ్స్‌కు అనుసరణ అని రాశారు. అయితే ఈ చిన్న నవల మొత్తంలో అనుకరణ కన్నా దేశీయతనే అధికంగా కనిపిస్తుంది. కథనానికి అనుసరించిన శిల్పం కూడా కృత్రిమత్వానికి చోటివ్వలేదు. భాష పరంగా అర్ధ గ్రాంథికం అనొచ్చు. అప్పటికీ ఇప్పటికీ పదాల వినియోగంలో వచ్చిన మార్పువల్ల కొంత బుర్రకు పనిపెట్టాల్సిన అగత్యమేర్పడుతుంది. అదే సమయంలో బ్రిటిష్ ప్రభావాలు, పదాలను పోకడలను గురించి కూడా కొంత చెప్పడానికి రచయిత ప్రయత్నించారు. భాష కొంత సమస్యగా కనిపించినా కథనం అప్పటి పరిస్థితులను కళ్లకు కడుతుంది.

ఒక రాజ వంశీకుడు గతంలో తను సన్నిహితంగా మెలిగిన వేశ్య చతురిక దగ్గర ఉండిపోయిన తమ జంట ఫోటోను ఎలాగైనా తెలియకుండా తెప్పించాలనుకోవడం కీలకమైన కథ. ఈ క్రమంలో గూఢచారి కథనాయకుడిని నియమిస్తాడు. కథను రచయిత ఉత్తమ పురుషలో చెబుతుంటారు. ఈ క్రమంలో కేవలం గూఢచర్యమే గాక పోటాపోటీ గూఢచర్యం (కౌంటర్ ఎస్పినోజ్) కూడా జరగడం చతురికలో అదనపు ఆకర్షణ. అయితే అది కొసమెరుపులా చివరి వరకూ అర్థం కాదు. బ్రిటిష్ వారి పాలనలో రాజరిక వాతావరణం, ఆనాటి కోర్టులు, పోలీసులు, దావాలు, విందు వినోదాల వంటి ఆధునిక పట్టణ జీవిత లక్షణాలు గోచరిస్తాయి. ఒకరిని గురించి మరొకరు ఎలా ఆలోచించాలి, ఎలా పసిగట్టాలి, తమ ప్రయోజనాలను ఎలా కాపాడుకోవాలి... ఇవన్నీ నవీనకాలానికి ఏమాత్రం తీసిపోని రీతిలో నడుస్తాయి. నవల శీర్షిక చతురిక అన్నట్టే ఆ పాత్ర చాతుర్యంతో పాటు వ్యక్తిత్వం గల మహిళ అనీ తెలుస్తుంది. ఇది చదివాక కొంత వరకూ సాహిత్యజీవులను మధురవాణి గుర్తుకు వస్తే పొరబాటేమీ లేదు. కాకుంటే ఇది చిన్న నవలిక గనక అంత పరిధీ లేదు. పాత కాలపు రచనల్లో కీలక పాత్రధారిణులు వేశ్యలు కావడం యాదృచ్ఛికమేమీ కాదు. ఆనాటికి ఆ మాత్రం తెగువకు, చొరవకు అవకాశముండేది వారికేనని చెప్పాలి.

**డిటెక్టివ్ కథల్లో మామూలుగా ఒక దుష్టపాత్రను పట్టుకోవడం తప్పనిసరి కాగా ఈ కథలో అలాటి పని జరగదు. మానవ స్వభావాల్లో మాయోపాయాలు, స్వప్రయోజనాల కోసం పెనుగులాటలు మాత్రమే చూపించారు. పెద్ద సామాజిక సందేశాల జోలికి అసలే పోలేదు. సందేశాత్మకం కాకున్నా చారిత్రాత్మకం గనుక సాహిత్య అధ్యయనాలకు దోహదం కాగలదని దీన్ని మళ్లీ ముద్రించాం.**







1917లో కర్నూలు లోని 'చంద్రమౌళీశ్వర ముద్రాక్షరశాల' అధినేత ఎస్.వి. రాఘవయ్య ఈ పుస్తక ప్రచురణకు ప్రేరణగా నిలవడమే గాక సంపాదకుడు గానూ వ్యవహరించారు. (ఆ 'చంద్రమౌళీశ్వర ముద్రాక్షరశాల' యాజమాన్యం మారినా సీఎం ప్రెస్ పేరుతో ఇంకా నడుస్తున్నది.) ఈ ప్రచురణకర్త రాఘవయ్య ఆ కాలంలో లలితా గ్రంథమాల పేరిట ఒక నవలల సీరిసే ప్రకటించారు. ఆ కాలానికే చందాదారులను చేర్చుకుని చౌకగా ఆఫర్లు కూడా ప్రకటించడం చూస్తాం.

'చతురిక' చదివిన తర్వాత రచయిత ఉయ్యాలవాడ రామచంద్రరావు కథనంలో మంచి నేర్పు కలవారనిపిస్తుంది. హాస్య వ్యంగ్యాలతో పాటు ఈ తరహా కథలకు ప్రాణమైన సస్పెన్స్‌ను కూడా జాగ్రత్తగా పాటించారు. అంతేగాక తన తర్వాతి వారిలా "పాఠక మహాశయా రమ్ము, ఆ ముసుగు మనిషని వెంబడింతము" వంటి కృతక ప్రయోగాలేమీ చేయకుండా సహజంగానే కథ చెప్పుకొచ్చారు. డిటెక్టివ్ కథల్లో మామూలుగా ఒక దుష్ట పాత్రను పట్టుకోవడం తప్పనిసరి కాగా ఈ కథలో అలాటి పని జరగదు. మానవ స్వభావాల్లో మాయోపాయాలు, స్వప్రయోజనాల కోసం పెనుగులాటలు మాత్రమే చూపించారు. పెద్ద సామాజిక సందేశాల జోలికి అసలే పోలేదు. సందేశాత్మకం కాకున్నా చారిత్రాత్మకం గనుక సాహిత్య అధ్యయనాలకు దోహదం కాగలదని దీన్ని మళ్లీ ముద్రించాం.

■ తెలకపల్లి రవి

# "ప్రతీ రోజూ ముప్పై పైనే ఉత్తరాలు వచ్చేవి!"

"**సు**విశాలంగా విస్తరించుకుని ఉన్న నా ఒంటరితనపు సామ్రాజ్యానికి చక్రవర్తినైతే అయ్యాను కానీ మంత్రిలేక బాధపడుతున్నాను – రారాదూ!" అంటూ టీనేజ్‌లో ఒక ప్రేమలేఖని రాసి ఆంధ్రజ్యోతికి పంపిస్తే, పురాణం సుబ్రహ్మణ్య శర్మ ప్రచురించారు. ఆ తర్వాత 'మయూరి' పత్రికవారు ఒక కాలమ్ రాయమంటే వారం వారం ఒక ప్రేమలేఖని 'అమృతవర్షిణి' పేరుతో రాశాను. వాటిని సంపుటిగా ప్రచురించాలని ఇన్నర్ టెక్స్ట్ రెడీ చేస్తుంటే అక్కడక్కడా బొమ్మలుంటే బాగుండునని పించింది. వ్యక్తిగతంగా అస్సలు పరిచయం లేని ఆర్టిస్ట్ గోపి గారికి ఫోన్ చేసి కొన్ని బొమ్మలు కావాలని అడిగాను. చదివాక నచ్చితేనే వేస్తానన్నారు. టెక్స్ట్ పంపించాను.



మూడు రోజులు తర్వాత గోపీగారు పంపిన కవర్ తెరచి చూసి నా కళ్ళని నేనే నమ్మలేకపోయాను. ఒకటో రెండో బొమ్మలు పంపిస్తారనుకుంటే ప్రతి లేఖకీ ఒక బొమ్మ, భలే అందంగా! వారికి థాంక్స్ చెప్పాలని కాల్ చేస్తే వారన్నారు, "ఒక్క బొమ్మతో ఆగలేకపోయానండి... ఎంత బాగా రాసారు! ఎన్ని సార్లు చదివానో! కాలమ్‌గా వచ్చినప్పుడు చూడలేదు... అందుకే నచ్చితేనే వేస్తానన్నాను. చలం గారి తరువాత ప్రేమ లేఖలు వేస్తుంది మీరేనేమో," అన్నారు. అమ్మాయిల్లో ఇదే మొదటి సంపుటా అని అడిగాను. తనకు తెలిసినంత వరకు ఇదే మొదటిదన్నారు.

## నా మొదటి పుస్తకం

కుప్పిలి పద్మ




బొమ్మలతో లేఅవుట్ రెడీ. కవర్ పేజీ ఫిక్స్ చెయ్యాలి. ఏ బొమ్మా నచ్చేది కాదు. ఒకరోజు నల్లకుంటలో ఒక వీధిలో నడుచుకుంటూ వెళుతుంటే తలుపులు తెరచున్న ఒక ఇంటి ముందుగదిలో గోడ మీదున్న ఒక క్యాలెండర్ ఆకర్షించింది. చొరవ చేసి లోపలికి వెళ్ళాను. అక్కడున్నవారు ఏం కావాలని అడిగారు. ఆ కాలెండర్ కవర్‌ను పుస్తకానికి కవర్ పేజీగా వేద్దామని ఉందని, ఆ క్యాలెండర్ ఎక్కడ దొరుకుతుందని అడిగాను. "మాదేనండి. కొత్తదైతే ప్రింటింగ్‌కి బాగుంటుంది" అంటూ కొత్త క్యాలెండర్‌ని తెప్పించారు. అప్పుడడిగాను "ఇదేం ఆఫీస్" అని. ప్రింటింగ్ ప్రెస్ అన్నారు. ఈ పుస్తకం ప్రింట్ చేస్తారా అని అడిగాను. "చేయొచ్చు, కవర్ డిజైన్ చేయడానికి మీకు తెలిసిన వాళ్ళున్నారా," అని అడిగారు. ఎవ్వరూ తెలియదంటే, 'ఫినిషింగ్ పాయింట్' వారితో మాటాడారు. వారి యువ డిజైనర్స్ కవర్ డిజైన్ చేశారు. అలా 1993 శ్రావణ మాసపు జల్లుల్లో 'అమృతవర్షిణి' కురిసింది.

ఆవిష్కరణ ఆసక్తి లేదు. పత్రికల్లో చక్కని సమీక్షలొచ్చాయి. విశాలాంధ్ర వారి బస్సు ఏ ఊర్లోకి వెళ్ళినా... వెళ్ళీవెళ్ళగానే క్షణాల్లో 'అమృతవర్షిణి'ని కొనుక్కోవటంతో రెండు వేల కాపీలు చాలా త్వరగా అమ్ముడైపోయాయి. పాఠకుల్లో చక్కని డిమాండ్ ఉండటంతో తిరిగి ప్రచురిస్తూ ఉండేదాన్ని.

'అమృతవర్షిణి'ని చదివి చేరా మాస్టారు గారు భావుకురాలివంటే; మునిపల్లె రాజు గారు, శ్రీపతి గారు 'అమ్మాయి చలం' అని మెచ్చుకున్నారు. ఒక ట్రైన్‌లో కలిసినప్పుడు కేశవరెడ్డి గారు 'అమృతవర్షిణి' అని పలకరించటం, చండీదాస్ గారు కొన్ని లేఖల్ని ప్రస్తావిస్తూ మాట్లాడటం, ప్రేమలేఖల్ని ప్రచురించి మొదటి అమ్మాయివని హరిగారు అనడం, వాసుదేవరావు గారు ఆత్మీయంగా ఆటోగ్రాఫ్ అడగటం అజంతా గారు మెచ్చుకున్నారని వారింటికి తీసుకెళ్ళి 'అమృతవర్షిణి' అని పరిచయం చెయ్యటం... ఇలా ఎందరో సాహితీ వేత్తల ప్రశంసలు... మరో వైపు పాఠకుల నుంచి ప్రతీ రోజూ దాదాపు ముప్పై పైనే ఉత్తరాలు వచ్చేవి. దేశదేశాల్లో ఉన్న అనేకమంది సాహిత్య అభిమానులు అప్పట్లో ఈ పుస్తకాన్ని ఎంతో ఇష్టంగా చదివామనీ; అపురూపంగా దాచుకున్నామనీ; అమెరికాకో మరో దేశానికో చదువు కోసమో, ఉద్యోగం కోసమో వెళ్తున్నప్పుడు వాళ్లు తీసుకెళ్లిన అతి కొద్ది పుస్తకాలలో 'అమృతవర్షిణి' ఒకటనీ; కొంతమందైతే ఒక్క 'అమృతవర్షిణి'ని మాత్రమే తీసుకెళ్లామనీ... ఇలా నా మొదటి పుస్తకం 'అమృతవర్షిణి' నాకెన్నో అందమైన జ్ఞాపకాల్ని, అపురూపమైన అభిమానుల్ని ఇప్పటికీ విరబూయిస్తోంది.

# "పద్యంలోనే ఎఫెక్టివ్‌గా చెప్పగలిగే విషయాలు కొన్ని ఉన్నాయి"


– ఏనుగు నరసింహారెడ్డి

**సృ**జన ప్రక్రియలలో కొత్త కోణాలను అన్వేషించి అంతే అపురూపంగా వ్యక్తం చేస్తున్న కవి ఏనుగు నరసింహారెడ్డి. 'సమాంతర స్వప్నం', 'నేనే', 'కొత్త పలక', 'మూలమలుపు', 'నీడల దృశ్యం', 'పూల పూల వాన' పుస్తకాలు ఆయన కవిత్వ సృజనకు నిలువుటద్దాలు. కవిత్వంతోపాటు అనువాదాలు, విమర్శ, పరిశోధన గ్రంథాలు రాశారు. వర్తమాన కవులు ఎక్కువమంది పట్టించుకోని కవితా రూపాలైన రుబాయిలు, ఛందోబద్ధపద్యాల్ని కూడా ఆయన పట్టించుకున్నారు. పద్యాన్ని ఆధునీకరించి ప్రజలకు చేరువగా చేసిన కవులలో ఏనుగు నరసింహారెడ్డి పేర్కొనదగినవాడు. ఆయన ఇటీవల వెలువరించిన రాజకీయ శతకం 'ఏడుకోలల బాయి'. గుర్రం జాషువా రాసిన 'గబ్బిలం' ఎట్లా ప్రతీకాత్మక కావ్యమో, అట్లానే వ్యవస్థ డొల్లతనాన్ని బయటపెట్టే రాజకీయ ప్రతీకాత్మక కావ్యం 'ఏడుకోలల బాయి'. ప్రజలను ఓటర్లుగా మాత్రమే కాక చైతన్యవంతమైన పౌరులుగా జీవించమని చెబుతున్న పద్యాలివి. ఈ శతక నేపథ్యంలో ఏనుగు నరసింహారెడ్డి జరిపిన సంభాషణ ఇది.



**మీ నుంచి వచన కవిత్వేతర రూపాలు అప్పుడు 'తెలంగాణ రుబాయిలు' ఇప్పుడు 'ఏడుకోలల బాయి' రావడానికి కారణాలేంటి?**

కాలమే కవుల్ని ప్రభావితం చేస్తుంది. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కాలంలో వచన కవిత్వంలో చెప్పిన విషయం కన్నా రుబాయిలలో చెప్పే విషయం ప్రజలను తొందరగా చేరుకుంటుందని భావించి అప్పుడు 'తెలంగాణ రుబాయిలు' రాశాను. అనుకున్నట్లుగానే అవి గేయంగా మారి అనేక మాధ్యమాల ద్వారా ప్రజల దగ్గరికి చేరాయి. ఇప్పుడు రాజకీయాలు వేస్తున్న వేషాలు, ఎన్నికలప్పుడు చేస్తున్న ఫీట్లు చూసి దీన్ని ఒకటో రెండో కవితలుగా రాస్తే లాభం లేదని, ఒక సంపూర్ణ కావ్యం నిర్మించాలని అనుకున్నాను. అందుకు పద్య కావ్యాన్ని ఎంచుకున్నాను.




**మీరు ప్రధానంగా వచన కవి కదా. మరి ఈ 'ఏడుకోలల బాయి'ని పద్యాలలో రాయాలని ఎందుకనిపించింది?**

నేను వచన కవినే. వచన కవిత్వంలో చెప్పలేని అంశం అంటూ ఏదీ ఉండదని నేను నమ్ముతాను. కానీ కొన్ని సందర్భాలలో వచన కవిత్వం కన్నా పద్యంలోనే ఎఫెక్టివ్‌గా చెప్పగలిగే విషయాలు కొన్ని ఉన్నాయని అనిపిస్తుంది. వర్తమాన రాజకీయాలను అనేకమంది వచన కవిత్వంలో రాశారు, నేనూ రాశాను. అవి రాజకీయం లోని కొన్ని అంశాలని స్పృశించి సద్దుమణిగాయి. కానీ డెబ్బై అయిదేళ్ళ స్వతంత్ర భారతంలో రాజకీయ పార్టీలు పోతున్న పోకడను సంపూర్ణంగా చర్చించడానికి ఒక పద్య కావ్యమే కావాలనిపించింది నాకు. అటు కేంద్రంలోనూ ఇటు రాష్ట్రాలలోనూ అనేక భావజాలాలున్న ప్రభుత్వాలు వచ్చాయి. అయినా రాజకీయం సామాన్యులకు అసలైన జ్ఞానాన్ని కలిగించలేకపోతోంది. డబ్బుల చర్చ లేని రాజకీయం కనుచూపుమేరలో కనిపించకుండా పోయింది. ఈ agony నుండే 101 సీస పద్యాలలో రాజకీయాల గుట్టును, నాయకుల లోగుట్టును, ప్రజల అమాయకత్వాన్ని కదలకుండా నమోదు చేశాను. చాలామంది కవుల లాగే అడపాదడపా కొన్ని కవితలు రాసి ఊరుకోవడం కంటే ఇప్పుడున్న ఎన్నికల వ్యవస్థ రూపాన్ని పూర్తిగా తొలగించుకునేంత వరకు నిరంతరం ప్రాసంగికత ఉండే పద్యాలు కొన్ని రాసి ప్రజల నోళ్ళ మీద ఉండేట్లు చేయాలని అనిపించింది. తెలంగాణలో 2023లో జరిగిన ఎన్నికల్లో కొన్ని పద్యాలు రాసాను. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో మరిన్ని పద్యాలు రాశాను. ఇవి చదివిన వారిపై గట్టి ముద్ర వేస్తాయని మాత్రం కవిగా నేను బలంగా నమ్ముతున్నాను.

**వర్తమాన రాజకీయాలను అనేకమంది వచన కవిత్వంలో రాశారు, నేనూ రాశాను. అవి రాజకీయం లోని కొన్ని అంశాలని స్పృశించి సద్దుమణిగాయి. కానీ డెబ్బై అయిదేళ్ళ స్వతంత్ర భారతంలో రాజకీయ పార్టీలు పోతున్న పోకడను సంపూర్ణంగా చర్చించడానికి ఒక పద్య కావ్యమే కావాలనిపించింది నాకు.**

**ఎలాంటి శిల్ప వైవిధ్యంతో ప్రజలను చేరుకునే వ్యూహరచన చేశారు?**

సీస పద్యానికి నిడివి ఎక్కువ ఉండడం అనేది ఒక సౌలభ్యం. అందువల్ల ఎక్కువ రాజకీయాలు చెప్పవచ్చు. బాగా నచ్చిన వారు ఎవరైనా పాడుకోవడానికి అనువైన లయ కూడా అందులో ఉంది. ఇక భాష కూడా సామాన్యులు రోజూ వాడుకునే మాటలనే తీసుకొని పద్యాల పట్టాల నడుమ ఇరికించాను. తెలంగాణ ప్రాంతపు లోకోక్తులు, సామెతలు, ఉర్దూ మిళిత పదబంధాలను ఇందులో చాలా చేర్చాను. అందువల్ల- తమిళ పదాలు ఉచ్చరించడానికి మొదలు కొంత కష్టపడ్డా తర్వాత అవి మరిచిపోలేని విధంగా ఉన్నట్లు- ఈ పద్యాలు కూడా చదవడానికి కొంత ప్రయత్నించాలి. చదివారా అవి మీ వెంటే ఉండిపోతాయి అని చెప్పగలను.

**మకుటానికి ఒక పద్యాన్ని పూర్తిగా వాడుకున్న కవి గతంలో ఎవరూ లేరు. మీరు మకుటానికి అంత ప్రాధాన్యత ఇవ్వడానికి కారణమేమిటి?**

నేను శతకం నిండా చెప్పుతున్న రాజకీయ అక్రమాలను ఓటరుకు ప్రతి పద్యంలో గుర్తు చేయవలసిన అవసరం ఉంది. అందుకే వ్యంగ్యంగా నిత్య వ్యవహార పదబంధంతో ఒక పూర్తి తేటగీతి పద్యాన్ని మకుటంగా పెట్టాను. ఎవరైనా ఆ ఒక్క మకుటాన్ని గుర్తు పెట్టుకుంటే ఆ పద్యం ఏమై ఉంటుందా అన్న క్యూరియాసిటీ రావాలన్నదే కవిగా నా లక్ష్యం.

"మాయ మాటల హామీల మర్మమెరిగి
గుర్తు లేకుండ ఓటెట్ల గుద్దుతావు
ఓరి ఎంకన్న! దోస్తుగా! ఒర్లుబోతు!
ఒక్క మాటన్న వినవారు! తిక్కలోడ!"

**'ఏడుకోలల బాయి' అని పేరు పెట్టడంలో గల సార్థకత ఏమిటి?**

బావుల లోతు కొలవడానికి 'కోల' ఒక కొలమానం. ఏడు కోలల అంత లోతైన బావి అంటే అది చాలా లోతైన బావి అనే అర్థంలో వాడుతారు. ఎన్నికలు, ఓట్లు, రాజకీయాలు కూడా అంత లోతైనవి, అంత గుట్టు కలిగి ఉండేవి అనే అర్థంలో ఈ పేరు పెట్టాను. ఇంకా కొన్ని చోట్ల గుట్టుగా ఉండే మనుషులను 'వాడు మామూలోడు కాదురా. ఏడు కోలల బాయి! ఎవరికీ అర్థం కాడు' అనడం కూడా కద్దు. వెరసి రాజకీయ వ్యవహారం అంతా సామాన్య జనాలకు అర్థం కాని తంతు. అందుకే ఆ పేరు పెట్టాను.

ఇంటర్వ్యూ ■ బెల్లంకొండ సంపత్ కుమార్

✆ 99085 19151

ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో మాధురి



# నేటితో ఉత్కంఠకు తెర

## తిరువూరు మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి

**పరిశీలించిన ఎన్నికల అధికారి, ఆర్డీవో మాధురి**

తిరువూరు, మే 18(ఆంధ్రజ్యోతి): తిరువూరు మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో చైర్మన్ ఎవరు అనే దానికి సోమవారం తెరపడనుంది. వైసీపీ ఇప్పటికే తమ సభ్యులకు విప్ జారీ చేసినటు తెలుస్తోంది. పురపాలక సంఘంలోని 17 మంది వైసీపీ కౌన్సిలర్లలో కొందరు కూటమివైపు మొగ్గుచూపిస్తుండటంతో చైర్‌పర్సన్ పదవి వైసీపీ చేజారి పోతుందా! అనే అనుమానం పట్టణ ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఇప్పటికే వైసీపీ అధిష్టానం తమ సభ్యులను రెండు విడతలుగా క్యాంప్‌కు తరలించింది. క్యాంప్ నుంచి వచ్చిన వారిలో ఎంతమంది వైపీపీకి ఓటు వేస్తారు, ఎంత మంది మిగతా 4లో..

# సైబర్ టెర్రర్!

## ఉగ్రవాదాన్ని అవకాశంగా మార్చుకుంటున్న 'ఈ' నేరగాళ్లు

- ఉగ్రవాదులకు నిధులు పంపుతున్నారంటూ ఫోన్లు
- యుద్ధానికి కారణం ఇదేనంటూ బెదిరింపులు
- సెంట్రల్ సర్వలెన్స్ టీంగా బిల్డప్
- ట్రెండ్ మార్చిన డిజిటల్ అరెస్టు నిందితులు





భారత్-పాకిస్థాన్ మధ్య కొద్దిరోజుల క్రితం జరిగిన యుద్ధానికి కారణం మీరే. ఉగ్రవాదులకు మీరు నిధులు సమకూర్చుతున్నట్టు మా నిఘాలో తేలింది. త్వరలో మిమ్మల్ని అరెస్టు చేసి జైలుకు పంపడం ఖాయం. ఇది జరగకూడదంటే మేం చెప్పినట్టు చేయాలి. కొద్దిరోజుల క్రితం ఓ ప్రైవేటు ఉద్యోగికి వచ్చిన ఫోన్‌కాల్ ఇది. ఇలా సైబర్ నేరగాళ్లు ప్రతి సందర్భాన్ని తమకు అనుకూలంగా మలచుకుని ప్రజల నుంచి డబ్బు దోచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ప్రపంచంలో ఉన్న అన్ని అంశాలను తమకు అనుకూలంగా మార్చుకుంటున్న 'ఈ' నేరగాళ్లు కొద్దిరోజుల క్రితం జరిగిన యుద్ధాన్ని ఓ అవకాశంగా మార్చుకుంటున్నారు. డిజిటల్ అరెస్టు పేరుతో జనం నుంచి లక్షలాది రూపాయలను కాజేసిన సైబర్ నేరగాళ్లు ఇప్పుడు యుద్ధాన్ని వాడుకుంటున్నారు. ఇప్పటి వరకు డ్రగ్స్‌ను కొరియర్ ద్వారా పార్సిల్ చేశారంటూ ముంబై క్రైం బ్రాంచ్, సీబీఐ, ఢిల్లీ క్రైం బ్రాంచ్ పోలీసులమని వీడియో కాల్స్ చేసి బెదిరించేవారు. లక్షలాది రూపాయలను వెంటవెంటనే బ్యాంక్ ఖాతాల్లో జమ చేయించుకునేవారు. ఎన్టీఆర్ జిల్లాలో ఈ డిజిటల్ అరెస్టులు కొద్దినెలల క్రితం మిగతా 4లో..

### 'ఉగ్ర' డిజిటల్!

సైబర్ నేరాల ద్వారా ఆదాయాన్ని రుచి మరిగిన నేరగాళ్లు డిజిటల్ అరెస్టుల పేరుతో ప్రజలకు ఫోన్లు చేస్తూనే ఉన్నారు. . 'ఈ' నేరగాళ్లు విసిరిన వలలో జనం చిక్కడం తగ్గిపోయింది. అయినా ఆ ప్రయత్నాలను మాత్రం సైబర్ నేరగాళ్లు ఆపడం లేదు. ఇప్పుడు వారికి కొద్దిరోజుల దాయాది దేశంతో భారత్ సైన్యం యుద్ధం అవకాశంగా మారింది. పాకిస్థాన్‌లో ఉన్న ఉగ్రమూలాలపై మనదేశ త్రివిధ దళాలు విరుచుపడిన విషయం తెలిసిందే. ఇప్పుడు డిజిటల్ అరెస్టుల కోసం ఈ నేరగాళ్లు ఉగ్రవాదులను ఎంపిక చేసుకుంటున్నారు. సంపాదించిన డేటా ప్రకారం ఆయా వ్యక్తులకు వీడియో కాల్స్ చేస్తున్నారు. ఉగ్రవాదులకు డబ్బులు సమకూర్చుతున్నట్టు సమాచారం ఉందని, కొద్దిరోజుల క్రితం జరిగిన యుద్ధానికి కారణం మీరేనంటూ బెదిరిస్తున్నారు. విజయవాడలో ఓ వ్యక్తికి సైబర్ నేరగాళ్లు ఈవిధంగా ఫోన్ చేశారు. ఆయన సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించగా అది సైబర్ నేరగాళ్లు చేసిన డిజిటల్ అరెస్టు వ్యవహారమని తేల్చారు.

విద్యుత్‌శాఖ అధికారుల వ్యవహారశైలి అనేక విమర్శలకు దారితీస్తోంది. ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండానే విజయవాడ ఎయిర్ పోర్టులో 132/32 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు చేపట్టారు. పనులు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో తాపీగా ప్రజాభిప్రాయ సేకరణ నోటిఫికేషన్ విడుదల చేశారు. దీనిపై ఎవరైనా అభ్యంతరం వ్యక్తం చేసినా, కోర్టును ఆశ్రయించినా పనులు నిలుపుదల చేయాల్సిన పరిస్థితి వస్తుంది. ఇదే కాక గతంలో గన్నవరం పాత సబ్ స్టేషన్ పక్కన కోట్ల రూపాయలతో కొత్త స్టేషన్ నిర్మించారు. ప్రారంభం కూడా చేయకుండా వదిలేశారు. మేథా టవర్ సమీపంలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టి.. వెంటనే పనులు ఆపేశారు. ఇప్పుడు మూడో సబ్‌స్టేషన్ పనులు నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్నారు.

# ట్రాన్స్‌కోనా మజాకా!

## ఎయిర్‌పోర్టులో చురుగ్గా 132/32 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు

**ఇప్పుడు తాపీగా ప్రజాభిప్రాయ సేకరణ నోటిఫికేషన్ విడుదల**

- పనులు ప్రారంభానికి ముందే ఇవ్వాల్సిన నోటిఫికేషన్ తర్వాత ఇవ్వడంపై విమర్శలు
- ఇప్పటికే ఒక సబ్ స్టేషన్ నిర్మించి పాడుబెట్టారు.. మరోదానికి పనులు ప్రారంభించి వదిలేశారు!
- తాజాగా మూడో దాన్ని నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నారు..
- విద్యుత్‌శాఖ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు



గన్నవరం ఎయిర్‌పోర్టులో నిర్మిస్తున్న సబ్‌స్టేషన్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గన్నవరంలోని విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో నిర్మిస్తున్న 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులకు సంబంధించి ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనల కోసం ఈ నెల 13వ తేదీన గజిట్ నోటిఫికేషన్‌ను విద్యుత్ శాఖ అధికారులు విడుదల చేశారు. వాస్తవంగా ఈ గజిట్ నోటిఫికేషన్‌ను మిగతా 4లో..



రైల్వేట్రాక్‌పై పడిన ట్రాలీని తొలగిస్తున్న సిబ్బంది

# రైల్వే స్టేషన్‌లో వర్షం ఇక్కట్లు

## ప్లాట్‌ఫాంలపై ధారలా కారిన నీరు

- లగేజీ సహా తడిచిపోయిన ప్రయాణికులు
- ట్రాక్‌పై పడిన పార్శిల్ ట్రాలీ
- రైళ్లు రాకపోవడంతో తప్పిన ప్రమాదం

రైల్వేస్టేషన్, మే 18 (ఆంధ్రజ్యోతి) : ఏ1 రైల్వేస్టేషన్‌గా పేరొందిన విజయవాడ రైల్వేస్టేషన్ పరిస్థితి దారుణంగా తయారైంది. ఆదివారం సాయంత్రం జోరుగా కురిసిన వర్షానికి రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాంల షెడ్లకు రంధ్రాలు పడి నీరు ధారలుగా కారింది. కనీసం ప్లాట్‌ఫాంపై ప్రయాణికులు నిలబడే పరిస్థితి కూడా లేకుండాపోయింది. కొన్నిచోట్ల వర్షపునీరు ప్రయాణికులపై పడటంతో లగేజీ సహా తడిచిపోయారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా ఇటీవల రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు చేపట్టారు. పనులు కొనసాగుతున్నాయి. అయితే, ప్లాట్‌ఫాంలపై ఉన్న షెడ్లకు ఉన్న రంధ్రాలను మాత్రం ఎవరూ గుర్తించలేదు. ఈ స్టేషన్ నుంచి నిత్యం వేలమంది రాకపోకలు సాగిస్తుంటారు. ఇంత ప్రధానమైన స్టేషన్‌లో ప్లాట్‌ఫాంలపై వర్షం కురవటం ప్రయాణికులను ఆందోళనకు గురిచేసింది.

### ట్రాక్‌పై పడిన ట్రాలీ



ఒకటో నెంబర్ ప్లాట్‌ఫాంలో ధారలుగా కారుతున్న వర్షపు నీరు

రైల్వే ప్లాట్‌ఫాంలపై ట్రాలీలు, తోపుడు బండ్లు నిలపరాదనే నిబంధన ఉంది. అయినప్పటికీ కొందరు కాంట్రాక్టర్లు తమ వాహనాలను ప్లాట్‌ఫాంలపై నిలుపుతున్నారు. ఆదివారం సాయంత్రం భారీగా గాలివాన రావటంతో ఒకటో నెంబర్ ప్లాట్‌ఫాంపై ఉంచిన ట్రాలీ కొట్టుకుపోయి ట్రాక్‌పై పడింది. దీంతో ప్రయాణికులు కొద్దిసేపు భయాందోళనకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న స్టేషన్ అధికారులు.. సిబ్బంది సహకారంతో ట్రాలీని ప్లాట్‌ఫాంపైకి తీసుకొచ్చారు. ఈ సమయంలో ప్లాట్‌ఫాంపై రైళ్లు రాకపోవటంతో పెద్ద ప్రమాదం తప్పింది.

# వంశీని వెంటాడుతున్న పీటీ వారెంట్లు



## ఒక కేసులో బెయిల్ వచ్చే లోగా మరో కేసు రెడీ

**తాజాగా తెరపైకి అక్రమ మైనింగ్ కేసు పీటీ వారెంట్**

### త్వరలో కోర్టులో దాఖలు చేసే అవకాశం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌ను పీటీ వారెంట్లు వెంటాడుతున్నాయి. ఒక కేసులో బెయిల్ మంజూరవుతుందనే సరికి మరో కొత్త కేసు చుట్టుకుంటోంది. బెయిల్ వస్తుందని ఆశలు రేకెత్తే సమయానికి పోలీసులు పీటీ వారెంట్లను పైకి తీస్తున్నారు. ఇప్పటికే వివిధ కేసుల్లో అరెస్టయిన వంశీ విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ముదునూరి సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో బెయిల్ వచ్చే సమయానికి నకిలీ ఇళ్లపట్టాల కేసు చుట్టుకుంది. ఆ తర్వాత వెంటనే గన్నవరం, బాపులపాడు మండలాల్లో జరిగిన అక్రమ మైనింగ్ కేసు సిద్ధమైంది. గన్నవరంలో వంశీ బినామీ పేర్లతో అనుమతులు తీసుకుని అక్రమ మైనింగ్ చేశారని, తద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.195కోట్ల నష్టం వాటిల్లిందని భూగర్భ గనుల శాఖ అధికారులు గన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. వరుస కేసులతో వంశీ ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఆరు కేసుల్లో మిగతా 4లో..

### తెరపైకి వస్తున్న పెండింగ్ కేసులు

ఆ తర్వాత నుంచి పెండింగ్‌లో ఉన్న అన్ని కేసుల్లోనూ పీటీ వారెంట్లను సిద్ధం చేశారు. గన్నవరంలో హైకోర్టు న్యాయవాది స్థలాన్ని కబ్జా చేసిన కేసులో కొద్దిరోజుల క్రితమే బెయిల్ మంజూరైంది. తర్వాత తాజాగా టీడీపీ కార్యాయలంపై దాడి కేసు, సత్యవర్ధన్ కిడ్నాప్ కేసుల్లో బెయిల్ వచ్చింది. ఒక్కో కేసులో బెయిల్ వస్తున్నా బయటకు వచ్చే అవకాశం కనిపించడం లేదు. వంశీపై ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న కేసులన్నీ ఇప్పుడు పైకి వస్తున్నాయి. బాపులపాడు మండలంలో నకిలీ పట్టాలతో ప్రజలను మోసం చేశారంటూ నమోదైన కేసులో ఆయన రిమాండ్ ఖైదీ అయ్యారు. ఈ కేసులో ఆయన నూజివీడు కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఇప్పుడు అక్రమ మైనింగ్‌కు సంబంధించిన కేసులో పీటీ వారెంట్‌ను గన్నవరం పోలీసులు సిద్ధం చేస్తున్నారు. ఈ పీటీ వారెంట్‌ను గన్నవరం కోర్టులో దాఖలు చేస్తారా, విజయవాడ ఏసీబీ కోర్టులో దాఖలు చేస్తారా అన్న విషయంలో సందిగ్ధత ఉంది. అక్రమ మైనింగ్‌పై ఇప్పటికే విజిలెన్స్ అధికారులు నివేదికను రూపొందించారు. ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లిన కేసు కాబట్టి ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ వారంలోనే పీటీ వారెంట్ దాఖలయ్యే సూచనలు ఉన్నాయి.



### భారీ వర్షం

నగరంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. విద్యాధరపురం, కుమ్మరిపాలెం ప్రధాన రోడ్లపై భారీగా నీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు, వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. -విజయవాడ, మే 18 (ఆంధ్రజ్యోతి)

# త్వరలో బెజవాడకు విద్యుత్ బస్సులు

**పీఎం ఈ-బస్ పథకంలో భాగంగా అద్దెకు**

- సిటీ సబర్బన్ పరిధిలో ఆధునిక ఏసీ బస్సులు
- విద్యాధరపురం డిపోలో సబ్‌స్టేషన్ కోసం ఆర్టీసీ దరఖాస్తు 4



# అనధికార దర్శనాలకు చెక్!

## టీటీడీ తరహాలో సిఫార్సు లేఖల ప్రక్రియపై కసరత్తు

- ఇద్దరు ఎంబీబీఎస్ వైద్యుల ఏర్పాటుకు చర్యలు
- సామాన్యులకు సులభంగా అమ్మవారి దర్శనమే లక్ష్యం
- పాలనను గాడిలో పెడుతున్న ఈవో శీనా నాయక్



ఇంద్రకీలాద్రి, మే 18 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై అనధికారిక దర్శనాలకు చెక్‌పెట్టేందుకు దుర్గగుడి ఈవో వి.కె.శీనా నాయక్ సిద్ధమయ్యారు. టీటీడీ తరహాలో వీఐపీల ప్రోటోకాల్ దర్శనాలకు సిఫార్సు లేఖలు ఉంటేనే అమ్మవారి దర్శనానికి అనుమతించే విధంగా చర్యలు చేపడుతున్నారు. అందుకుగాను ఒక విధానాన్ని రూపొందించారు. అమ్మవారిని దర్శించుకోవటానికి సాధారణ రోజుల్లో 30 వేల నుంచి 40 వేల మంది భక్తులు వస్తుంటారు. అదే శుక్ర, శని, ఆదివారాల్లో ఆ సంఖ్య 50 వేల నుంచి 60వేలకు చేరుతుంది. సాధారణ రోజుల్లో కన్నా శుక్ర, శని, ఆదివారాల్లో మిగతా 4లో..

### ఇద్దరు ఎంబీబీఎస్ వైద్యుల నియామకానికి చర్యలు

దేవస్థానానికి వచ్చే భక్తుల ఆరోగ్య భద్రత దృష్ట్యా అధికారులు మహామండపం ఏడవ అంతస్తులో ప్రథమ చికిత్సా కేంద్రం ఏర్పాటు చేశారు. 26 ఏళ్లుగా ఆర్ఎంపీ కనకారావుతో పాటు ఇద్దరు నర్సులు పనిచేస్తున్నారు. ప్రథమ చికిత్సా కేంద్రంలో మందులను వన్‌టౌన్‌కు చెందిన ఓ వ్యాపారితో పాటు పలువురు ఉచితంగా అందజేస్తున్నారు. ఈ కేంద్రంలో ఎంబీబీఎస్ స్థాయి వైద్యులు లేకపోవటం వల్ల కొన్నిసార్లు భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో పలువురు ఈవోలు ఎంబీబీఎస్ స్థాయి డాక్టర్లు కావాలని ఉన్నతాధికారులకు సూచించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సుమారు ఏడేళ్ల క్రితం ఎంబీబీఎస్ డాక్టర్ కొద్ది రోజులు మాత్రమే పనిచేసి ఆ తర్వాత మానివేశారు. ప్రస్తుతం చికిత్సా కేంద్రంలో ఇద్దరు ఎంబీబీఎస్ స్థాయి వైద్యులు అవసరమంటూ ఈవో శీనా నాయక్ కలెక్టర్‌ను కోరారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఆర్ఎంపీతో పాటు ఉదయం, సాయంత్రం ఇద్దరు వైద్యులు భక్తులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం పలువురు ఉచితంగా మందులు అందజేస్తుండగా, దేవస్థానం కూడా ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించేందుకు ఈవో తగిన చర్యలు చేపట్టనున్నారు.

# మ్యూజియాలు నాగరికతకు దర్పణాలు

- కొండపల్లి ఖిల్లాకు కాలినడకన కలెక్టర్ లక్ష్మీశ
- చారిత్రక ఔన్నత్యాన్ని చాటి చెప్పేందుకే.. 4



# 6,7,8, తేదీల్లో బీచ్ ఫెస్టివల్

- మంత్రి కొల్లు రవీంద్ర 4




అభయాంజనేయస్వామిని దర్శించుకున్న నారా రోహిత్, మంచు మనోజ్

## అభయాంజనేయస్వామి సేవలో సినీ నటులు
# మంచు మనోజ్, నారా రోహిత్

**హనుమాన్‌జంక్షన్, మే 18 (ఆంధ్రజ్యోతి)** : జంక్షన్‌లో అభయాంజనేయ స్వామిని సినీనటులు నారా రోహిత్, మంచు మనోజ్ ఆదివారం దర్శనం చేసుకున్నారు. ఈనెల 30న 'భైరవం' చిత్రం విడుదల నేపథ్యంలో విజయవాడ నుంచి ఏలూరు వెళుతూ మార్గమధ్యలో ఆలయాన్ని సందర్శించారు. ఈవో తారకేశ్వరరావు ఆలయ మర్యాదలతో వారికి సాదర స్వాగతం పలుకగా అర్చకులు తీర్థ ప్రసాదాలతో ఆశీస్సులు అందించారు. ఈవో వారికి స్వామివారి శేష వస్త్రం, చిత్రపటాన్ని బహూకరించారు. నిర్మాత కేకే రాధామోహన్, కనకమేడల విజయ్ తదితరులు వారివెంట ఉన్నారు. టీడీపీ తెలుగు మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికళ్యాణి, స్థానిక టీడీపీ నాయకులు వేమూరి శ్రీనివాసరావు, వడ్డి వాసవీ తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.


పోరంకిలో మినీ మహానాడులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, కొనకళ్ల తదితరులు

## వైభవంగా మినీ మహానాడు

- పెనమలూరు ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం
- బోడె ప్రసాద్, కొనకళ్ల నారాయణ

**పెనమలూరు, మే 18 (ఆంధ్రజ్యోతి)** : నియోజకవర్గంలోని పోరంకి ఎల్ఎన్ గార్డెన్స్‌లో ఆదివారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన మినీ మహానాడుకు వేలాదిగా పార్టీశ్రేణులు తరలివచ్చారు. తెలుగుమహిళలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తొలుత పార్టీ వ్యవస్థాపకుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇటీవల మృతిచెందిన పలువురు టీడీపీ కార్యకర్తలకు నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి అత్యధిక ఓట్లు వేసిన స్థానాల్లో పెనమలూరు నాల్గవ స్థానంలో ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పదినెలల్లో నియోజకవర్గ వ్యాప్తంగా జరిగిన అభివృద్ధిని వివరించారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధిని సమన్వయ పరచుకొని ముందుకు వెళుతున్నామన్నారు. కూటమి నేతలతో కలిసి ప్రయాణిస్తున్నామన్నారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసి స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం చేస్తామని తెలిపారు. పార్టీశ్రేణులు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, తెలుగుతమ్ముళ్లకు మహానాడు ఒక పండుగలాంటిదని పేర్కొన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్ ఎప్పుడూ బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం పనిచేసిన వ్యక్తి అని పేర్కొన్నారు.


సభ్యత్వం కిట్లను అందజేస్తున్న ఉదయభాను

## స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

- పార్టీశ్రేణులకు సామినేని పిలుపు

**గాంధీనగర్, మే 18 (ఆంధ్రజ్యోతి)** : త్వరలో జరగనున్న మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషిచేయాలని పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను పార్టీ నేతలు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ క్రియాశీలక సభ్యత్వ కిట్స్ పంపిణీ కార్యక్రమం 36వ డివిజన్ అధ్యక్షుడు యాంపాటి ప్రభాజీ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కందుకూరి కళ్యాణ మండపంలో ఆదివారం జరిగింది. క్రియాశీల సభ్యత్వ కార్డులు, పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సందేశ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ, జనసైనికులు, ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. 15వ డివిజన్‌లో రెండువేల సభ్యత్వాలు నమోదు చేసిన గాదిరెడ్డి అమ్ములును అభినందించారు. రాష్ట్ర కార్యదర్శి అమ్మిశెట్టి వాసు, బొలిశెట్టి వంశీకృష్ణ, బాడిత శంకర్, సోమనాథం తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో బెజవాడకు విద్యుత్ బస్సులు

- పీఎం ఈ-బస్ పథకంలో భాగంగా అద్దెకు
- సిటీ సబర్బన్ పరిధిలో ఆధునిక ఏసీ బస్సులు
- విద్యాధరపురం డిపోలో సబ్‌స్టేషన్ కోసం ఆర్టీసీ దరఖాస్తు

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ)** : రెండు నెలల్లో నగరానికి ఆర్టీసీ విద్యుత్ బస్సులు రాబోతున్నాయి. విజయవాడ రోడ్లపై అధునాతన ఏసీ సిటీ బస్సులు కనువిందు చేయనున్నాయి. 'పీఎం ఈ బస్' పథకంలో భాగంగా



గ్రీన్‌సెల్ మొబిలిటీ సంస్థ 100 ఎలక్ట్రిక్ బస్సులను సరఫరా చేయనున్నట్టు తెలుస్తోంది. ఈకేఏ మొబిలిటీ సంస్థ భాగస్వామ్యంతో అద్దె ప్రాతిపదికన విజయవాడ సిటీ సబర్బన్ పరిధిలో ఈ బస్సులను నడపనున్నారు. విజయవాడ సిటీ బస్సులకు తగినట్టుగా వీటి బాడీ బిల్డింగ్ జరుగుతోంది. రెండు డోర్ల విధానంతో సీట్లు లగ్జరీగా, సౌకర్యవంతంగా ఉంటాయి. బస్సు అంతా ఎయిర్ కండీషన్డ్ ఉంటుంది. బస్సులో ఎల్ఈడీ టీవీ, డాల్బీ సరౌండ్ సౌండ్ సిస్టమ్‌తో పాటు, ఎలక్ట్రానిక్ డిస్‌ప్లే బోర్డులు, ఫోన్ చార్జర్ సాకెట్ తదితర సదుపాయాలు కల్పించనున్నారు. సిటీ సబర్బన్ పరిధిలో విజయవాడ నుంచి మైలవరం, విజయవాడ-గన్నవరం, విజయవాడ-హనుమాన్ జంక్షన్, విజయవాడ-కంకిపాడు, విజయవాడ-ఉయ్యూరు, విజయవాడ-పామర్రు, విజయవాడ-నందిగామల వరకు ఈ బస్సులు వివిధ రూట్లలో తిరగనున్నాయి. ఈ ఎలక్ట్రికల్ బస్సుల కోసం విద్యాధరపురం బస్‌డిపోను కేటాయించారు. 32 కేవీ సబ్‌స్టేషన్ కోసం ఆర్టీసీ అధికారులు దరఖాస్తు చేశారు. సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసి పవర్ లైన్స్ ఇస్తే చాలు. చార్జింగ్ యూనిట్స్ అన్నీ దీని నిర్వహణ చూసే సంస్థ ఏర్పాటు చేయనుంది.

# మ్యూజియాలు నాగరికతకు దర్పణాలు

- కొండపల్లి ఖిల్లాకు కాలినడకన కలెక్టర్ లక్ష్మీశ
- చారిత్రక ఔన్నత్యాన్ని చాటి చెప్పేందుకే

**ఇబ్రహీంపట్నం, మే 18 (ఆంధ్రజ్యోతి)** : మ్యూజియాలు కేవలం జ్ఞాపకాల గదులు మాత్రమే కాదని.. అవి మన నాగరికతకు దర్పణాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా ఆయన ఆదివారం కొండపల్లి ఖిల్లాకు కాలినడకన చేరుకున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విభిన్న సంస్కృతులను ముందుతరాలకు పరిచయం చేసే విజ్ఞాన భాండాగారాలు మ్యూజియాలని, సంస్కృతి, చారిత్రక పరిరక్షణలో వాటి పాత్ర విశిష్టమైదన్నారు. 'మారుతున్న సమాజాల్లో మ్యూజియాల భవిష్యత్తు' అనే ఇతివృత్తంతో ఈ ఏడాది అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. ఆధునిక సమాజ అవసరాలకనుగుణంగా చారిత్రక వారసత్వాన్ని కాపాడేందుకు మ్యూజియాల అభివృద్ధి చెందుతున్న తీరుకు ఇది అద్దం పడుతుందన్నారు. విజయవాడలోని బాపు మ్యూజియం, కొండపల్లి కోటలోని మ్యూజియం వంటి వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వేగంగా మారుతున్న ప్రపంచంలో మనం ఎక్కడి నుంచి వచ్చామో అర్థం చేసుకోవడానికి ఇవి సహాయతాయని, మార్గదర్శక జ్ఞానాన్ని అందిస్తాయని చెప్పారు. కొండపల్లి ఖిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. మ్యూజియాల విశిష్టతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కావూరి చైతన్య, జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్పా, డీఎఫ్‌వో సతీష్, కొండపల్లి మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన, ఏపీ అడ్వంచర్ అసోసియేషన్ విజయవాడ ప్రెసిడెంట్ తరుణ్ కాకాని, ఏపీ టూరిజం అథారిటీ కన్సలెంట్ సాహితి, టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.


కొండపల్లి ఖిల్లాలో కలెక్టర్ లక్ష్మీశ ట్రెక్కింగ్


కొండపల్లి ఖిల్లా మ్యూజియం ఎదుట కలెక్టర్, అధికారులు

## ఖిల్లాకు రోప్ వే.. దిశగా అడుగులు!

- 2014-19 మధ్య కాలంలో టీడీపీ హయాంలో ప్రతిపాదనలు
- కొండపల్లి బొమ్మల అందాలు తిలకిస్తూ ఖిల్లాకు వెళ్లే అవకాశం


ఖిల్లా ముందు భాగంలో మూసుకుపోయిన నడక దారి


ఖిల్లా రోడ్డులో మూతపడిన పురావస్తు, ప్రదర్శనశాలలశాఖ కార్యాలయం

**(ఇబ్రహీంపట్నం, ఆంధ్రజ్యోతి)** చారిత్రక ప్రసిద్ధి గాంచిన పర్యాటక ప్రాంతం కొండపల్లి ఖిల్లా.. మూడు దశాబ్దాలుగా మూత పడిన నడక దారికి మంచి రోజులు రానున్నాయి. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో రోప్ వే నిర్మాణానికి మార్గం సుగమం కానుంది. ఖిల్లాకు వెనుక వైపు ఎన్టీటీపీఎస్ బూడిద చెరువు పక్క నుంచి ఘాట్ రోడ్డు ప్రస్తుతం అందరికీ తెలిసిన దారి. అయితే 1980-90 మధ్యకాలం వరకు కొండపల్లి ఖిల్లా సందర్శించాలంటే అందరూ ముందు వైపు ఉన్న నడకదారినే వెళ్లేవారు. 1988లో ఖిల్లాకు ఎగువన టీవీ టవర్ ఏర్పాటు చేసేందుకు ఖిల్లాకు వెనుక వైపు ఉన్న ఘాట్ రోడ్డును తారు రోడ్డుగా అభివృద్ధి చేశారు. అప్పటి నుంచి ఖిల్లాకు ముందు నడక దారిని మరుగున పడిపోయింది. బస్టాండ్ సమీపంలో గత వైభవ ఆనవాళ్లు ఇప్పటికీ దర్శనమిస్తాయి. ప్రస్తుతం అవి పిచ్చి చెట్ల మధ్య ఉన్నాయి. పురావస్తు, ప్రదర్శనశాలల కార్యాలయం మూతపడింది. కొండపల్లి ఖిల్లా అంటే గుర్తుకు వచ్చేది ముందు కొండపల్లి పట్టణం. అయితే ఖిల్లాకు వెళ్లే వారు కొండపల్లి చూడకుండానే ఘాట్‌రోడ్డు మీదుగా కొండపల్లి ఖిల్లా సందర్శించి వెళుతున్నారు. కొండపల్లి బొమ్మలు కొనుగోలు చేసుకోవాలంటే తప్ప ఇటు వైపు రావడం లేదు. ఈక్రమంలో 2014-19 మధ్యకాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఖిల్లాపై అనేక సాంస్కృతిక కార్యక్రమాలు, లేజర్ షోలు నిర్వహించంతో పాటు ఖిల్లాపైకి రోప్ వే సన్నాహాలు చేసింది. అయితే 2019లో అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం ఆ ప్రతిపాదనను పక్కన పెట్టేసింది.

### కలెక్టర్ ట్రెక్కింగ్‌తో వెలుగులోకి పాత మార్గం

కలెక్టర్ జి.లక్ష్మీశ కొండపల్లి ఖిల్లాపైకి నడకదారిలో ట్రెక్కింగ్ చేస్తూ మూతపడిన మార్గంలో కొండపల్లి కోటకు చేరుకున్నారు. దీంతో ఈ దారికి పూర్వ వైభవం వస్తుందనే అభిప్రాయం కలుగుతోంది. ఇక్కడ రోప్ వేను ఏర్పాటు చేస్తే ఖిల్లాకు వచ్చే పర్యాటకులు దారి పొడవునా కొండపల్లి బొమ్మలను తిలకించడంతో పాటు వాటిని కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది.

### సమయం, డబ్బు ఆదా..

ఖిల్లాకు ముందు దారి ఏర్పాటు చేస్తే అటు సమయంతో పాటు ఇటు రవాణా ఖర్చులు సైతం కలిసి వచ్చే అంశాలుగా పర్యాటకులు భావిస్తుంటారు. అంతేకాక కొండపల్లి రైల్వేస్టేషన్ నుంచి ఖిల్లా మార్గానికి సులువుగా చేరుకునే వీలుంటుంది. పైగా బస్సులు ఖిల్లా రోడ్డు వరకు వస్తాయి. రోప్ వే ఏర్పాటుతో సమయం, ఖర్చు ఆదా అవుతుంది. పెద్ద ఎత్తున పర్యాటకం అభివృద్ధి చెందే వీలుంటుంది.

# పట్టాభి స్మారక భవనానికి ప్రాధాన్యత ఏదీ!

- జిల్లా కలెక్టర్, కమిషనర్, మేయర్, రీజనల్ డైరెక్టర్‌లకు నోటీసులు

**మచిలీపట్నం టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి)** : ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపకుడు భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణానికి మునిసిపల్ కౌన్సిల్ ఎన్‌వోసీ ఇవ్వకపోవడంతో కమిషనర్, మేయర్, కలెక్టర్, రీజనల్ డైరెక్టర్‌లకు పట్టాభి స్మారక భవననిర్మాణ కమిటీ తరపున న్యాయవాదులు సోడిశెట్టి బాలాజీ, కె.సాయి సుదర్శన్‌లు నోటీసులు జారీ చేశారు. భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవనానికి నాటి ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి స్థలం కేటాయించాలని ఆదేశాలు జారీచేసినా మునిసిపల్ కౌన్సిల్ ఎన్‌వోసీ ఇచ్చేందుకు ముందుకు రాకపోవడం తెలిసిందే. 2022 ఏప్రిల్ 22న సీసీఎల్‌ఏ కూడా రెండెకరాల స్థలం కేటాయించాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు భవన నిర్మాణానికి కౌన్సిల్ ఎన్‌వోసీ ఇవ్వాల్సి ఉన్నా.. మూడేళ్లుగా జాప్యం చేస్తోంది. దీనిపై పలు ఉద్యమాలు నడిచాయి. కమిటీ ప్రతినిధులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు మునిసిపల్ కౌన్సిల్‌లో చర్చించాలని ఉత్తర్వులు జారీ చేసినా.. ఇప్పటికీ కౌన్సిల్ సమావేశంలో భవన నిర్మాణ అంశాన్ని ప్రవేశ పెట్టలేదు. దీనిపై పలు పర్యాయాలు కలెక్టర్, కమిషనర్‌కు పట్టాభి భవన నిర్మాణ కమిటీ ప్రతినిధులు వినతిపత్రాలు ఇచ్చారు. అయినప్పటికీ స్పందించకపోవడంతో హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయాలని మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, మేయర్, కలెక్టర్, రీజనల్ డైరెక్టర్‌కు న్యాయవాదులు లీగల్ నోటీసులు ఇచ్చారు. ఈ నోటీసులపై ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

## వైసీపీ కార్యాలయం కొలతలు వేయండి!

- టౌన్‌ప్లానింగ్ అధికారులకు కమిషనర్ ఆదేశాలు


వైసీపీ కార్యాలయం

**మచిలీపట్నం టౌన్:** ఈడేపల్లిలో నిర్మించిన వైసీపీ కార్యాలయ విస్తీర్ణం కొలతలు వేయాలంటూ టౌన్ ప్లానింగ్ అధికారి, టౌన్ సర్వేయర్, మునిసిపల్ రెవెన్యూ అధికారి తదితరులకు శనివారం సాయంత్రం మునిసిపల్ కమిషనరు బాపిరాజు ఆదేశాలు జారీ చేశారు. కార్యాలయం ఎంత స్థలంలో నిర్మించిందీ స్కెచ్ వేయాలంటూ కిందిస్థాయి అధికారులకు కమిషనరు ఆదేశాలు జారీ చేశారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పేర్ని నాని సమక్షంలో టౌన్ ప్లానింగ్ అధికారులు కొలతలు వేయాలని కమిషనర్ ఆదేశించారు. భవనం, ఖాళీస్థలం పన్నుల వివరాలు తెలియచేయాలన్నారు. కాగా గతంలో ఈ భవనం అక్రమంగా నిర్మించారంటూ ఆందోళనకు దిగిన అప్పటి ప్రతిపక్ష నేత కొల్లు రవీంద్ర భవనం చూసేందుకు వెళ్లగా పోలీసులు అడ్డుకుని స్టేషన్ల చుట్టూ తిప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు కావస్తున్నందున ఈ భవనంపై ప్రభుత్వ నిర్ణయం ఎలా ఉంటుందోనని స్థానికంగా చర్చనీయాంశమైంది.

## అనధికార దర్శనాలకు చెక్!

(3వ పేజీ తరువాయి)

వీఐపీల తాకిడి ఎక్కువగా ఉంటుంది. దేవస్థానంలోని కొందరు ఉద్యోగులు, కొండదిగువన ఉండే దళారులు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులతో అంతరాలయంలో అమ్మవారి దర్శనం కల్పిస్తామని ప్యాకేజీ మాట్లాడుకుని దేవస్థానం పైన, టికెట్ల తనిఖీల వద్ద విధులు నిర్వహించే కొందరు ఉద్యోగులతో లాలూచీపడి అనధికారికంగా దర్శనాలు చేయిస్తున్నారు. దీని వల్ల రూ.500, రూ.300 టికెట్లు కొనుగోలు చేసిన భక్తులు క్యూలలో గంటల తరబడి వేచి ఉంటున్నారు. అంతేకాకుండా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులకు చెందిన వారమంటూ కొందరు ఎలాంటి టికెట్లు తీసుకోకుండా రాజమార్గం నుంచి వెళ్లి అమ్మవారి దర్శనం చేసుకుంటున్నారు. దీనిని ఆసరాగా తీసుకుని కొందరు ఉద్యోగులు భక్తుల వద్ద డబ్బులు తీసుకుని అడ్డదారిలో అమ్మవారి దర్శనం కల్పిస్తున్నారు. దీని వల్ల టికెట్ కొనుగోలు చేసిన భక్తులు ఇబ్బంది పడటమే కాకుండా దేవస్థానం ఆదాయానికి భారీగా గండిపడుతోంది. ఈ నేపథ్యంలో ఈవోగా బాధ్యతలు తీసుకున్న శీనా నాయక్ అనధికార దర్శనాలపై దృష్టిపెట్టారు. సంబంధిత విభాగాల అధికారులతో మాట్లాడి అనధికార దర్శనాలు చేయిస్తే డ్యూటీలో ఉన్న ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవటంతో పాటు టికెట్ల రుసుం కూడా వసూలు చేస్తానని హెచ్చరించారు. మరోపక్క టికెట్ల రీసైక్లింగ్‌పై కూడా దృష్టి సారించారు. టీటీడీ తరహాలో సిఫార్సు లేఖలు ఉంటేనే దర్శనం కల్పించే విధంగా చర్యలు చేపడుతున్నారు. కంప్యూటర్ సిబ్బందిని నియమించి ఆన్‌లైన్ ద్వారా దేవస్థానానికి వచ్చే సిఫార్సు లేఖలను ఎప్పటికప్పుడు పరిశీలించి వారికి స్లాట్‌ల ప్రకారం దర్శనాలు కల్పించే విధంగా ప్రయత్నం చేస్తున్నారు.

## వంశీని వెంటాడుతున్న పీటీ వారెంట్లు

(3వ పేజీ తరువాయి)

విచారణ ఎదుర్కొంటున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా వంశీ అడ్డగోలుగా వ్యవహరించారు. చంద్రబాబు కుటుంబంపై వ్యక్తిగతంగా దూషణలు చేయడంతో పాటు గన్నవరంలో టీడీపీ కార్యాలయంపై దాడి చేయించడం, ఆ కేసు నుంచి తప్పుకునేందుకు ఫిర్యాదుదారుడిగా ఉన్న సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసిన ఘటనలపై కేసులు నమోదయ్యాయి. గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో వంశీ 71వ నిందితుడిగా ఉన్నారు. ఈ కేసు నుంచి బయటపడేందుకు వంశీ అత్యుత్సాహం చూపారు. ఫిర్యాదుదారుడు సత్యవర్ధన్‌ను బెదిరించి కేసును ఉపసంహరించుకునేలా చేశారు. ఈ కేసులో వంశీ ఇరుక్కుపోయారు. ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్లతో కేసు నమోదు చేశారు. ఈ కేసులో అరెస్టయిన వంశీకి బయటకు వచ్చే దారులు మూసుకుపోతున్నాయి.

## సైబర్ టెర్రర్!

(3వ పేజీ తరువాయి)

ఒక ఊపు ఊపేశాయి. ఈ డిజిటల్ అరెస్టు నేరాల్లో బాధితుల సంఖ్య పెరగడానికి బ్యాంకులే కారణమని పోలీసులు భావించారు. దీనితో బ్యాంకులకు ఒక ఎస్‌వోపీ(స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్)ను జారీ చేశారు. ఖాతాదారులు ఎవరైనా హడావుడిగా బ్యాంకులకు వచ్చి భారీ మొత్తంలో డబ్బులు వేరే ఖాతాల్లో జమ చేసినా, ఆర్టీజీఎస్ ద్వారా మరొకరికి పంపినా వారికి సంధించాల్సిన ప్రశ్నలను రూపొందించి ఇచ్చారు. ఈ విధంగా చేయడంతో డిజిటల్ అరెస్టులకు బ్రేక్ పడింది. సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టుల పేరుతో ఫోన్లు చేసినప్పటికీ వారు అనుకున్న లక్ష్యం నెరవేరకుండా బ్యాంకర్లు అడ్డుకున్నారు. సైబర్ నేరగాళ్లకు డబ్బులు జమ చేయడానికి వచ్చిన బాధితులకు అవగాహన కల్పించి సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌కు పంపేవారు.

## ట్రాన్స్‌కోనా మజాకా!

(3వ పేజీ తరువాయి)

పనులు ప్రారంభించటానికి రెండు నెలల ముందు ఇవ్వాలి. కానీ ట్రాన్స్‌కో అధికారులు మాత్రం పనులు ప్రారంభించి, పురోగతిలో ఉన్న తర్వాత ప్రజాభిప్రాయ సేకరణ నోటిఫికేషన్ ఇచ్చారు. దీనిపై ఎవరైనా అభ్యంతరం వ్యక్తం చేస్తే ఏమి చేస్తారు? ప్రజాభిప్రాయ సేకరణ విధానాన్ని అపహాస్యం పాలుచేశారని కోర్టును ఆశ్రయిస్తే ఏమవుతుందన్న ఆలోచన కూడా చేయకపోవటం గమనార్హం. ఒకవేళ కోర్టు అక్షింతలు వేసి పనులు నిలుపుదల చేయమంటే ఇప్పటి వరకు ఖర్చుపెట్టిన కోట్ల రూపాయలు వృథా అయినట్టేనని విమర్శలు వినిపిస్తున్నాయి.

### ముచ్చటగా మూడోది..

గన్నవరంలో కడుతున్న మూడో 32 కేవీ సబ్‌స్టేషన్ ఇది. ప్రస్తుతం గన్నవరంలో ఉన్న పాత సబ్‌స్టేషన్ పక్కనే కోట్లాది రూపాయల వ్యయంతో సబ్‌స్టేషన్‌ను కట్టి, దానిని వినియోగంలోకి తీసుకురాకుండా వదిలేశారు. దీంతో పాత సబ్‌స్టేషనే దిక్కుగా మారింది. కొత్తగా కట్టిన సబ్‌స్టేషన్‌ను అందుబాటులోకి తీసుకురాకుండానే.. మేధా ఐటీ టవర్ సమీపంలో 132/33 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అక్కడ కూడా సబ్‌స్టేషన్ కట్టడానికి టెండర్లు పిలిచారు. పనులు ప్రారంభించగానే.. ఆగిపోయాయి. దీంతో ఈ రెండింటినీ కాదని గన్నవరం ఎయిర్‌పోర్టులో మూడోదిగా సబ్‌స్టేషన్ నిర్మిస్తున్నారు. రెండు చోట్ల విఫలమైన విద్యుత్ శాఖ అధికారులు కనీసం మూడో చోట అయినా జాగ్రత్తగా వ్యవహరించాల్సింది పోయి.. ఇక్కడ కూడా పనులు మొదలు పెట్టేసి పురోగతిలో ఉన్న తర్వాత ప్రజాభిప్రాయ సేకరణ నోటిఫికేషన్ ఇచ్చారు. పనులు మొదలు పెట్టేసిన తర్వాత అభ్యంతరాలు తీసుకోవటమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.


ఆంధ్రప్రదేశ్ రాజపత్రము
THE ANDHRA PRADESH GAZETTE
PUBLISHED BY AUTHORITY
NOTIFICATIONS BY HEADS OF DEPARTMENTS Etc.

నోటిఫికేషన్ విడుదల కాపీ


హజ్ యాత్ర బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న మత పెద్దలు

## మక్కాలో రాష్ట్రం, దేశం కోసం ప్రార్థించండి

- హజ్ కమిటీ చైర్మన్ హాజీ హాసన్ బాషా

**వన్‌టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి)** : మక్కా యాత్రకు వెళ్లేవారు రాష్ట్రం, దేశం అభివృద్ధి కోసం ప్రార్థించాలని ఏపీ హజ్ కమిటీ చైర్మన్ హాజీ హాసన్ బాషా అన్నారు. విజయవాడ షాజహూర్ ముసాఫిర్ ఖానా వద్ద నుంచి ఆదివారం రాష్ట్ర హజ్ కమిటీ ఆధ్వర్యంలో 98 మంది హజ్ యాత్రకు బయలుదేరారు. ఈ సందర్భంగా చైర్మన్, టీడీపీ రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి ఎండీ ఫతావుల్లా, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఎస్.బేగ్‌తో కలిసి ఆయన బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, హజ్ యాత్రకు కావాల్సిన అన్ని వసతులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు. మక్కా, మదీనా నగరాల్లో అన్ని వసతులతో ఉండేలా ఏర్పాట్లు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు అబ్దుల్ సలాం, మౌలానా సత్తార్ ఖాన్, హఫీజ్ అన్వర్ ఆలీ, టీడీపీ మహిళా ఉపాధ్యక్షురాలు షేక్ ఆషా తదితరులు పాల్గొన్నారు.


అంతర్‌జిల్లా ఈత పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

## ఈత పోటీలకు క్రీడాకారుల ఎంపిక

**కంకిపాడు, మే 18 (ఆంధ్రజ్యోతి)** : జూన్ 1న నరసరావుపేటలో నిర్వహించనున్న సీనియర్ నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక ఆదివారం ఈడుపుగల్లులో జరిగింది. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు చెందిన క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎన్టీఆర్ జిల్లా పురుషుల విభాగంలో ఎ.దేవ గణేష్, ఎం.శరత్, పీవీ సత్యనారాయణ, పి.కిరణ్, వై.రోహిత్ మల్లిఖార్జున, కె.శక్తిధర్, టి.పార్థు, బి.బాల గంగాధర్, వి.గిరిష్, డి.సత్యమూర్తి, మహిళల విభాగంలో యు.ప్రమముర్త, పి.రమ్యసాయి, కె.సాన్వి, సీహెచ్ మౌనిక, ఎల్.మేఘన, ఎం.దేవిదుర్గ ఎంపికయ్యారు. కృష్ణాజిల్లా నుంచి పురుషుల విభాగంలో మూర్తి మనహర్ గురునాథ్, ఎం.ఎ. జయ బాబు, పి.నీరజ్ మనికంఠ, పీబీ అనంత్ రెడ్డి, టి.పృథ్వి ప్రసాద్, ఎస్.హర్ష వర్ధన్, గిర్ల, మహిళల విభాగంలో టి.సహస్ర, ఎస్.సిరి చందన, డి.వి.ఎస్ఆర్ లక్ష్మిలు ఎంపికయ్యారు.

## జూన్ 6, 7, 8, తేదీల్లో బీచ్ ఫెస్టివల్

- ఏర్పాట్లపై మంత్రి రవీంద్ర సమీక్ష

**మచిలీపట్నం టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి)** : మంగినపూడి బీచ్‌లో జూన్ 6, 7, 8 తేదీల్లో నిర్వహించనున్న బీచ్ ఫెస్టివల్‌కు వచ్చే లక్షలాది పర్యాటకులు, యాత్రీకులకు అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర అధికారులకు సూచించారు. ఆదివారం రాత్రి మంగినపూడి బీచ్‌ను అధికారులతో మంత్రి సందర్శించారు. అమరావతి గేట్‌పై సినీడిజైనర్ వంకా రమణతో చర్చించారు. ఫుడ్ కోర్టుల ఏర్పాటుపై మెప్మా పీడీ సాయిబాబుతో చర్చలు జరిపారు. మసులా ఫెస్టివల్-2025 జాతీయ స్థాయి ఈవెంట్‌గా రూపొందించాలని, ఇందుకు కావలసిన అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులకు, కళాకారులకు సూచించారు. బీచ్ ఫెస్టివల్‌లో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు, జలక్రీడల్లో పాల్గొనే క్రీడాకారులకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, ఆర్‌అండ్‌బీ, ఎలక్ట్రికల్, రెవెన్యూ, మత్స్యశాఖ, పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నేటితో ఉత్కంఠకు తెర

(3వ పేజీ తరువాయి)

కూటమి వైపు మొగ్గుచూపుతారు అనేది సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది.

### ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి

తిరువూరు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఎన్నికల అధికారి, ఆర్డీవో కె.మాధురి ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ లోవరాజు కౌన్సిల్‌హాల్‌లో ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా హాల్‌లో సీసీ కెమెరా ఏర్పాటు చేశారు. సీఐ గిరిబాబు, ఎస్సై కె.వి.జి.వి.సత్యనారాయణ ఎన్నిక సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. కోకిలంపాడు రోడ్డులో మున్సిపల్ కార్యాలయం నుంచి సుమారు 100 మీటర్ల వరకు రాకపోకలు నిషేధించారు.

## గంజాయి కేసులో ఇద్దరి అరెస్టు

**ఆటోనగర్, మే 18 (ఆంధ్రజ్యోతి):** యనమలకుదురుకు చెందిన షేక్ ఖాదర్ గ్లాస్ పనిచేస్తుంటాడు. రామలింగేశ్వర నగర్‌కు చెందిన గుర్రాల శివప్రసాద్ రెడ్డి ఓ ప్రైవేటు సంస్థలో రికవరీ ఏజెంట్‌గా పని చేస్తుంటాడు. వీరిద్దరు సుమారు మూడేళ్లుగా గంజాయికి అలవాటు పడ్డారు. నగరంలో గంజాయి దొరకడం లేదని, అరకు వెళ్లి రూ.8 వేలతో కేజీ గంజాయిని కొనుగోలు చేసి తిరిగి నగరానికి చేరుకున్నారు. ఈ క్రమంలో గంజాయి అక్రమ రవాణా చేస్తున్నారన్న సమాచారంతో పటమట పోలీసులు దాడి చేశారు. నిందితుల నుంచి కేజీ గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వల్లభనేని పవన్ కిషోర్ తెలిపారు.


మామిడి పండ్ల అలంకరణతో పాటు చందన సేవలో పాల్గొన్న భక్తులకు దర్శనమిచ్చిన జగన్నాథుడు

## జగన్నాథుడికి చందన, మామిడి పండ్ల సేవ

**రాణిగారితోట, మే18 (ఆంధ్రజ్యోతి):** స్క్రూ బ్రిడ్జి వద్ద గల జగన్నాథ మందిరంలో జగన్నాథుడుకి చందన సేవ, మామిడి పండ్ల సేవను వైభవంగా నిర్వహించారు. వేసవిలో నిర్వహించే చందనోత్సవంలో భాగంగా ఆదివారం మామిడి పండ్లతో స్వామికి సింహాసనాన్ని అలంకరించారు. విశేషంగా జగన్నాథుడు చతుర్భుజ మహావిష్ణుగా, బలభద్రుడు అనంతశేషునిగా, సుభద్ర దేవి అమ్మవారుగా భక్తులకు దర్శనమిచ్చారు. మందిర అధ్యక్షుడు చక్రధరి దాస్, వ్రజాదాం దాస్, బలరాం గోవింద దాస్, అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

## పొంగుతున్న డ్రైనేజీ.. జనం ఇబ్బందులు


9వ వార్డులో పొంగుతున్న డ్రైనేజీ

**బెంజిసర్కిల్, మే18 (ఆంధ్రజ్యోతి):** వీఎంసీ 9వ వార్డు బెంజిసర్కిల్ నుంచి వారధి వైపు వెళ్లే సర్వీస్ రోడ్డు ఎస్‌వీఎస్ కల్యాణ మండపం సమీపంలో డ్రైనేజీ పొంగి మురుగునీరు రోడ్డుపైకి వచ్చి దుర్వాసన కొడుతోంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా రు. బయటకు వచ్చి మురుగునీటిపై దోమలు, ఈగలు వృద్ధిచెందడం వల్ల పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా మారాయి. పాదచారుల సైతం అసౌకర్యాలనికి గురువుతున్నారు. వీఎంసీ అధికారులు దృష్టిసారించి డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాలని స్థానికులు కోరుతున్నారు.


ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

## జిల్లా స్విమ్మింగ్ క్రీడాకారుల ఎంపిక

**లబ్బీపేట (స్పోర్ట్స్), మే 18 (ఆంధ్రజ్యోతి):** స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ డిస్ట్రిక్ సెలక్షన్స్ ఆదివారం ఈడుపుగల్లులోని డీఎస్‌పీ స్విమ్మింగ్‌పూల్ నందు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు నరసరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కాలేజీలో జూన్ 1న జరిగే సీనియర్ నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సెలక్షన్స్‌లో ఏపీఏఏ చైర్మన్ కె.రవికాంత్, ప్రెసిడెంట్ ఎం.ఓబుల్ రెడ్డి, కె.రమేష్, భాస్కర్ పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్ నిర్వహణకు రూ.25వేల విరాళం


ఎమ్మెల్యే గద్దెకు చెక్కు అందజేస్తున్న కృష్ణమూర్తి

**పటమట, మే 18 (ఆంధ్రజ్యోతి):** 12వ డివిజన్‌కు చెందిన ఎన్ఆర్ఐ గుళ్లపల్లి కృష్ణమూర్తి తన తల్లిదండ్రుల పేరుతో అన్నక్యాంటీన్ నిర్వహణకు రూ.25 వేలు విరాళంగా చెక్కును ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పాలన అనుభవంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. పీ4 పథకంలో భాగంగా ఓ పేద కుటుంబాన్ని దత్తత తీసుకుంటానని కృష్ణమూర్తి చెప్పారని తెలిపారు.

## 27వ డివిజన్‌లో టీడీపీ కమిటీ సభ్యుల పర్యటన

**సత్యనారాయణపురం, మే 18 (ఆంధ్రజ్యోతి):** 27వ డివిజన్ టీడీపీ కమిటీ సభ్యులతో కలిసి ఆదివారం టీడీపీ రాష్ట్రప్రధానకార్యదర్శి నవనీతం సాంబశివరావు పర్యటించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డివిజన్ అధ్యక్షుడు జయరాజ్, ఎం.సురేష్, బి. శివ, కె.రూప్ కుమార్, బండారు కొండ, రవణమ్మ, రుక్మిణి పాల్గొన్నారు.



వీఎంసీ 9వ వార్డు చేపల మార్కెట్ వద్ద పేరుకుపోయిన చేపలు, రొయ్యల వ్యర్థాలు, చెత్తాచెదారం

# చెత్త డివిజన్

- ఫిష్ మార్కెట్ వద్ద చేపలు, రొయ్యల వ్యర్థాలతో దుర్వాసన
- ఇబ్బందిపడుతున్న స్థానికులు
- పటమటలంకలో పేరుకుపోయిన చెత్తకుప్పలు
- పట్టించుకోని శానిటరీ సిబ్బంది


పటమటలంక చెన్నుపాటి రామకోటయ్య వీధి సమీపంలో పేరుకుపోయిన చెత్త

**బెంజిసర్కిల్, మే 18 (ఆంధ్రజ్యోతి):** నగరంలోని 9వ డివిజన్‌లో చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. రోడ్ల వెంట చెత్తకుప్పలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతుంది. ఫిష్‌మార్కెట్ వద్ద మాంసం, చేపలు, రొయ్యల నుంచి తీసిన వ్యర్థాలను యథేచ్ఛగా రోడ్డుపై డస్ట్‌బిన్‌ల పక్కన పడవేయడంతో ఈగలు, దోమలు వృద్ధిచెందుతున్నాయి. పరసర ప్రాంతాల చెత్తను కూడా డస్ట్‌బిన్‌ల పక్కనే పడవేస్తుండటంతో పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. పటమటలంక చెన్నుపాటి రామకోటయ్య వీధి సమీపంలో రోడ్డుపైనే చెత్తకుప్పలు పడవేశారు. కనీసం డస్ట్‌బిన్ కూడా ఏర్పాటు చేయలేదు. అలాగే బెంజిసర్కిల్ నుంచి వారధి వైపు వెళ్లే సర్వీస్ రోడ్డులో ఎస్‌వీఎస్ కల్యాణ మండపం సమీపంలో రోడ్డుపై చెత్తతోపాటు పాడైన ట్యూబులైట్‌లు పడేశారు. గాలికి చెత్తరోడ్డుపైకి చేరుతోంది. దీనిపై మున్సిపల్ శానిటరీ అధికారులు దృష్టిసారించి చెత్తను తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


బెంజిసర్కిల్ సర్వీస్ రోడ్డు ఎస్‌వీఎస్ కల్యాణ మండపం సమీపంలో రోడ్డుపై చెత్తకుప్పలు

# దుర్గంధంతో ఇబ్బందులు

**భారతీనగర్, మే 18 (ఆంధ్రజ్యోతి):** ఏపీఐఐసీ కాలనీలోని జమాక్ అపార్టుమెంట్ సమీపంలోని నిర్మాన్‌భవన్ రోడ్డులో కొద్ది రోజుల నుంచి చెత్తకుప్పలు పెరుకుపోతున్నాయి. ఈ ప్రాంతం ఆటోనగర్ పరిధిలోని రావడంతో ఐలా వారి ప్రతి రోజు వచ్చిఈ రోడ్డులోని చెత్తను తమ వాహనంలో తరలిస్తారు. గత కొద్ది రోజుల నుంచి చెత్తకుప్పలు సరిగా తరలించకపోవడంతో దుర్గంధం వస్తుంది. 3 రోజుల నుంచి వర్షం పడడంతో తడిచిపోయి దుర్వాసన వెదజల్లుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


సాయి శ్రీకా అపార్టుమెంట్ రోడ్లో రెండు రోజుల నుంచి నిల్వ ఉన్న చెత్త


భద్రకాళి సమేత వీరభద్రస్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

## పాత శివాలయంలో వీరభద్రస్వామి కల్యాణం

**వన్‌టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి):** వన్‌టౌన్ భ్రమరాంబ మల్లేశ్వరస్వామివారి దేవస్థానం (పాత శివాలయం)లో ఆదివారం శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి వార్ల కళ్యాణం అత్యంత ఘనంగా జరిగింది. ఆలయ ఈ.ఓ నటరాజన్ షణ్ముగం ఆదేశాల మేరకు వీరభద్రస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు చింతలపాటి సూర్యనారాయణ శాస్త్రి అత్యంత భక్తిశ్రద్ధలతో స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. స్వామివారికి, అమ్మవారికి ఉదయం 8 గంటలకు మామిడి పండ్లు, అరటి పండ్లు, తదితరాలతో అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక వేదిక పై ఉత్సవ మూర్తులను ఉంచి గణపతి పూజ అనంతరం ఉభయదాతల చేత స్వామివార్ల కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం ఉభయదాతలకు, భక్తులకు స్వామివారికి నివేదించిన మహా ప్రసాదాన్ని అన్నప్రసాదంగా అందజేశారు. స్వామి కల్యాణ మహోత్సవాలు ఈనెల 16న ప్రారంభమయ్యాయి. కళ్యాణ మహోత్సవంతో ఈ ఉత్సవాలు పరిసమాప్తమయ్యాయి. స్వామివారి కళ్యాణోత్సవంలో పాతబస్తీకి చెందిన పలువురు ప్రముఖులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## సుజనా చౌదరికి శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ పరామర్శ

**వన్‌టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి):** విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ (సుజనా చౌదరి)ని ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్ పర్సన్ జకియా ఖానం వేర్వేరుగా పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు.

## ఒకరిపై దాడి.. కేసు నమోదు

**వన్‌టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి):** న్యూడిల్స్ బండికి అడ్డంగా బైక్ పెట్టాడని పటమటకు చెందిన దగ్గినేని నాగ సాయిరామ్ దాడి చేసిన ఘటనపై ఆదివారం గవర్నరుపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కంట్రోల్ రూమ్ వెనుక రోడ్డులో ఉన్న చెరుకు రసం బండివద్ద దగ్గినేని నాగ సాయిరామ్ తన మోటారు సైకిల్‌ను పార్కు చేశాడు. న్యూడిల్స్ బండి నిర్వాహకుడు గొడవ పడ్డాడు. రెండు నిమిషాల్లో వెళ్లిపోతానని బాధితుడు చెప్పినా బండి నిర్వాహకుడు సతీష్, అతని స్నేహితుడు సంజిత్ వాగ్వాదానికి దిగారు. గొడవ పెరిగి పక్కనే ఉన్న సతీష్ వద్ద స్టీల్ గరిటతో సాయిరామ్‌పై దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


నీట మునిగిన అంబేడ్కర్ రోడ్డు

# భారీ వర్షం.. రోడ్లు జలమయం

- పొంగిపొర్లిన డ్రెయిన్లు
- ప్రజలు, వాహనచోదకులకు తప్పని ఇక్కట్లు


కుమ్మరిపాలెం సెంటర్‌లో..

**వన్‌టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి):** విజయవాడలో ఆదివారం సాయంత్రం నుంచి భారీగా వర్షం కురిసింది. వాతావరణంలో పరిస్థితులు అన్నీ ఏకమై ముందస్తుగానే నైరుతి రుతుపవనాలు ఈసారి పలకరించాయి. పగటిపూట సెగలు కుమ్మరించిన వాతావరణంలో జనం అతలాకుతలమయ్యారు. ఒక్కసారిగా వర్షం పడటంతో జనం ఎండ వేడి నుంచి ఉపశమనం పొందారు. గంటసేపుకు పైగా గాలితో కూడిన జోరు వాన కురిసింది.

### డ్రెయినేజీలు పొంగిపొర్లాయి..

నగరంలోని రోడ్లు, డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉండటంతో రోడ్లపై నీరు నిలిచిపోయాయి. డ్రైన్లు పొంగిపొర్లుతున్నాయి. మురుగునీరు పారుదల లేక కాల్వలు, డ్రైనేజీలు పొంగిపొరలుతున్నాయి. కుమ్మరిపాలెం సెంటర్, విద్యాధరపురం, రామరాజ్యనగర్, కబేలా ప్రాంతం, భవానీపురం హెచ్‌బీ కాలనీ, ఏకలవ్య నగర్, ఊర్మిళా నగర్, కొత్తపేటలోని గణపతిరావు రోడ్డు, వించిపేట, పంజా సెంటర్, కేటీ రోడ్డులో, వన్‌టౌన్ జెండా చెట్టు రోడ్డు జలమయం అయ్యాయి. గాంధీనగర్, హనుమాన్‌పేట, గవర్నరుపేట, బీసెంట్ రోడ్డు, గోపాల రెడ్డి రోడ్డు, ఎన్టీఆర్ కాంప్లెక్స్ ప్రాంతం, సూర్యారావుపేటలోని పలు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. ఏలూరు రోడ్డులోని చుట్టుగుంట, మధురానగర్ ప్రాంతాల్లో జనం ఇబ్బందులు పడ్డారు. పాయకాపురం, ప్రజాశక్తినగర్, కండ్రిక, రాజీవ్‌నగర్, ఇందిరా నాయక్ నగర్, ఆంధ్రప్రభ కాలనీ, ఇలా అన్ని చోట్ల కూడా వర్షపు నీరు నిలిచింది. ఇక కొత్తరాజరాజేశ్వరిపేట, పాత రాజరాజేశ్వరిపేట, వైఎస్ఆర్ కాలనీల్లో రోడ్లపై నీరు నిలిచిపోవడంతో ప్రజలు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

### ముంపు నివారణ చర్యలు చేపట్టాలి


గొల్లపాలెం గట్టు ప్రాంతంలో రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ సత్యబాబు

**చిట్టినగర్ :** పశ్చిమలో ముంపు నివారణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని కార్పొరేటర్ బోయి సత్యబాబు అన్నారు. ఆదివారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి 50వ డివిజన్‌లో నీటమునిగిన రోడ్లను ఆయన పరిశీలించారు. కేవలం 20 నిమిషాల పాటు కురిసిన ఈ వర్షానికి ఈ పరిస్థితి పట్టిందని, రాబోయే వర్షాకాలంలో తీవ్రమైన వర్షాలకు మరింత ప్రమాదం ప్రజలు ఎదుర్కొబోతున్నారని సత్యబాబు ప్రశ్నించారు. పశ్చిమలో సితార సెంటర్ నుండి కబేళా సెంటర్ వరకు, గొల్లపాలెం గట్టు మహంతిపురం, వించిపేట నైజాంగేటు, జెండ చెట్టు తదితర ప్రాంతాలు ఈ అకాల వర్షానికి జలమయం అయ్యాయన్నారు. ప్రణాళికలు లేని డ్రైనేజీ వ్యవస్థ, సక్రమ నిర్వహణ జరుగక, బుడమేరు ఆధునీకరణ చేయకపోవడంతో నగర ప్రజలకు ఈ దుస్థితి దాపరించిందన్నారు. ఇప్పటికైనా వర్షపు నీటి ముంపు నివారణ చర్యలను చేపట్టాలని నగరపాలకులను రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కొండప్రాంతాల రిటైనింగ్ వాల్ నిర్మాణాలు వేసవి కాలంలో పూర్తిచేసే విధంగా కమిషనర్ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



## రెజ్లింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులకు పతకాలు

**విజయవాడ స్పోర్ట్స్, మే 18 (ఆంధ్రజ్యోతి):** చిత్తూరు డీఎస్‌ఏ స్టేడియంలో జరిగిన అండర్-17 రాష్ట్రస్థాయి రెజ్లింగ్‌పోటీల్లో ఎన్టీఆర్ జిల్లా రెజ్లర్లు పతకాలు సాధించారని జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ఇంచార్జి కార్యదర్శి డి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ పోటీల్లో బి.నిహారిక బంగారు పతకం సాధించి జాతీయ పోటీలకు ఎంపికయినట్టు తెలిపారు. అదే విధంగా బి.కుమార్, శరణ్య, మోహన వంశీ రజిత పతకాలు, శివనాగ లక్ష్మి, అభిషేక్, హేమంత్ సాయి, శైలజ లు కాంస్య పతకాలు సాధించారన్నారు. రెజ్లింగ్‌లో జిల్లా రెజలర్లు ఈ ఏడాది అన్ని విభాగాల్లో, రాష్ట్ర స్థాయి పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచారని తెలిపారు. నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎస్‌కేపీవీ హిందూ హైస్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టుకు కూడా ప్రాతినిధ్యం వహించారని తెలిపారు. జిల్లా జట్లకు జి.భార్గవ సాయి గణేష్ కోచ్‌గా, జి.బిల్ల హరిసాయి సహయ కోచ్‌గా వ్యవహరిస్తున్నారని తెలిపారు.

## హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు

**భారతీనగర్,మే 18 (ఆంధ్రజ్యోతి):** గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా కరెన్సీ నగర్ దాసాంజనేయస్వామి ఆలయంలో పంచామృత అభిషేకాలు, సహస్రనామ ఆకు పూజ, మంత్ర పుష్పార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ, శ్రీరామభక్త సేవాసమితి కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో హనుమాన్ చాలీసా పారాయణం ఉంటుందన్నారు.



## సరస్వతి పుష్కరాలకు పోటెత్తిన భక్తులు

» నాలుగవ రోజు 1.30 లక్షల మంది పుణ్య స్నానాలు

భూపాలపల్లి, మే18 (ఆంధ్రజ్యోతి): సరస్వతీ పుష్కరాల సందర్భంగా తెలంగాణలోని కాళేశ్వర క్షేత్రం భక్తులతో కిక్కిరిసింది. పుష్కరాల్లో మొదటి రెండు రోజులు జనం పెద్దగా కనిపించకపోయినా శని, ఆదివారాల్లోనే దాదాపు రెండున్నర లక్షల మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి పుష్కర స్నానాలు ఆచరించారు. ఆదివారం ఒక్కరోజే దాదాపు 1.30 లక్షల మందికి పైగా భక్తులు సరస్వతి పుష్కరాల్లో పుణ్యస్నానాలు చేశారు. ముక్తేశ్వర స్వామిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ పెరగడంతో మహాదేవపూర్ నుంచి కాళేశ్వరం దాకా ట్రాఫిక్ సుమారు 10 గంటల పాటు స్తంభించిపోయింది. దాదాపు 16 కిలోమీటర్ల మేర ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు రోడ్డుపైనే నిలిచిపోవడంతో పుష్కరాలకు వచ్చిన భక్తులు నానా ఇబ్బందులు పడ్డారు.

## హైదరాబాద్‌లో పేలుళ్లకు కుట్ర!

(మొదటి పేజీ తరువాయి)

సిరాజ్-ఉర్-రెహ్మాన్ అరెస్టయ్యారు. వీరిని రిమాండ్‌కు తరలించారు.

**ఏం జరిగింది?:** విజయనగరం జిల్లా కేంద్రంలోని అంబటి సత్రానికి చెందిన సిరాజ్-ఉర్-రెహ్మాన్ బీటెక్ పూర్తిచేసి హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసి అక్కడే ఉగ్రవాద కార్యకలాపాలపై ఆసక్తి పెంచుకున్నాడు. ఆ తర్వాత విదేశీ ఉగ్రవాద సంస్థ ఐఎస్‌తో పరిచయం ఏర్పడింది. ఆ సంస్థ సూచనలతో పేలుళ్లతో విధ్వంసం సృష్టించేందుకు కుట్ర పన్నినట్టు నిఘా వర్గాలు గుర్తించాయి. పేలుళ్లకు వినియోగించే అమ్మోనియా, సల్ఫర్, అల్యూమినియం పౌడర్‌లను ఆన్‌లైన్‌లో సంపాదించాడు. దీనిపై ఏపీ, తెలంగాణ కౌంటర్ ఇంటెలిజెన్స్‌కు సమాచారం అందింది. అంతేకాకుండా గతంలో సిరాజ్ సామాజిక మాధ్యమంలో పాకిస్థాన్ అనుకూలంగా పోస్టులు పెట్టినట్టు గుర్తించారు. మరోవైపు, హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ సమీర్‌తో రహ్మాన్‌కు ఇన్‌స్టాలో పరిచయం ఏర్పడింది. ఇద్దరి మధ్య స్నేహం పెరిగింది. సమీర్ కూడా ఉగ్రసానుభూతి పరుడిగా మారినట్టు నిఘా వర్గాలు గుర్తించాయి. దీంతో సమీర్‌ను హైదారాబాద్‌లో అదుపులోకి తీసుకుని విజయనగరం తీసుకొచ్చారు. ఏపీ, తెలంగాణ పోలీసులతో పాటు, జిల్లా పోలీస్ అధికారులు ఇద్దరినీ పూర్తి స్థాయిలో విచారించారు. ఇద్దరిపైనా ఉగ్రవాద సానుభూతి చర్యలు, పేలుళ్లకు కుట్ర, నేరపూరిత కుట్ర తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి జడ్జి ముందు ప్రవేశ పెట్టారు. న్యాయస్థానం ఆదేశాలతో రిమాండ్‌కు తరలించారు. కాగా.. సిరాజ్ తండ్రి, సోదరుడు ఏపీ పోలీస్ శాఖలో పని చేస్తున్నారు.

**యూట్యూబ్‌లో చూసి..:** సౌదీ అరేబియాలోని ఐఎస్ ఉగ్రవాదుల(హ్యాండర్లు) నుంచి బాంబుల తయారీకి ఆదేశాలు వచ్చినట్లు ఇరురాష్ట్రాల నిఘావర్గాలు గుర్తించాయి. ఈ క్రమంలో బాంబులు ఎలా తయారు చేయాలనే విషయాన్ని యూట్యూబ్‌లో వెతుకులాడినట్టు అధికారులు గుర్తించారు. అనంతరం, హైదరాబాద్‌లో బాంబులను తయారు చేశారని నిర్ధారించారు. ఈ బాంబులను పరీక్షించేందుకు కొన్ని ప్రదేశాలను వీరు ఎంపిక చేసుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో అసలు హైదరాబాద్‌లో వీరి టార్గెట్ ఏమిటి? ఎక్కడ పేలుళ్లకు కుట్రలు పన్నారు? ప్రత్యక్షంగా.. పరోక్షంగా ఎవరెవరు సహకరిస్తున్నారు? అనే కోణాల్లో వీరిని విచారించనున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు.

# గురితప్పిన ఇస్రో బాణం

(మొదటి పేజీ తరువాయి)



ఉపగ్రహాన్ని తీసుకుని భారీ అంచనాలతో నింగిలోకి ఎగిరిన పీఎస్ఎల్వీ-సీ61 సాంకేతిక సమస్య కారణంగా లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. నింగిలోకి దూసుకెళ్లిన కాసేపటికే మూడో దశలో సాంకేతిక సమస్య తలెత్తడంతో రాకెట్ ప్రయాణ గమన దిశ మారింది. సాంకేతిక సమస్యను గుర్తించిన ఇస్రో శాస్త్రవేత్తలు రాకెట్ దిశను మార్చి నిర్దేశిత మార్గంలోకి తీసుకొచ్చేలా చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో ఈ మిషన్‌ను అర్ధంతరంగా ముగించాల్సి వచ్చింది. ప్రామాణిక భద్రత ప్రొటోకాల్‌ను అనుసరించి సాంకేతిక సమస్యను గుర్తించిన తర్వాత రాకెట్‌లోని నాలుగో దశ, పేలోడ్ (ఈవోఎస్-09)లను కూల్చివేశారు. అనంతరం మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ మాట్లాడుతూ.. ప్రయోగం పూర్తి కాలేదని.. రెండు దశలను విజయవంతంగా పూర్తి చేసుకొన్న రాకెట్‌కు మూడో దశలో సాంకేతిక సమస్య వచ్చిందని వెల్లడించారు. దీంతో... సరిహద్దులపై నిఘా కోసం ఈవోఎస్-09 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి ప్రవేశపెట్టేందుకు భారత్ చేసిన ప్రయత్నం తాత్కాలికంగా నిలిచిపోయింది.

### పీఎస్ఎల్వీకి మూడో పరాజయం

అంతకుముందు శనివారం ఉదయం 7:59 గంటలకు ప్రారంభమైన 22 గంటల కౌంట్‌డౌన్ పూర్తవగానే ఆదివారం ఉదయం 5:59 నిమిషాలకు షార్‌లోని ప్రథమ ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ-సీ61 రాకెట్ నిప్పులు చిమ్ముతూ నింగిలోకి పయనమైంది. 8 నిమిషాలకు తన రెండు దశలను సునాయసనంగా పూర్తి చేసుకొంది. మూడో దశలోకి ప్రవేశించగానే సాంకేతిక సమస్య తలెత్తింది. ఘన హైడ్రాక్సిల్-టెర్మినేటెడ్ పాలిబ్యూటాడిన్ (హెచ్‌టీపీబీ) మోటారుతో నడిచే మూడో దశ (పీఎస్3) సరిగ్గా పనిచేయలేదు. దీంతో రాకెట్ గతి తప్పింది. పీఎస్3 దశకు సంబంధించిన డేటా, తయారీ రికార్డులను పరిశీలించేందుకు ఇస్రో ఒక వైఫల్య విశ్లేషణ కమిటీని ఏర్పాటు చేసింది. పీఎస్ఎల్వీ శ్రేణిలో ఇస్రో ఇప్పటివరకూ 63 ప్రయోగాలు చేపట్టగా.. ఇది మూడో వైఫల్యమేనని, 2017 తర్వాత పీఎస్ఎల్వీ రాకెట్ విఫలమవడం ఇదే తొలిసారని ఇస్రో ఛైర్మన్ నారాయణన్ తెలిపారు.

### ఇస్రో జైత్రయాత్రకు బ్రేక్

ఎనిమిదేళ్లుగా 58 విజయాలతో ఇస్రో విజయ పరంపర కొనసాగిస్తోంది. 2017 నుంచి ఈ ఏడాది జనవరి 29 వరకు... పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ, ఎస్ఎస్ఎల్వీ, గగన్‌యాన్-డీ1, ఆర్ఎల్‌వీ-టీడీ ఇలా వరుసగా 58 ప్రయోగాల్లో విజయం సాధించింది. ఈ సక్సెస్‌తో భారత్ అంతరిక్ష పరిశోధనల్లో అగ్రరాజ్యాల సరసన నిలిచింది. ఇందులో చంద్రయాన్-3, ఆదిత్య-ఎల్1, గగన్‌యాన్-డీ1 వంటి ప్రయోగాలు కూడా ఉన్నాయి. ఇప్పుడు దేశ రక్షణ, సైనిక అవసరాలు, సరిహద్దుల్లో నిఘా వ్యవస్థలను బలోపేతం చేయడం కోసం ఈవోఎస్-09ను పంపేందుకు ఆదివారం ఇస్రో చేపట్టిన పీఎస్ఎల్వీ-సీ61 రాకెట్ విఫలమవడంతో వరస విజయాలకు బ్రేక్ పడింది.

### 60 విజయాలు.. 3 వైఫల్యాలు

1969 ఆగస్టు 15న ప్రారంభమైన ఇస్రో.. 1993లో పీఎస్ఎల్వీ రాకెట్ ప్రయోగాలకు ఇస్రో శ్రీకారం చుట్టింది. పీఎస్ఎల్వీ-డీ1 పేరిట 1993 సెప్టెంబరు 20న తొలి ప్రయోగం చేపట్టగా.. నాలుగో దశలో ద్రవ ఇంధనంలో సాంకేతిక లోపం తలెత్తి అది విఫలమైంది. అనంతరం 1994 అక్టోబరు 15న పీఎస్ఎల్వీ-డీ2 ప్రయోగాన్ని విజయవంతంగా చేపట్టారు. అక్కడి నుంచి ఇస్రో వరుసగా 39 విజయాలు సాధించింది. 2017 ఆగస్టు 31న పీఎస్ఎల్వీ-సీ39 రాకెట్ ప్రయోగం విఫలమైంది. ఈ వైఫల్యం తర్వాత 8 ఏళ్లలో పీఎస్ఎల్వీ ద్వారా చేపట్టిన 21 రాకెట్ ప్రయోగాలు వరుసగా విజయం సాధించాయి. తాజాగా పీఎస్ఎల్వీ-సీ61 మూడో దశలో సాంకేతిక లోపం తలెత్తడంతో ప్రయోగం విఫలమైంది.

## ఆకాశ్ పనితీరు చూడ్డానికి..కలాం ఉంటే బాగుండేది!

» 'ఆంధ్రజ్యోతి'తో డీఆర్‌డీవో మాజీ శాస్త్రవేత్త,ఆకాశ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రహ్లాదరామారావు



అల్వాల్, మే 18(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌కు ప్రతీకారంగా పాక్ మన దేశంపైకి ప్రయోగించిన డ్రోన్లు, క్షిపణులను తుత్తునియలు చేసిన ఆకాశ్ క్షిపణుల తయారీ అబ్దుల్ కలాం కలల ప్రాజెక్టు అని.. దానికి ఆయన హృదయంలో ప్రత్యేక స్థానం ఉందని డీఆర్‌డీవో రిటైర్డ్ శాస్త్రవేత్త, కర్ణాటకకు చెందిన డాక్టర్ ప్రహ్లాదరామారావు పేర్కొన్నారు. ఆకాశ్ పనితీరు చూడటానికి ఆయన ఇక్కడ ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. రక్షణ రంగంలో కీలకమైన ప్రాజెక్టులన్నింటికీ కేంద్రస్థానంగా మారిన హైదరాబాద్ డీఆర్‌డీవోలో అభివృద్ధి చేసిన అనేక రక్షణ ఉత్పత్తులు యుద్ధరంగంలో కీలకపాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం.. ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిసైల్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు నాయకత్వం వహిస్తున్నప్పుడు రామారావుకు ఆకాశ్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఇక్కడ అత్యంత కీలకమైన బాధ్యత అప్పగించారు. అలా తాము అభివృద్ధి చేసిన ఆకాశ్ క్షిపణులు దాయాది దేశ క్షిపణులను విజయవంతంగా తిప్పికొట్టడం ఆనందం కలిగించిందని.. అది తన జీవితంలోనే అత్యంత సంతృప్తికరమైన రోజని ప్రహ్లాదరామారావు 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. ఆకాశ్ క్షిపణిని అభివృద్ధి చేసే క్రమంలో ఎన్నో సవాళ్లు ఎదురైనప్పటికీ.. కలాం మద్దతుతో ప్రాజెక్టును కొనసాగించామని తెలిపారు.

## ఘనంగా నూతన పోప్ ప్రమాణ స్వీకారం



వాటికన్ సిటీ, మార్చి 18: నూతన పోప్ లియో-16 ప్రమాణ స్వీకారం ఆదివారం ఇక్కడ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో జరిగిన ప్రారంభ ప్రార్థనకు దాదాపు 2 లక్షల మంది హాజరయ్యారు. వారసత్వంగా వస్తున్న గొర్రెపిల్ల ఉన్నితో చేసిన శాలువాను భుజాలపై వేసినప్పుడు, 'మత్స్యకారుని ఉంగరాన్ని' వేలికి తొడిగినప్పుడు ఆయన ఉద్వేగానికి గురయ్యారు. ఉంగరాన్ని తొడిగిన అనంతరం చేతులను చూసుకొని దండాన్ని ధరించారు. తరువాత ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ ఉత్సవానికి భారత ప్రభుత్వ ప్రతినిధిగా రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ హాజరయ్యారు.

## ఉక్రెయిన్‌పై 273 డ్రోన్లతో దాడి

కివ్, మే 18: ఉక్రెయిన్‌పై రష్యా మరోసారి భారీ స్థాయిలో 273 డ్రోన్లతో దాడులకు తెగబడింది. డ్రోన్లతో ఉక్రెయిన్‌లోని పలు ప్రాంతాలపై దాడులు చేసింది. ఈ దాడుల వల్ల ఒక మహిళ మృతి చెందగా.. మరో ముగ్గురు గాయాలపాలయ్యారు. 2022లో పూర్తి స్థాయి యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఈ స్థాయిలో భారీ డ్రోన్ దాడి జరగలేదని తెలుస్తోంది. కాల్పుల విరమణ దిశగా మాస్కో, కివ్ మధ్య మొదటిసారి ఇస్తాంబుల్ వేదికగా జరిగిన ముఖాముఖి చర్చలు విఫలమైన నేపథ్యంలో ఈ దాడులు చోటు చేసుకున్నాయి. మరోవైపు ఉక్రెయిన్ కూడా రష్యాలపై డ్రోన్లను ప్రయోగించింది. ఇదిలా ఉండగా.. ఉక్రెయిన్‌లో రక్తపాతానికి ముగింపు పలకడానికి గాను సోమవారం రష్యా అధ్యక్షుడు పుతిన్, తర్వాత ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో ఫోన్‌లో మాట్లాడనున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు.

## గాజాపై ఇజ్రాయెల్ దాడుల్లో 103 మంది మృతి

గాజా, మే 18: పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులను తీవ్రతరం చేసింది. గాజా స్ట్రిప్ వ్యాప్తంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు జరిపిన వైమానిక దాడుల్లో 103 మంది మరణించారు. ఉత్తర గాజాలోని ప్రధాన ఆస్పత్రిని సైతం మూసివేశారు. ఇజ్రాయెల్ సూచించిన షరతుల మేరకు తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందానికి హమాస్ ఒప్పుకొనేలా ఒత్తిడి పెంచే ప్రణాళికలో భాగమే తాజా భీకర దాడులు. ఖాన్‌యూనిస్ నగరంలోనూ, దాని చుట్టుపక్కల జరిపిన దాడుల్లో ఇళ్లు, పునరావాస టెంట్‌లు ధ్వంసమవడంతో 48 మందికిపైగా మరణించారు. మృతుల్లో 18 మంది చిన్నారులు, 13 మంది మహిళలు ఉన్నారని నస్సెర్ ఆస్పత్రి అధికార ప్రతినిధి వీం ఫేర్స్ చెప్పారు. ఉత్తర గాజాలోని ఇండోనేసియన్ ఆస్పత్రి చుట్టూ దాడులు జరగడంతో ఆస్పత్రిని మూసివేసినట్టు వైద్యాధికారులు తెలిపారు. ప్రస్తుతం ఉత్తర గాజాలో క్షతగాత్రులకు వైద్యసేవలు అందిస్తున్న ప్రధాన ఆస్పత్రి ఇదే. తాజాగా హౌతీ రెబెల్స్ ఇజ్రాయెల్‌పై దాడులు ప్రారంభించారు. దీంతో ఆదివారం ఇజ్రాయెల్‌లోని అనేక ప్రాంతాల్లో సైరన్‌ల మోత మోగింది.

## కాల్పుల విరమణకు ముగింపు తేదీ లేదు: భారత్

న్యూఢిల్లీ, మే 18: భారత్, పాకిస్థాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ (డీజీఎంవోఎస్) మధ్య ఆదివారం ఎలాంటి చర్చలూ జరగలేదని భారత సైన్యం స్పష్టం చేసింది. అలాగే ఈ నెల 11న ఇరు దేశాలు తీసుకున్న కాల్పుల విరమణ నిర్ణయానికి 'ముగింపు తేదీ ఏమీ లేదు' అని వెల్లడించింది. రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ నిర్ణయం ఈ నెల 18తో ముగుస్తుందని మీడియాలో కథనాలు వస్తున్న నేపథ్యంలో భారత సైన్యం దీనిపై స్పష్టతనిచ్చింది. మరోవైపు, 'ఆపరేషన్ సిందూర్' ప్రతీకార చర్య కాదని.. పహల్గాం ఉగ్రదాడి బాధిత కుటుంబాలకు చేసిన న్యాయమని భారత సైన్యం స్పష్టం చేసింది. పాక్‌లోని ఉగ్రస్థావరాలపై దాడులకు ఎలా ప్రణాళిక రచించింది, సైనికులకు ఏ విధంగా శిక్షణ ఇచ్చింది, ఈ ప్రణాళికను ఎలా అమలు చేసింది.. అనే విషయాలు తెలియజేస్తూ 'ప్లాన్డ్.. ట్రెయిన్డ్.. ఎగ్జిక్యూటెడ్..' పేరుతో ఆర్మీ ఆదివారం ఓ వీడియోను షేర్ చేసింది.

# చిత్రజ్యోతి
SINCE 1965

## గ్యాంగ్‌స్టర్ పాత్రలో కమల్

కమల్ హాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'థగ్ లైఫ్'. త్రిష కథానాయికగా, శింబు కీలక పాత్రలో నటించారు. రాజ్ కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, రెడ్ జెయింట్ మూవీస్ సంయుక్తంగా నిర్మిస్తు



న్నాయి. జూన్ 5న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. కమల్ హాసన్ పవర్‌ఫుల్ గ్యాంగ్‌స్టర్ పాత్రలో అదరగొట్టారు. ఈ చిత్రానికి ఏ.ఆర్.రెహ్మాన్ సంగీతం అందించారు. తెలుగులో ఈ సినిమాను ఎన్.సుధాకర్ రెడ్డి విడుదల చేస్తున్నారు.

## ఆలయ రక్షణ కోసం..



బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ హీరోలుగా విజయ్ కనకమేడల దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'భైరవం'. డా.జయంతి లాల్ గడా సమర్పణలో కె.కె.రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఈనెల 30న చిత్రం విడుదలవుతున్న సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ని లాంచ్ చేశారు. గ్రామంలోని వారాహి ఆలయం చుట్టూ కథ తిరుగుతుంది. రాష్ట్ర దేవాదాయ శాఖమంత్రి ఆలయం భూములపై కన్నేస్తాడు. దాంతో గ్రామంలో శాంతికి భంగం కలుగుతుంది. ఈ క్రమంలో ముగ్గురు స్నేహితులు కలసి ఆలయాన్ని, దాని వారసత్వాన్ని రక్షించేందుకు బలంగా నిలబడతారు. వారి మధ్య ఉన్న బంధం, ధైర్యం గ్రామ ప్రజల్లో ఆశలు చిగురింపజేస్తాయి. ట్రైలర్‌ని బట్టి చూస్తే కమర్షియల్ వాల్యూస్‌తో ఉన్న కథను దర్శకుడు చాలా ప్రభావశీలంగా తెరపై ఆవిష్కరించారనిపిస్తోంది.

## కొత్తదనంతో నిండిన చిత్రం



నవీన్ చంద్ర హీరోగా రాకేశ్ పొట్టా తెరకెక్కిస్తున్న చిత్రం 'కరాలి'. మందలపు శివకృష్ణ నిర్మిస్తున్నారు. రాశీ సింగ్, కాజల్ చౌదరి హీరోయిన్లు. ఆదివారం ఈ సినిమాను ప్రారంభించారు. నిర్మాత సాహు గారపాటి క్లాప్ కొట్టి స్క్రిప్టును అందజేశారు. ఈ సందర్భంగా హీరో నవీన్ చంద్ర మాట్లాడుతూ "నేనింతవరకూ ఇటువంటి యాక్షన్ డ్రామా చేయలేదు. కొత్తదనంతో నిండిన ఈ చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో నటుడు రాజారవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

## జూన్ నుంచి థియేటర్లు బంద్



తెలుగు రాష్ట్రాల్లో జూన్ 1 నుంచి సినిమా థియేటర్లు బంద్ కానున్నాయి. అద్దె ప్రాతిపదికన సినిమాలు ప్రదర్శించలేమని, థియేటర్లు మూసివేయాలని సినీ ఎగ్జిబిటర్లు కీలక నిర్ణయం తీసుకున్నారు. పర్సంటేజ్ రూపంలో చెల్లిస్తేనే సినిమాలు ప్రదర్శిస్తామని తేల్చి చెప్పారు. ఆదివారం తెలుగు ఫిల్మ్ ఛాంబర్‌లో తెలంగాణ, ఆంధ్రా సినీ ఎగ్జిబిటర్ల సమావేశం నిర్వహించారు. నిర్మాతలు దిల్‌రాజు, సురేశ్‌బాబు సహా 60 మంది ఎగ్జిబిటర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లకు మధ్య చాలా కాలంగా పర్సంటేజీలపై చర్చ సాగుతోంది. రెంటల్ విధానంలో సినిమాలు ప్రదర్శించడం సాధ్యం కాదని ఎగ్జిబిటర్లు వాదిస్తుంటే, పర్సంటేజీలు ఇవ్వలేమని డిస్ట్రిబ్యూటర్లు అంటున్నారు. ఈ వ్యవహారం నిర్మాతలకు సైతం ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిటర్ల సమావేశంలో పర్సంటేజీలు, ప్రభుత్వ విధానాలపై చర్చించారు. పర్సంటేజీల రూపంలో చెల్లిస్తేనే సినిమాలను ప్రదర్శిస్తామని నిర్మాతలకు లేఖ రాయాలని తీర్మానించారు.

### ఈ సినిమాలపై ప్రభావం

జూన్ 1 నుంచి థియేటర్లు మూసివేయాలనే ఎగ్జిబిటర్ల నిర్ణయంతో పలు సినిమాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం లేకపోలేదు. ఈ నెలాఖరు నుంచి వరుసగా పెద్ద సినిమాలు రిలీజ్ కానున్నాయి. మే 30న భైరవం, జూన్ 5న థగ్ లైఫ్, జూన్ 12 హరిహర వీరమల్లు, జూన్ 27న కన్నప్ప, జూన్ 20న కుబేర, జూలైలో కింగ్‌డమ్ చిత్రాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి.

## హారర్ థ్రిల్లర్ అమరావతికి ఆహ్వానం



శివ కంఠంనేని, ఎస్తర్, ధన్య బాలకృష్ణ, సుప్రీత, హరీశ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న హారర్, థ్రిల్లర్ 'అమరావతికి ఆహ్వానం' షూటింగ్ పూర్తయింది. ఇప్పటికే ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లో షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం కోసం ఇటీవల 20 రోజుల పాటు మధ్యప్రదేశ్‌లో కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. జీవీకె దర్శకత్వంలో కె.ఎస్.శంకరరావు, ఆర్.వెంకటేశ్వరరావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర కథానాయకుడు శివ కంఠంనేని మాట్లాడుతూ 'ప్రజెంట్ ట్రెండ్‌ను దృష్టిలో పెట్టుకుని దర్శకుడు జీవీకే ఓ మంచి హారర్, థ్రిల్లర్‌గా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. టెక్నికల్‌గా కూడా చిత్రం బాగుంటుంది' అని తెలిపారు. సరికొత్త కథాంశంతో వస్తున్న సినిమా ఇదనీ, ప్రేక్షకుల్ని తప్పకుండా అలరిస్తుందనీ దర్శకుడు చెప్పారు.

## నా కెరీర్‌లోనే ప్రత్యేకం

- సుమయ రెడ్డి



'డియర్ ఉమ' సినిమాతో తెరంగేట్రం చేశారు తెలుగమ్మాయి సుమయ రెడ్డి. ఈ సినిమాకు ఆమె నిర్మాతగానూ వ్యవహరించడం విశేషం. ఇందులో ఆమె పోషించిన డాక్టర్ పాత్రకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ దక్కింది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'నా కెరీర్‌లో 'డియర్ ఉమ' ఎంతో ప్రత్యేకమైంది. నటిగా నాకు మంచి బ్రేక్‌తో పాటు ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. ప్రేక్షకులు అందించిన ఆదరాభిమానాలు మరువలేనివి. ఈ ప్రోత్సాహంతో మరింత ముందుకు సాగుతాను' అని చెప్పారు. త్వరలోనే ఆమె నటిస్తున్న కొత్త ప్రాజెక్ట్ ప్రకటించనున్నారు.


విశాఖ బీచ్ రోడ్డులో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న జనం

# ఘనంగా తిరంగా ర్యాలీలు

**భారీ సంఖ్యలో పాల్గొన్న జనం.. మార్మోగిన 'భారత్ మాతాకీ జై' నినాదాలు**

విశాఖపట్నం, నెల్లూరు (క్రైం)/ఆత్మకూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయంతమైన నేపథ్యంలో విశాఖపట్నం, నెల్లూరు, ఆత్మకూరులో ఆదివారం భారీ తిరంగా ర్యాలీలు నిర్వహించారు. యువకులు, విద్యార్థులు, మాజీ సైనికులు, వివిధ వర్గాల ప్రజలు భారీ సంఖ్యలో తరలి వచ్చి ర్యాలీల్లో పాల్గొన్నారు. జాతీయ జెండాలను చేతబూని భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు హోరెత్తించారు. విశాఖపట్నంలో బీచ్ రోడ్డులోని పార్క్ హోటల్ నుంచి కాళీమాత గుడి వరకు ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, పంచకర్ల రమేశ్‌బాబు, విష్ణు కుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. నెల్లూరులో వెయ్యి అడుగుల భారీ త్రివర్ణ పతాకంతో ప్రదర్శన నిర్వహించారు. ఈ ర్యాలీని మంత్రి పి.నారాయణ జెండా ఊపి ప్రారంభించారు. నెల్లూరులోని వీఆర్సీ సెంటర్ నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది. నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ సురేష్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, జిల్లా సైనిక్ సంక్షేమ అధికారి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరులో ర్యాలీని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించారు. ఆత్మకూరులో మున్సిపల్ కార్యాలయం నుంచి సత్రం సెంటర్ వరకు ర్యాలీ కొనసాగింది. సత్రం సెంటర్‌లో ఏర్పాటు చేసిన సభలో 20 మంది మాజీ సైనికులను ఎన్డీఏ కూటమి నేతలు, అధికారులు సన్మానించారు. కోలాటాలు, మహిళలు ప్రదర్శించిన భారీ జాతీయ పతాకం ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నెల్లూరు రూరల్‌లో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ జరిగింది.


నెల్లూరు జిల్లా ఆత్మకూరులో తిరంగా ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి


నెల్లూరు నగరంలో వెయ్యి అడుగుల త్రివర్ణ పతాకంతో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న జనం



మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సంజయ్ రాథోడ్

## మురళీనాయక్ బంజారాలకు గర్వకారణం

» వీరజవాన్ కుటుంబాన్ని పరామర్శించిన మహారాష్ట్ర మంత్రి

హిందూపురం, మే 18(ఆంధ్రజ్యోతి): వీరజవాన్ మురళీనాయక్ దేశవ్యాప్తంగా ఉన్న బంజారాలకు గర్వ కారణమని మహారాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి సంజయ్ రాథోడ్ అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలంలోని వీరజవాన్ స్వగ్రామమైన కల్లి తండాకు మంత్రి వచ్చారు. మురళీనాయక్ తల్లిదండ్రులు శ్రీరామ్‌నాయక్, జ్యోతీబాయిని పరామర్శించారు. వీరజవాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అక్కడి నుంచి వీరజవాన్ ఘాట్ వద్దకు వెళ్లి నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..మురళీనాయక్ కుటుంబానికి బంజారాల అండ ఉంటుందన్నారు. మహారాష్ట్రలో మురళీనాయక్ జన్మించారు కాబట్టి అక్కడికి ఆయన తల్లిదండ్రులను తీసుకెళ్లి, ప్రభుత్వం తరుపున సహాయ సహకారాలు అందిస్తామన్నారు. తమ కుమారుడిని పరమవీరచక్రతో ప్రభుత్వం గుర్తించేలా బంజారాలు కృషి చేయాలని మురళీనాయక్ తల్లిదండ్రులు శ్రీరామ్‌నాయక్, జ్యోతీబాయి.. మంత్రిని కోరారు.

## తిరుమల నారాయణగిరి షెడ్లలో భక్తుల ఘర్షణ

» జుట్టు పట్టుకుని కొట్టుకున్న మహిళలు.. వీడియో వైరల్

తిరుమల, మే 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనం కోసం వేచి ఉండే నారాయణగిరి షెడ్లలో ఆదివారం భక్తుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. జుట్లు పట్టుకొని మరీ ఇద్దరు మహిళలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. నిద్రపోతున్న సమయంలో ఓ మహిళ మరో మహిళపై కాలు వేసిందనే కారణంతో నారాయణగిరి ఉద్యానవనంలోని 8వ నంబరు షెడ్‌లో ఆదివారం వేకువజాము 3.30 గంటల సమయంలో రెండు కుటుంబాల మధ్య వివాదం చెలరేగింది. మాటమాట పెరగడంతో ఇద్దరు మహిళలు జుట్లు పట్టుకుని కిందపడి మరీ కొట్టుకున్నారు. పురుషులు కూడా ఒకరిని ఒకరు నెట్టుకున్నారు. తోటిభక్తులు ఎవరూ పట్టించుకోకపోవడంతో వివాదం పెరిగిపోయింది. సమీపంలోని ఓ సెక్యూరిటీ గార్డు గొడవను గుర్తించి లోపలకు వెళ్లి వారికి సర్దిచెప్పి దర్శనానికి పంపారు. ఈ వివాదానికి సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దర్శనానికి వెళ్లే సమయంలో ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడం ఈ నెలలో ఇది రెండో ఘటన కావడం గమనార్హం.

## ఏఐవైఎఫ్ జాతీయ నూతన కార్యవర్గం ఎన్నిక

తిరుపతి(ఆటోనగర్), మే 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో నిర్వహించిన ఏఐవైఎఫ్ మహాసభల్లో నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఏఐవైఎఫ్ జాతీయ అధ్యక్షుడిగా రౌషన్ కుమార్ సిన్హా, ప్రధాన కార్యదర్శిగా సుఖ్‌జిందర్ సింగ్ మహేశ్వర్, ఉపాధ్యక్షులుగా భారతి(తమిళనాడు), ప్రదీప్ సేథి (ఒడిశా), హిమాంమ్‌షు ధర్జజీ(గుజరాత్), అరహ్ రెడికర్(మహారాష్ట్ర), జాతీయ కార్యదర్శులుగా టీ టీ జిస్మన్ (కేరళ), హరీష్ బాల (నలానల్ సెంటర్), డాక్టర్ వలైవుల్లా ఖాదరీ (తెలంగాణ), పరుచూరి రాజేంద్ర (ఆంధ్రప్రదేశ్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## అప్పుల బాధతో ముగ్గురు రైతుల ఆత్మహత్య


ఎర్రనేని చిన వెంకటేశ్వర్లు మహేంద్ర, నాగేంద్ర

క్రోసూరు/గుత్తిరూరల్/ఆదోని రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక రాష్ట్రంలో ముగ్గురు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. పల్నాడు జిల్లా క్రోసూరు మండలం పీసపాడుకు చెందిన ఎర్రనేని చిన్న వెంకటేశ్వర్లు(59) రెండు ఎకరాల్లో మిర్చి పంట వేశాడు. పండించిన పంటకు ధర పలకలేదు. సుమారు రూ.10 లక్షలు వరకు అప్పుల పాలయ్యాడు. దీంతో మనస్థాపానికి గురై ఆదివారం ఉదయం పురుగు మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. గమనించిన బంధువులు, స్థానికులు సత్తెనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. అనంతపురం జిల్లా గుత్తి మండలం తొండపాడు గ్రామానికి చెందిన మహేంద్ర (39) తన పదెకరాల పొలంలో 5 బోర్లు వేసినా చుక్క నీరు పడలేదు. కొన్నేళ్లుగా వేరుశనగ, ఆముదం, పత్తి పంటలు సాగు చేసి తీవ్రంగా నష్టపోయాడు. బోర్లు వేసేందుకు, పంటల సాగుకు చేసిన అప్పులు రూ.10 లక్షలకు చేరాయి. తీవ్ర మనస్థాపంతో ఇంట్లోనే ఉరేసుకోగా బంధువులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కర్నూలు జిల్లా ఆదోని మండలం కపటి గ్రామానికి చెందిన బోయ నాగేంద్ర(30) తన నాలుగెకరాల పొలంలో రెండేళ్లుగా మిరప, ఉల్లి పంటలు సాగుచేశాడు. గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోయాడు. సుమారు రూ.8 లక్షలు అప్పు తీర్చే మార్గంలేక ఆదివారం ఇంట్లో ఉరి వేసుకున్నాడు.

## ఉత్తరాంధ్రలో ఆత్మహత్యకు పాల్పడిన రైతుల కుటుంబాలకు న్యాయం చేయాలి

» మానవ హక్కుల వేదిక, ప్రజాసంఘాలు డిమాండ్

శ్రీకాకుళం, మే 18(ఆంధ్రజ్యోతి): 'ఉత్తరాంధ్రలో గత 11 నెలల్లో ఐదుగురు రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. వారి కుటుంబాలకు ఇప్పటివరకూ న్యాయం చేకూరలేదు' అని మానవ హక్కుల వేదిక, రైతు స్వరాజ్య వేదిక, బీసీ సంక్షేమ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ 9న శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం పెద్దకొజ్జిరియా గ్రామానికి చెందిన రైతు బల్లెడ నరసింహ మూర్తి ఆత్మహత్యకు పాల్పడారని తెలిపారు. జీవో 43 ప్రకారం ఆర్డీవో ఆధ్వర్యంలో త్రిసభ్య కమిటీ విచారణ చేపట్టాల్సి ఉండగా ఇంతవరకు కమిటీ గ్రామాన్ని సందర్శించలేదని పేర్కొన్నారు. గత 11 నెలల్లో ఉత్తరాంధ్రలో ఆత్మహత్య చేసుకున్న ఐదుగురు రైతుల కుటుంబాలకు జీవో 43 అమలుచేసి నష్టపరిహారం ఇవ్వలేదని తెలిపారు. మృతుల కుటుంబానికి తక్షణమే రూ.7లక్షలు చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

## పాత పెన్షన్ సాధించే వరకు ఉద్యమం

» నేటి నుంచి రెండో విడత చైతన్య యాత్ర: ఏపీసీపీఎస్ఈఏ

విజయవాడ (వన్‌టౌన్), మే 18 (ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ సాధించే వరకు ఉద్యమం ఆపేది లేదని ఆంధ్రప్రదేశ్ కంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీసీపీఎస్ఈఏ) అధ్యక్షుడు బాజీ పఠాన్ పేర్కొన్నారు. పాత పెన్షన్ విధానాన్ని సాధించేందుకు రెండో విడత ఆందోళన క్రమంలో నేటి నుంచి నెల్లూరు-గోదావరి జిల్లాల వరకు సీపీఎస్ ఉద్యోగుల చైతన్య యాత్ర జరగనుందన్నారు.

## డీడీ కట్టినా.. శ్రీవారి సేవకు నో !

వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించిన దంపతులు

» కమిషన్ తీర్పుతో దిగొచ్చిన టీటీడీ

» దంపతులకు సేవా టికెట్ల అందజేత

మహబూబ్‌నగర్ టౌన్, మే 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి సేవ కోసం కోర్టు మెట్లు ఎక్కిన దంపతులు చివరకు విజయం సాధించారు. మహబూబ్‌నగర్‌కు చెందిన శెట్టి చంద్రశేఖర్ దంపతులు తిరుమలలో ప్రతి గురువారం నిర్వహించే తిరుప్పావడ సేవ, శుక్రవారం నిర్వహించే మేల్ చాట్ వస్త్ర సేవలో పాల్గొనేందుకు 2008 నవంబరు 26న డీడీ రూపంలో రూ.21,250 చెల్లించారు. కానీ ఏళ్లు గడిచినా వారికి అవకాశం దక్కలేదు. టీటీడీకి అనేక లేఖలు రాయగా, 2021, సెప్టెంబరు 10న సేవల్లో పాల్గొనేందుకు స్లాట్ బుక్ అయింది. కానీ, కరోనా కారణంగా ఆ సేవలు రద్దు చేశామని, వాటి స్థానంలో బ్రేక్ దర్శనం కల్పిస్తామని టీటీడీ సమాచారం అందించింది. దీంతో వారు మహబూబ్‌నగర్ జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌ను ఆశ్రయించారు. 4 రోజుల్లోగా తిరుప్పావడ, మేల్ చాట్ వస్త్ర సేవలో పాల్గొనే అవకాశం కల్పించాలని, లేకుంటే ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున రూ.20 లక్షలు జరిమానా చెల్లించాలని కమిషన్ న్యాయాధికారి ఎం.అనురాధ గతేడాది మే 8న తీర్పు ఇచ్చారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ టీటీడీ.. రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌ను ఆశ్రయించింది. వివాదాన్ని అక్కడే పరిష్కరించుకోవాలని వారు జిల్లా కోర్టుకు తిప్పి పంపించారు. ఈ నెల 15న కమిషన్ విచారించి.. తమ తీర్పుకు కట్టుబడి భక్తులకు తిరుప్పావడ, మేల్‌చాట్ వస్త్ర సేవల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తారా? లేక జరిమానా చెల్లిస్తారా? లేదా జైలుకు వెళ్తారా? న్యాయాధికారి ఎం.అనురాధ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో దిగొచ్చిన టీటీడీ అధికారులు.. చంద్రశేఖర్ కుటుంబ సభ్యులకు వచ్చే ఆగస్టు 14, 15 తేదీల్లో శ్రీవారి సేవలో పాల్గొనే అవకాశాన్ని కల్పిస్తూ, సేవా టికెట్లను కోర్టు ద్వారా అందజేశారు.

**వైసీపీ కాంట్రాక్టర్లకు మేలు చేసేలా..**

# మొక్కుబడి తనిఖీలు?

» మార్గదర్శకాలను పట్టించుకోని అధికారులు

» జగనన్న ఇళ్ల స్థలాల చదును పనుల్లో అక్రమాల వ్యవహారం

» తనిఖీలు.. నివేదికల తయారీలో తీవ్ర నిర్లక్ష్యం

» 9,688 పనులు..వెయ్యింటికే నివేదికలు

» తనిఖీల్లో పారదర్శకత లేకుంటే వేటేనన్న ఉపాధి డైరెక్టర్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉపాధి హామీ పథకంలో గత ప్రభుత్వం చేపట్టిన ఇంటి స్థలాల చదును పనుల తనిఖీలు మొక్కుబడిగా సాగుతున్నాయి. ఉన్నతాధికారులు సమగ్ర మార్గదర్శకాలు ఇచ్చినా.. క్షేత్రస్థాయిలో తనిఖీలు పకడ్బందీగా జరగడం లేదు. కాంట్రాక్టర్లు, అధికారులను రక్షించేందుకు తనిఖీ సిబ్బంది ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. తనిఖీలు ప్రారంభించి ఆరు నెలలవుతున్నా... ఏమాత్రం పురోగతి లేదు. రాష్ట్రవ్యాప్తంగా 24 జిల్లాల్లోని 9,688 పనులు తనిఖీ చేయాల్సి ఉండగా.. 5,233 పనులే తనిఖీ చేశారు. వీటన్నిటికీ నివేదికలు కూడా ఇవ్వలేదు. కేవలం 14 జిల్లాల్లోని 1,019 పనులకే నివేదికలు ఇచ్చారు.

### మార్గదర్శకాలు పట్టించుకోకుండా..!

గత ప్రభుత్వంలో ఉపాధి హామీ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రూ.1,125 కోట్ల మేర పనులు వైసీపీ కార్యకర్తల ద్వారా చేపట్టారు. అయితే రూ.1,500 కోట్ల మేరకు పనులు చేసినట్లు దొంగ బిల్లులు పెట్టారు. సుమారు రూ.1,260 కోట్ల మేరకు బిల్లులను గత ప్రభుత్వమే ఎన్నికల ముందు చెల్లించేసింది. ఇంకా రూ.240 కోట్ల మేరకు బకాయిలు ఉన్నాయని పనులు చేసినవారు కోర్టును ఆశ్రయించారు. వారికి బిల్లులు చెల్లించాలని హైకోర్టు ఆదేశాలిచ్చింది. అయితే విత్‌హెల్డ్‌లో ఉన్న బకాయిలు చెల్లించడానికి క్వాలిటీ కంట్రోల్, సోషల్ ఆడిట్ తనిఖీలు చేపట్టాలని అప్పట్లోనే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. దీంతోపాటు ఇంటి స్థలాల లెవలింగ్ పనుల్లో అక్రమాలు జరిగాయంటూ గత అసెంబ్లీలో ఎమ్మెల్యేలు ఆరోపించారు. దీంతో ఇంటి స్థలాల చదును పనులను తనిఖీ చేయాలని తాజాగా కమిషనర్ కృష్ణతేజ ఆదేశాలిచ్చారు. ఇందుకు సంబంధించి మార్గదర్శకాలు కూడా జారీ చేశారు. అయితే ఈ తనిఖీల్లో మార్గదర్శకాలను పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి.

### నిబంధనలకు విరుద్ధంగా తనిఖీలు

అప్పట్లో జగనన్న కాలనీల ఇంటి చదును పనుల్లో గ్రావెల్ కొనుగోలు కోసం క్యూబిక్ మీటర్‌కు రూ.134 రికార్డు చేసి, చెల్లించారు. వాస్తవానికి రైతుల నుంచి మట్టి కొనుగోలు చేస్తేనే రూ.134 చెల్లించాలి. అయితే రైతు పొలం నుంచి మట్టి తీసుకునేందుకు తహసీల్దార్ అనుమతి ఇచ్చి ఉండాలి. ఈ మేరకు రికార్డులు పక్కాగా ఉండాలి. ప్రభుత్వ స్థలం నుంచి మట్టి సేకరిస్తే.. కేవలం రవాణా ఖర్చు మాత్రమే లెక్కించాలి. ఈ నిబంధనను పట్టించుకోకుండా.. క్యూబిక్ మీటర్‌కు రూ.134 చొప్పున అన్ని చోట్లా రికార్డు చేసేశారు. ప్రభుత్వ భూముల్లోని మట్టిని సేకరించి క్యూబిక్ మీటర్‌కు రూ.50 అదనంగా వసూలు చేశారు. దీంతో ప్రభుత్వ సొమ్ము భారీగా వైసీపీ కార్యకర్తల జేబుల్లోకి వెళ్లింది. కమిషనర్ ఆదేశాల ప్రకారం ఆయా పనులకు సంబంధించిన రికార్డులు పరిశీలించి, మట్టి కొనుగోలుకు తహసీల్దార్ల అనుమతి ఉందో.. లేదో? పరిశీలించాలి. అనుమతి లేకపోతే రూ.134ను కాంట్రాక్టర్ల నుంచి వసూలు చేయాలి. అయితే ఇదేమీ పట్టించుకోకుండా.. ప్రతి పనికీ రూ.134 చెల్లించేందుకు ఆమోదం తెలుపుతున్నారు. మట్టి కొలతలు తీసే విషయంలోనూ పారదర్శకత లోపించింది. అప్పట్లో పనిచేసిన కాంట్రాక్టర్లకు, అధికారులకు సాయం చేసేందుకు తనిఖీలను తూతూమంత్రంగా నిర్వహిస్తూ.. వారిని కాపాడే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికే తయారైన నివేదికల్లో కూడా ఆయా కాంట్రాక్టర్లకు చెల్లింపులను జీరో చేశారే తప్ప, అధిక చెల్లింపులను రికవరీ చేసే యోచన తనిఖీలు చేసేవారిలో కనిపించడం లేదు.

**తనిఖీల్లో పారదర్శకత లోపిస్తే వేటు తప్పదు: డైరెక్టర్ షణ్ముఖ్‌కుమార్**

జగనన్న కాలనీ స్థలాల చదును పనుల తనిఖీల్లో పారదర్శకత లోపించినా, ఉదాసీన వైఖరితో ఉన్నా.. ఆయా అధికారులను బాధ్యులను చేస్తామని ఉపాధి హామీ పథకం డైరెక్టర్ షణ్ముఖ్‌కుమార్ హెచ్చరించారు. ఇటీవల ఆయన ఉపాధి క్వాలిటీ కంట్రోల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి లెవలింగ్ పనుల తనిఖీలపై ఆరా తీశారు. పలు జిల్లాల్లో తనిఖీలు పూర్తిగా నిలిపేయడం, కొన్ని జిల్లాల్లో మందకొడిగా సాగుతుండటంపై సీరియస్ అయ్యారు. ప్రభుత్వ సొమ్ము అప్పనంగా దోచుకున్న వారి పట్ల సానుభూతి చూపాల్సిన అవసరం లేదని, పకడ్బందీగా తనిఖీలు నిర్వహించి రికవరీలకు సిఫారసు చేయాలని సూచించారు. తనిఖీల పురోగతిని ప్రతి వారం సమీక్షిస్తానని చెప్పారు.

## నా ఆత్మకథ పుస్తక ఆవిష్కరణకు రండి

» ఏపీ, తెలంగాణ సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డిలకు దత్తన్న ఆహ్వానం


చంద్రబాబును ఆహ్వానిస్తున్న హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ తదితరులు

హైదరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): జూన్ మొదటి వారంలో హైదరాబాద్‌లో జరిగే తన ఆత్మకథ తెలుగు పుస్తక ఆవిష్కరణకు రావాలంటూ ఏపీ, తెలంగాణ సీఎంలు చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డిలను హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆహ్వానించారు. చంద్రబాబు, రేవంత్‌రెడ్డిలను ఆదివారంనాడు హైదరాబాద్‌లోని వారి నివాసాల్లో కలిసిన దత్తాత్రేయ.. ఈమేరకు ఆహ్వాన పత్రికను అందజేశారు. దత్తాత్రేయ ఆత్మకథ హిందీ వెర్షన్ "జనతాకీ కహానీ.. మేరీ ఆత్మకథ" పేరుతో ఇటీవల ఢిల్లీలో విడుదలైన సంగతి తెలిసిందే. దాన్ని "ప్రజల కథే.. నా ఆత్మకథ" పేరుతో తెలుగులో విడుదల చేస్తున్నట్లు దత్తాత్రేయ తెలిపారు. ఆయనతో పాటు అలయ్‌బలయ్ ఫౌండేషన్ ఛైర్మన్ బండారు విజయలక్ష్మి, జిగ్నేష్‌రెడ్డి ఉన్నారు.

## సీఎం మాటిచ్చారు.. సాయం అందింది!


గోపాల్ బంధువుకు రూ.5 లక్షల చెక్కు అందజేస్తున్న కర్నూలు కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు, మే 18(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సీఎం చంద్రబాబు ఈ నెల17న కర్నూలులో పర్యటించారు. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా దేవనకొండ మండలం నేలతలమారి గ్రామానికి చెందిన తగరం గోపాల్ (60) వైద్యం కోసం సాయం చేయాలని కోరుతూ ఆయన భార్య సువర్ణమ్మ సీఎంను కోరారు. గోపాల్ ప్రాణాంతకమైన 'అప్లాస్టిక్ అనీమియా' వ్యాధితో బాధపడుతున్నారని, శస్త్రచికిత్సకు రూ.12 లక్షల వరకు ఖర్చవుతుందని విన్నవించారు. దీనిపై చంద్రబాబు స్పందించి అభయమిచ్చారు. ఆ తర్వాత 24 గంటలు గడవక ముందే సీఎం హామీ మేరకు రూ.5 లక్షల చెక్కును బాధితుడి బంధువు దినకర్‌కు కలెక్టరు పి.రంజిత్‌బాషా ఆదివారం అందజేశారు.

## నేటి నుంచి ఏపీఈఏపీసెట్

జేఎన్టీయూకే, మే 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో ఏపీ ఈఏపీసెట్-2025 సోమవారం నుంచి ప్రారంభం కానుంది. మొత్తం 3,62,448 మంది విద్యార్థులకు... ఇంజనీరింగ్‌కు 2,80,612 మంది, అగ్రికల్చర్ ఫార్మసీకి 81,836, రెండింటికీ 912 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఏపీలో 143, తెలంగాణలోని హైదరాబాద్‌లో 2 కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటలు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు రెండు సెషన్లలో ఆన్‌లైన్‌లో పరీక్షలు జరుగుతాయి. హాల్ టికెట్‌తో పాటు ఏదైనా ఒరిజినల్ గుర్తింపు కార్డు తప్పనిసరి. పరీక్ష కేంద్రంలోకి గంటన్నర ముందుగా ప్రవేశం కల్పిస్తారు. ఒక్క నిమిషం ఆలస్యంగా హాజరైనా అనుమతించరు.

## అదానీ స్కాంపై సీఎం స్పందించాలి: రామకృష్ణ

అనంతపురం విద్య, మే 18(ఆంధ్రజ్యోతి): 'దేశంలోనే అతి పెద్ద స్కాం అదానీ సోలార్ వ్యవహారం. ఇది రూ.1.10 లక్షల కోట్ల స్కాం' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. అనంతపురంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. లిక్కర్ స్కాంపై విచారణ చేసి, చర్యలు తీసుకున్న ఏపీ ప్రభుత్వం అదానీ సోలార్ స్కాంపై ఎందుకు మాట్లాడటం లేదన్నారు. దీనివల్ల ఏపీ ప్రజలపై 25 ఏళ్లు విద్యుత్ చార్జీల భారం పడుతుందని, చంద్రబాబు దీనిపై స్పందించాలని డిమాండ్ చేశారు.

## జీవో నెం 4 విడుదలపై వీఆర్వోల అసంతృప్తి

విజయవాడ(గాంధీనగర్), మే 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జీవో 4ను విడుదల చేయడంపై ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అసంతృప్తి వ్యక్తం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7,500 మంది వీఆర్వోలను మిగులు సిబ్బందిగా చూపించారని, మొదటి నుంచి ఈ రేషనలైజేషన్ ప్రక్రియను తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపింది. వీఆర్వోల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా జీవో 4ను విడుదల చేశారని విమర్శించింది.

# హైటెక్ దందా


ఇసుక వాహనాలకు రక్షణగా వెళుతున్న కార్లు

(మొదటి పేజీ తరువాయి)

కంకిపాడు, రొయ్యూరు, తోట్లవల్లూరు, మద్దూరు, పెదపులిపాకల నుంచి ఇసుక తరలిపోతోంది. ఎన్టీఆర్ జిల్లా నుంచి ఎస్కార్ట్ వాహనాల ద్వారా తెలంగాణకు.. కృష్ణా జిల్లా నుంచి రాజధాని పేరు చెప్పి గుంటూరు మీదుగా హైదరాబాద్‌కు తరలించేస్తున్నారు. ఇసుక దోపిడీని అడ్డుకునేందుకు తెలంగాణ రాష్ట్రంలో ట్రైనీ ఐపీఎస్‌లను నియమించి అక్కడి ప్రభుత్వం చెక్ పెట్టే ప్రయత్నాలు చేస్తోంది. ఇటీవల ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల నుంచి అక్రమంగా రవాణా అవుతున్న ఇసుక టిప్పర్లపై వరుసగా దాడులు చేసి సీజ్ చేస్తున్నారు. అయినా అక్రమ రవాణా ఆగడం లేదు. తెలంగాణలో ఉన్న ఇసుక డిమాండ్ రీత్యా ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలలోని అధికారిక, అనధికారిక రీచ్‌ల నుంచి పెద్ద ఎత్తున తరలిస్తున్నారు. తెలంగాణలో పోలీసులు పట్టుకుంటున్న ఘటనలను పరిశీలిస్తే ఇప్పటి వరకు ఏ వాహనాలకూ వే బిల్లులు లేవు.

### ఎన్టీఆర్ జిల్లా నుంచి..

ఎన్టీఆర్ జిల్లాలో కృష్ణానది, మున్నేరు, కట్టలేరుల నుంచి ఇసుక తరలిపోతోంది. ఇసుక సిండికేట్ మాఫియా అనుసరించే విధానం చూస్తే ఆశ్చర్యపోవాల్సిందే. ఇక్కడి నుంచి తెలంగాణకు వెళ్లే ఇసుక లారీలకు ముందుగా ఎస్కార్ట్ వాహనాలు వెళుతున్నాయి. మే 2న మధిరలో పట్టుబడిన 3 లారీలకు 3 కార్లు ఎస్కార్టుగా ఉన్నాయి. ఎస్కార్టు వాహనాలలో ఉండే సిబ్బంది, వెనుక వచ్చే లారీ డ్రైవర్ ఫోన్లు నిరంతరం ఆన్‌లోనే ఉంటాయి. ఎస్కార్టు ఇచ్చే డైరెక్షన్ ప్రకారం వెనుక లారీలు కదులుతాయి. టిప్పర్‌లో 45 నుంచి 50 టన్నులకు తక్కువ కాకుండా ఓవర్‌లోడ్‌తో ఇసుక రవాణా చేస్తున్నారు. తెలంగాణలో ఇసుక భారీగా ధర పలుకుతోంది. హైదరాబాద్ అయితే టన్నుకు రూ.1700, ఖమ్మం అయితే రూ.1400-రూ.1500 వరకు ధర గిట్టుబాటు అవుతోంది.

### మై వీల్స్ మొబైల్ యాప్ సాయంతో..

ఎన్టీఆర్ జిల్లా నుంచి తెలంగాణకు అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న సిండికేట్ మాఫియా మై వీల్స్ మొబైల్ అప్లికేషన్‌ను ఉపయోగిస్తోంది. ఈ యాప్ ద్వారా డ్రైవర్‌కు ఒక రూట్ సెట్ చేస్తారు. ఆ రూట్‌లో లారీ చక్రం ఆగినా యజమానికి అలర్ట్ వస్తుంది. పోలీసులు ముందు ఉన్నారని ఎస్కార్ట్ ద్వారా తెలిస్తే వెంటనే ఈ యాప్ ద్వారా డ్రైవర్‌కు మరో జీపీఎస్ రూట్ సెట్ చేస్తారు. ఇలా లారీ డ్రైవర్ కంగారు పడకుండా వాహనాలను మళ్లిస్తారు.

### కృష్ణా జిల్లా నుంచి..

కృష్ణా జిల్లాలో కృష్ణానదీ తీరం వెంబడి కరకట్ట రోడ్డు మీదుగా యనమలకుదురు, రామలింగేశ్వర్‌నగర్ మీదుగా వాహనాలను గుంటూరు తరలిస్తున్నారు. వాహనాలను అడ్డుకోకుండా రాజధానిలోని కాంట్రాక్టు సంస్థల లోగోలను ఇసుక లారీల మీద అంటించి గుంటూరు తరలించి, అక్కడి నుంచి హైదరాబాద్ తరలిస్తున్నారు.

### దొంగ రూట్లు ఇలా..

- ఎన్టీఆర్ జిల్లాలో జగ్గయ్యపేట నుంచి కంచికచర్ల మీదుగా ఖమ్మం, జగ్గయ్యపేట నుంచి నేరుగా ఖమ్మం, నందిగామ నుంచి వయా మధిర మీదుగా ఖమ్మం, కంచికచర్ల నుంచి వయా ఎర్రుపాలెం మీదుగా ఖమ్మం, కంచికచర్ల నుంచి ఎర్రుపాలెం, వైరా మీదుగా ఖమ్మం తరలిస్తున్నారు. ఇవి కాకుండా మరో 10 నుంచి 15 దొంక రూట్లు ఉన్నాయి.
- కృష్ణా జిల్లా నుంచి వచ్చే లారీలు కృష్ణా కరకట్ట మీదుగా విజయవాడ, గుంటూరుకు అక్కడి నుంచి రొంపిచర్ల-అద్దంకి-నార్కట్‌పల్లి రూట్‌లో హైదరాబాద్‌కు వెళుతున్నాయి.

## మూడు ప్రాణాల్ని బలిగొన్న నిద్ర మత్తు!


క్రేన్ సాయంతో బావిలో నుంచి కారును బయటకు తీస్తున్న పోలీసులు, గ్రామస్థులు, అగ్నిమాపక సిబ్బంది


శివానంద, లోకేశ్, చలపతి

» బావిలోకి దూసుకెళ్లిన కారు

» ముగ్గురు కర్ణాటక వాసులు దుర్మరణం

» అన్నమయ్య జిల్లా పీలేరు వద్ద ఘటన

పీలేరు, మే 18 (ఆంధ్రజ్యోతి): నిద్రమత్తు రూపంలో మృత్యువు ముగ్గురిని కబళించిన సంఘటన ఆదివారం వేకువజామున అన్నమయ్య జిల్లా పీలేరు మండలం జి.కురవపల్లె వద్ద జరిగింది. పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ కథనం మేరకు.. కర్ణాటక రాష్ట్రం చింతామణి, కోలారు, కైవారం ప్రాంతాలకు చెందిన ఎన్.లోకేశ్(36), సీఎం శివానంద(44), ఎన్.చలపతి(48), జి.తిప్పారెడ్డి(43), సీవీ సునీల్ (29) వంటమాస్టర్లుగా పనిచేస్తున్నారు. తమ ప్రాంతాలకు చెందిన మరికొందరితో కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో క్యాటరింగ్ కాంట్రాక్ట్ సర్వీసులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం పీలేరులో క్యాటరింగ్ చేసేందుకు తమిళనాడు రాష్ట్రం హోసూరులో శనివారం రాత్రి 12 గంటల ప్రాంతంలో శివానంద కారులో బయలుదేరారు. కారును లోకేశ్ నడుపుతుండగా మార్గమధ్యంలోని పీలేరు మండలం బాలంవారిపల్లె పంచాయతీ జి.కురవపల్లె వద్దకు వచ్చేసరికి అతను నిద్రమత్తులోకి జారుకున్నాడు. దీంతో కారు అదుపు తప్పి రోడ్డుపక్కనే ఉన్న పాడుబడిన వ్యవసాయ బావిలోకి దూసుకెళ్లింది. కారు వెనుక సీటులో కూర్చున్న తిప్పారెడ్డి, సునీల్ అద్దాలు పగలగొట్టుకుని బయటకు వచ్చి సమీపంలోని వారికి సమాచారం అందించారు. వారు స్థానికులతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, పీలేరు అగ్నిమాపక సిబ్బంది, గ్రామస్థులు క్రేన్ సాయంతో కారును బావిలో నుంచి బయటకు తీశారు. అప్పటికే నీటిలో మునిగి ఊపిరాడక లోకేశ్, శివానంద, చలపతి మరణించారు.

## రా'బంధువు'!

» ఆమంచర్లలో ఏడాదిగా బాలికపై అత్యాచారం

» గర్భం దాల్చడంతో అబార్షన్.. కేసు నమోదు

నెల్లూరు రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): సమీప బంధువైన ఓ బాలికపై ఓ మృగాడు ఏడాదిగా అత్యాచారం చేస్తున్నాడు. బాలిక గర్భం దాల్చడంతో బలవంతంగా అబార్షన్ చేయించిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. నెల్లూరు రూరల్ సీఐ గుంజి వేణు వివరాల మేరకు.. నెల్లూరు రూరల్ మండలం ఆమంచర్లలో ఉంటున్న లగుచోటి ఏడుకొండలుకు భార్య, పిల్లలు ఉన్నారు. అతనికి సమీప బంధువులైన దంపతులు వారి కుమార్తె(14)ను ఏడుకొండలు ఇంట్లో వదిలి రోజు కూలి పనులకు వెళ్లేవారు. ఈ క్రమంలో ఏడుకొండలు బాలికను లొంగదీసుకున్నాడు. కొన్ని రోజులుగా బాలిక నీరసంగా ఉంటుండటంతో ఆమె తల్లి ఆసుపత్రికి తీసుకెళ్లగా 5వ నెల గర్భవతి అని తేలింది. దీంతో ఏడుకొండలు బాలికకు అదే ఆస్పత్రిలో అబార్షన్ చేయించాడు. ఈ మేరకు బాధితురాలి తల్లి శనివారం తమకు ఫిర్యాదు చేసినట్టు సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఏడుకొండలు పరారీలో ఉన్నట్టు చెప్పారు.

# భారత్ సిమ్‌కార్డులతో పాకిస్థాన్‌లో వాట్సాప్

- మిలటరీ ఇంటెలిజెన్స్ సమాచారంతో 'ఆపరేషన్ ఘోస్ట్ సిమ్" పేరుతో ఏకకాలంలో మూడు రాష్ట్రాల్లో దాడులు
- ఏడుగురి అరెస్టు.. 948 సిమ్ కార్డుల స్వాధీనం
- సంగారెడ్డిలో పట్టుబడ్డ తాపీ మేస్త్రీ మొఫిసిల్ ఇస్లాం



గువాహటి/సంగారెడ్డి క్రైం(ఆంధ్రజ్యోతి), మే 18: "భారత ఆర్మీ జవానుకు.. పాకిస్థాన్ ఐఎస్ఐ నుంచి హనీట్రాప్..".. "భారత సిమ్‌కార్డులతో పాకిస్థానీ సైబర్ నేరగాళ్ల బురిడీ.. అమాయకుల లూటీ".. "టెర్రరిస్టుల ఫోన్లలో భారత సిమ్ నంబర్ల వాట్సాప్/టెలిగ్రామ్..".. తరచూ పతాక శీర్షికలకెక్కే ఈ తరహా వార్తల వెనక ఉన్న భారీ నెట్‌వర్క్ గుట్టును అసోం పోలీసులు రట్టు చేశారు. మిలటరీ ఇంటెలిజెన్స్ ఇచ్చిన సమాచారంతో 'ఆపరేషన్ ఘోస్ట్ సిమ్' పేరుతో రంగంలోకి దిగిన అసోం పోలీసులు తెలంగాణ సహా.. మూడు రాష్ట్రాల్లో ఏడుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి 948 సిమ్‌కార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోం డీజీపీ హర్మీత్‌సింగ్ ఈ కేసు వివరాలను వెల్లడించారు. మిలటరీ ఇంటెలిజెన్స్‌కు చెందిన గజరాజ్ కార్ప్స్ నుంచి పాకిస్థాన్‌లో వాడుతున్న ఘోస్ట్ సిమ్ నంబర్లపై అసోం పోలీసులకు సమాచారం అందింది. అంటే.. భారత్‌లో కొనుగోలు చేసిన సిమ్‌కార్డులకు సంబంధించిన వాట్సాప్, టెలిగ్రామ్ వంటి యాప్స్‌ను పాకిస్థాన్‌లో ఉన్న వారు నేరాల కోసం వాడుతుంటారు. మిలటరీ ఇంటెలిజెన్స్ గుర్తించిన నిందితులంతా దేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్నా.. అసోంకు చెందినవారే కావడంతో సమాచారాన్ని ఆ రాష్ట్ర పోలీసులకు అందజేశారు. "వెంటనే స్పెషల్ టాస్క్‌ఫోర్స్(ఎస్టీఎఫ్)ను రంగంలోకి దింపాం. అసోంతో పాటు.. రాజస్థాన్, తెలంగాణ రాష్ట్రాల్లో ఈనెల 16న దాడులు నిర్వహించి, ఏడుగురు నిందితులను అరెస్టు చేశాం. వీరిలో రాజస్థాన్‌లోని భరత్‌పూర్‌లో సాధిక్(47), అఖీక్(25), అల్వార్‌లో ఆరిఫ్‌ఖాన్(20), సాజిత్(21), అసోంలోని ధూబ్రీకి చెందిన జకారియా అహ్మద్(24), ఇదే ప్రాంతానికి చెందిన మొఫిసిల్ ఇస్లాం(19)ని తెలంగాణలోని సంగారెడ్డిలో అరెస్టు చేశాం. ధూబ్రీకి చెందిన అర్షద్‌ఖాన్(34) విదేశాలకు వెళ్తుండగా.. ఢిల్లీ విమానాశ్రయంలో పట్టుకున్నాం. తదుపరి దర్యాప్తులో ధూబ్రీకి చెందిన మరో 14 మందిని అదుపులోకి తీసుకుని, విచారిస్తున్నాం" అని డీజీపీ వివరించారు. అరెస్టయిన ఏడుగురి నుంచి 948 సిమ్‌కార్డులను, అక్రమ కమ్యూనికేషన్‌కు ఉపయోగించే పలు పరికరాలను సీజ్ చేశామని, అరెస్టుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయని చెప్పారు. "నిందితులు భారత్‌లోని వేర్వేరు ప్రాంతాల్లో తప్పుడు డాక్యుమెంట్లతో సిమ్‌కార్డులు తీసుకుంటారని తేలింది. వారు పాకిస్థాన్‌లో ఉన్న వారికి ఆ వివరాలను అందజేసేవారు. పాక్‌లో ఉన్నవారు వాట్సాప్, టెలిగ్రామ్ వంటి యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుంటే.. నిందితులు వారికి ఓటీపీలను అందజేసి, ఆయా యాప్‌లను యాక్టివేట్ చేయించేవారు. పాకిస్థాన్‌లో ఉండేవారు ఆ వాట్సాప్, టెలిగ్రామ్ యాప్‌లను సైబర్ నేరాలకు వాడేవారా? ఉగ్రవాదానికా? లేక ఇంకేమైనా నేరాలకా? అనేది దర్యాప్తులో తేలాల్సి ఉంది" అని ఎస్టీఎఫ్‌కు చెందిన ఓ అధికారి వ్యాఖ్యానించారు.

## సంగారెడ్డిలో కలకలం

అసోం పోలీసులు అరెస్టు చేసిన మొఫిసిల్ ఇస్లాంకు పాకిస్థాన్‌తో లింకులున్నట్లు తేలడంతో.. సంగారెడ్డి జిల్లాలో కలకలం రేగింది. అతను జిల్లాలోని కొండాపూర్ మండలం గొల్లపల్లిలో తాపీమేస్త్రీగా పనిచేస్తున్నట్లు స్థానిక స్పెషల్ బ్రాంచ్ పోలీసులు గుర్తించారు. అతనితో కలిసి పనిచేసిన వారిని, మొఫిసిల్‌ను పనిలో పెట్టుకున్న కాంట్రాక్టర్‌ని ఎస్‌బీ బృందాలు ఆదివారం విచారించాయి. ఈ విచారణలో మొఫిసిల్ పది రోజుల క్రితమే పనిలో చేరినట్లు తేలింది. దాంతో.. ఈ ప్రాంతంలో పనిచేస్తున్న అసోంకు చెందిన వారిపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

### 'ఆపరేషన్ సిందూర్' తర్వాతే?

ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్ ఐఎస్ఐకు చెందిన వారు భారతీయులతో ఇక్కడి సిమ్ నంబర్లతో సంభాషణలు కొనసాగించినట్లు మిలటరీ ఇంటెలిజెన్స్ గుర్తించినట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్‌పైనా సమాచారం కోసం కేంద్ర ఉద్యోగులకు వాట్సాప్‌లో సందేశాలు వచ్చినట్లు సమాచారం. ఆ వాట్సాప్ ఖాతాలను పరిశీలించగా.. సిమ్‌కార్డులు భారత్‌లో ఉండగా.. వాట్సాప్ వినియోగం పాక్‌లో జరుగుతున్నట్లు గుర్తించారు. దీంతో అప్రమత్తమైన మిలటరీ ఇంటెలిజెన్స్.. ఆ సిమ్‌కార్డులు ఎవరి పేర్లతో ఉన్నాయో పరిశీలించి, సింహభాగం అసోం చిరునామాలు ఉండడంతో.. ఆ రాష్ట్ర పోలీసులకు హెచ్చరికలు జారీ చేసినట్లు తెలుస్తోంది.

## 'పహల్గాం'కు ముందు జ్యోతి పాక్‌లోనే!

న్యూఢిల్లీ, మే 18: పాకిస్థాన్ ఏజెంట్లతో కలిసి గూఢచర్యానికి పాల్పడ్డ హరియాణాకు చెందిన యూట్యూబర్ జ్యోతిమల్హోత్రా(34) వ్యవహారంలో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చాయి. పహల్గాం ఉగ్ర దాడికి ముందు ఆమె పాకిస్థాన్‌లోనే ఉందని హరియాణాలోని హిస్సార్ ఎస్పీ శశాంక్ కుమార్ సావన్ తెలిపారు. తరచూ ఆమె పాక్ పర్యటనలకు వెళ్లారని, ఒకసారి చైనా పర్యటనకూ వెళ్లినట్లు పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ జ్యోతి మల్హోత్రా పాక్ ఏజెంట్లతో టచ్‌లో ఉన్నారని హిస్సార్ ఎస్పీ చెప్పారు. పోలీసులు ఆమె ఫోన్, లాప్‌టాప్ తదితర పరికరాలను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ విశ్లేషణ చేస్తున్నారు. కాగా, గతేడాది మే నెలలోనే కపిల్ జైన్ అనే 'ఎక్స్' వినియోగదారు జ్యోతిపై దృష్టి సారించాలని ఎన్ఐఏను కోరుతూ 'ఎక్స్'లో పోస్ట్ చేయడం విశేషం. ఆమె తొలుత పాక్ ఎంబసీలో ఫంక్షన్‌కు హాజరైందని, తర్వాత పాక్ పర్యటనకు వెళ్లిందని, అనంతరం కశ్మీర్ పర్యటనకూ వెళ్లనుందని... దీని వెనుక ఏదో ఉందని అందులో పేర్కొన్నారు. మే 7వ తేదీ నుంచి ఇప్పటివరకు పంజాబ్, హరియాణాల్లో మొత్తం ఏడుగురిని గూఢచర్యం కేసులో అరెస్టు చేశారు. ఈ గూఢచర్యం వ్యవహారం ఒడిశా రాష్ట్రానికీ చేరింది. ఒడిశాలో పూరీకి చెందిన ఓ మహిళా యూట్యూబర్‌కు జ్యోతి మల్హోత్రాతో పరిచయం ఉంది. జ్యోతి 2024 సెప్టెంబరులో పూరీని సందర్శించారు. పూరీకి చెందిన యూట్యూబర్ ఇటీవలే పాక్‌లోని కర్తార్‌పూర్ గురుద్వారాను సందర్శించారు.

## గౌరవ్ గొగోయ్ ఐఎస్ఐతో పనిచేశారు

- కాంగ్రెస్ ఎంపీపై అసోం సీఎం హిమంత తీవ్ర ఆరోపణ

గువాహటి, మే 18: కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ఆ పార్టీ డిప్యూటీ నేత గౌరవ్ గొగోయ్‌పై అసోం సీఎం హిమాంత బిశ్వశర్మ తీవ్ర ఆరోపణలు చేశారు. పాక్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ ఆహ్వానం మేరకు గౌరవ్ ఆ దేశంలో పర్యటించారని, ఆ సంస్థతో కలిసి పనిచేశారని తెలిపారు. తొలిసారిగా ఈ విషయాన్ని చెబుతున్నానని అన్నారు. ఇందుకు అన్ని ఆధారాలు ఉన్నాయని చెప్పారు. వాటన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత సెప్టెంబరు పదో తేదీన ప్రజలకు వెల్లడిస్తామని తెలిపారు. బిశ్వశర్మ ఆదివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ఈ ఆరోపణ చేశారు. ఆయనేమీ విహార యాత్రకు వెళ్లలేదని, కచ్చితంగా శిక్షణ పొందడానికే వెళ్లి ఉంటారని ఆరోపించారు. దీనిపై గౌరవ్ గొగోయ్ స్పందిస్తూ సీఎం వ్యాఖ్యలు బీ-గ్రేడ్ సినిమా కన్నా దారుణంగా ఉన్నాయని అన్నారు. ఆయన మానసిక ఆరోగ్యంపై తనకు ఆందోళన ఉందని చెప్పారు.

## పేలని బాంబులను నిర్వీర్యం చేస్తున్న సైన్యం

జమ్మూ, మే 18: ఆపరేషన్ సిందూర్‌కు వ్యతిరేకంగా జమ్మూకశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వెంబడి బారాముల్లా, బండిపోరా, కుప్వారా, పూంచ్ జిల్లాల్లోని సరిహద్దు గ్రామాల్లోకి పాకిస్థాన్ బలగాలు ప్రయోగించిన ఫిరంగి గుండ్లను భారత సైన్యం గుర్తించి నిర్వీర్యం చేసే భారీ ఆపరేషన్ ప్రారంభించింది. పూంచ్ జిల్లాలోని నివాస ప్రాంతాలు, పంటపొలాల్లో పడి పేలని 42 ఫిరంగి గుండ్లను బాంబు నిర్వీర్య బృందాలు నిర్వీర్యం చేశాయి. 2023లో నియంత్రణ రేఖ వెంబడి ఫిరంగి గుండ్ల పేలుళ్ల కారణంగా 41 మంది మృతిచెందిన నేపథ్యంలో అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

# రాజ్యాంగమే సుప్రీం!

## శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలు పరస్పరం గౌరవించుకోవాలి

- ఈ వ్యవస్థల్లో ఏదీ ఎక్కువా.. తక్కువా కాదు
- ప్రజాస్వామ్యంలో 3 స్తంభాలూ సమానమే: సీజేఐ జస్టిస్ గవాయ్



సన్మాన కార్యక్రమంలో బాంబే హైకోర్టు సీజే జస్టిస్ అలోక్, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్

ముంబై, మే 18: దేశంలో ఏ వ్యవస్థా గొప్పది కాదని.. భారత రాజ్యాంగం మాత్రమే సర్వోన్నతమైనదని భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయ్ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో కీలక స్తంభాలు.. శాసన, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థలు మూడూ సమానమేనని అన్నారు. ఇవి ఇచ్చిపుచ్చుకునే ధోరణితో వ్యవహరించాలని.. పరస్పరం గౌరవించుకోవాలని స్పష్టంచేశారు. న్యాయవ్యవస్థ తన పరిధిని అతిక్రమిస్తోందని పెద్దఎత్తున చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. ఈ నెల 14న 52వ సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌గా ప్రమాణం చేసి తొలిసారి ముంబై వచ్చిన ఆయన్ను మహారాష్ట్ర-గోవా బార్ కౌన్సిల్ ఆదివారం సత్కరించింది. రాష్ట్ర న్యాయవాదుల సదస్సు కూడా నిర్వహించింది. ఈ సందర్భంగా జస్టిస్ గవాయ్ ప్రసంగించారు. చట్టం చేసే అధికారం పార్లమెంటుకు ఉన్నప్పటికీ.. రాజ్యాంగ మౌలిక స్వరూపం జోలికి అది వెళ్లడానికి వీల్లేదన్నారు. 'రాజ్యాంగం సర్వోన్నత అధికారం, చట్టపాలన, న్యాయవ్యవస్థకున్న స్వేచ్ఛ వంటివాటిని రాజ్యాంగ సవరణ ద్వారా పార్లమెంటు సవరించడం గానీ, రద్దు చేయడం గానీ చేయజాలదు. రాజ్యాంగ మౌలిక నిర్మాణం దృఢతరమైనది. దాని మూలస్తంభాలైన శాసన, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థలు మూడూ సమానమే. కలిసిమెలిసి పనిచేయాలి' అని తెలిపారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తిచేసుకుంటున్న సమయంలో ప్రధాన న్యాయమూర్తిని కావడం సంతోషకరమని తెలిపారు. 'రాజ్యాంగంలోని మూడు స్తంభాలూ తమ తమ పరిధులకు లోబడి పనిచేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. శాసన, న్యాయవ్యవస్థలు చేసిన పలు చట్టాల కారణంగానే సామాజిక-ఆర్థిక న్యాయం భావన నెరవేరుతుంది' అని ఆకాంక్షించారు. ఆయన ఇచ్చిన 50 కీలక తీర్పుల సంకలనాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. వాటిలో కొన్నిటిని జస్టిస్ గవాయ్ ప్రస్తావించారు. బుల్డోజర్ న్యాయానికి వ్యతిరేకంగా తానిచ్చిన తీర్పు గురించి వివరించారు. 'నివాస హక్కు ప్రాథమిక హక్కు. ఏ వ్యక్తి అయినా ఏదైనా కేసులో నిందితుడైనా.. దోషిగా నిర్ధారణ అయినా.. అతడి కుటుంబ నివాసం చట్టబద్ధమైనదైతే.. దానిని తొలగించడానికి, కూల్చడానికి వీల్లేదు. చట్ట పాలనను అనుసరించి వ్యవహరించాల్సిందే' అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ దత్తా, బోంబే హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే తదితరులు పాల్గొన్నారు.

### '142' ప్రస్తావనపై చర్చ..

మహారాష్ట్ర సీఎస్, డీజీపీల ప్రోటోకాల్ ఉల్లంఘనపై జస్టిస్ గవాయ్ ఆర్టికల్ 142ను ప్రస్తావించడం చర్చనీయాంశమైంది. చట్టసభలు పంపిన బిల్లులను గవర్నర్లు, రాష్ట్రపతి నిర్దిష్ట కాలపరిమితికి లోబడి ఆమోదించాల్సిందేనని 142వ అధికరణ కింద తనకు సంక్రమించిన అధికారాన్ని వినియోగించి సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఇటీవల చరిత్రాత్మక తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. దీన్ని ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ తీవ్రంగా విమర్శించారు. ఇంకోవైపు.. రాష్ట్రపతిని సైతం నిర్దేశించే అధికారం సర్వోన్నత న్యాయస్థానానికి ఉందా.. రాష్ట్రపతి గానీ, గవర్నర్ గానీ తమ విధుల నిర్వహణలో ఏ కోర్టుకూ జవాబుదారీ కాదని రాజ్యాంగంలోని 361వ అధికరణ చెబుతోందని.. 201వ అధికరణ కింద విచక్షణాధికారాలు ఉన్న రాష్ట్రపతికి న్యాయస్థానాలు గడువు నిర్దేశించవచ్చా.. తదితర 14 ప్రశ్నలు సంధిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఇటీవల సుప్రీంకోర్టును వివరణ కోరారు. ఇది కోర్టును ధిక్కరించడమేనంటూ విపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో జస్టిస్ గవాయ్ 142 అధికరణపై చేసిన వ్యాఖ్య చర్చనీయాంశమైంది.

## కలసికట్టుగా వ్యతిరేకిద్దాం!

- 'సుప్రీం'ను రాష్ట్రపతి వివరణ కోరిన వ్యవహారంలో 8 రాష్ట్రాలకు స్టాలిన్ లేఖ


చెన్నై, మే 18(ఆంధ్రజ్యోతి): 'శాసనసభలు ఆమోదించిన బిల్లులకు అంగీకారం తెలిపేందుకు రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు నిర్ణయించడానికి వీలుందా?' అంటూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 14 ప్రశ్నలతో సుప్రీం కోర్టును వివరణ కోరడాన్ని కలిసికట్టుగా వ్యతిరేకించాలని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. ఆ మేరకు పశ్చిమబెంగాల్, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణ, కేరళ, జార్ఖండ్, పంజాబ్, జమ్మూ-కశ్మీర్ రాష్ట్రాల సీఎంలకు ఆయన లేఖ రాశారు. 'రాష్ట్ర ప్రభుత్వాలు శాసనసభలో ఆమోదించిన బిల్లులకు అంగీకారం తెలిపేందుకు గవర్నర్, రాష్ట్రపతికి గడువును నిర్ణయిస్తూ ఇటీవల సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పు తమిళనాడు రాష్ట్రానికేకాక అన్ని రాష్ట్రాలకూ వర్తిస్తుంది" అన్నారు.

## సీఎస్, డీజీపీ డుమ్మా..

### ప్రొటోకాల్ ఉల్లంఘనపై సీజేఐ ఆగ్రహం

సీజేఐ సన్మాన కార్యక్రమానికి మహారాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గానీ, డీజీపీ గానీ, ముంబై పోలీసు కమిషనర్ గానీ హాజరు కాలేదు. దీనిపై సదస్సులో జస్టిస్ గవాయ్ తీవ్రంగా స్పందించారు. 'ఒక మహారాష్ట్రీయుడు భారత ప్రధాన న్యాయమూర్తి బాధ్యతలు చేపట్టి.. తొలిసారి స్వరాష్ట్రానికి వస్తే.. హాజరు కావడం సముచితమని మహారాష్ట్ర సీఎస్, డీజీపీ, ముంబై కమిషనర్‌కు అనిపించలేదంటే.. ఇది కరెక్టో కాదో వారే ఆలోచించుకోవాలి. న్యాయవ్యవస్థను ఇతర వ్యవస్థలు గౌరవించడానికి సంబంధించిన అంశమిది. ప్రొటోకాల్‌కు కట్టుబడి ఉండాలని నేను పట్టుబట్టడం లేదు. అయితే ఓ వ్యవస్థ లేదా విభాగాధిపతి.. తొలిసారి రాష్ట్రానికి వస్తే.. అందునా ఆయన అదే రాష్ట్రానికి చెందినవారైతే.. ఇలా వ్యవహరించడం సముచితమో కాదో వారు ఆలోచించుకోవాలి. ఇలాంటి చిన్న చిన్న విషయాల జోలికి నేను వెళ్లను. అయితే ప్రజలందరికీ తెలియాల్సిన అవసరం ఉందనే దీనిని ప్రస్తావించాను. అదే మా న్యాయమూర్తుల్లో ఎవరైనా ప్రొటోకాల్ ఉల్లంఘిస్తే.. సుప్రీంకోర్టుకు ప్రత్యేక అధికారాలిచ్చే 142వ అధికరణపై చర్చలు పెట్టేస్తారు' అని గవాయ్ ఆక్షేపించారు. వ్యక్తులు తప్పనిసరిగా తన ముందు హాజరవ్వాలని ఆదేశాలిచ్చే అధికారాన్ని సుప్రీంకోర్టుకు ఈ అధికరణ ఇచ్చింది. బార్‌కౌన్సిల్ సన్మానం తర్వాత బాబాసాహెబ్ అంబేడ్కర్ స్మారక చిహ్నమైన చైత్యభూమిని సీజేఐ సందర్శించారు. అప్పటికే ఆయన చేసిన వ్యాఖ్యలు తెలియడంతో మహారాష్ట్ర సీఎస్ సుజాతా సౌనిక్, డీజీపీ రష్మీ శుక్లా, ముంబై పోలీసు కమిషనర్ దేవేన్ భారతి హడావుడిగా అక్కడకు చేరుకున్నారు.

## లోకం తీరు




## బయటికి చెప్పుకోలేక చనిపోతున్నారు!



న్యూఢిల్లీ, మే 18: పురుషుల్లో రోజురోజుకూ మానసిక సమస్యలు పెరుగుతున్నాయని మానసిక వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలను సమాజంలో చెప్పుకొనే పరిస్థితులు లేకపోవడం, పరిస్థితులను ఎదుర్కోవడానికి న్యాయపరమైన వెసులుబాట్లు లేకపోవడంతో బాధితులు కుమిలిపోతున్నారని తెలిపారు. ఫలితంగా పురుషుల్లో ఆత్మహత్యలు పెరుగుతున్నాయని వివరించారు. 2022లో భారతదేశంలో ఆత్మహత్యలు చేసుకున్న వారిలో 72% మంది పురుషులేనన్న ఎన్‌సీఆర్‌బీ నివేదికను వారు ఉటంకించారు. గృహ హింస కేసులు, లైంగిక వేధింపుల కేసులు, న్యాయపరమైన వేధింపులు, భావోద్వేగాలను రెచ్చగొట్టడం, అసత్య ఆరోపణలు.. ఇలాంటి అంశాలు పురుషుల్లో ఎంతో మానసిక సంఘర్షణకు కారణం అవుతున్నాయని వైద్య నిపుణులు తెలిపారు. ఈ వ్యవహారాల్లో ఉపశమనం కోసం పురుషులకు తగిన న్యాయపరమైన వెసులుబాట్లు లేవని, దీనిపై వెంటనే దృష్టి సారించాల్సిన అవసరం ఉందని వారు నొక్కి చెప్పారు. హరియాణాలో ఇటీవల నిర్వహించిన ఓ అధ్యయనంలో వివాహితులైన పురుషుల్లో 52.4శాతం మంది తాము లింగ వివక్షను ఎదుర్కొంటున్నామని చెప్పారు. ఈ అధ్యయనాన్ని మానసిక వైద్య నిపుణులు ప్రస్తావించారు. పురుషుల మానసిక సమస్యలను చూసీచూడనట్లు వదిలివేయడం వల్లనే ఈ పరిస్థితి తలెత్తుతోందని, న్యాయపరమైన సంస్కరణలు అవసరమని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ క్లినికల్ సైకాలజిస్ట్స్ జనరల్ సెక్రటరీ శ్వేతా శర్మ అభిప్రాయపడ్డారు.

## భారత్‌తో ఉద్రిక్తతలుంటే కష్టమే!

- 'బెయిల్ అవుట్' లక్ష్యాలకు ముప్పు
- పాక్‌కు ఐఎంఎఫ్ హెచ్చరిక

ఇస్లామాబాద్, మే 18: ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్‌కు తదుపరి నిధుల మంజూరుపై అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) కీలక నిర్ణయం తీసుకుంది. భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల విషయంలో పాక్‌కు హెచ్చరిక చేయడంతోపాటు కొత్తగా 11 షరతులు విధించింది. బెయిల్ అవుట్ ప్రోగ్రామ్‌లో భాగంగా తదుపరి విడత నిధులు విడుదల చేయాలంటే ఇవి పాటించాల్సిందేనని స్పష్టంచేసింది. భారత్‌లో ఉద్రిక్తతలు ప్రోగ్రామ్ ఆర్థిక, బాహ్య, సంస్కరణల లక్ష్యాలకు ముప్పు పెంచుతాయని ఐఎంఎఫ్ హెచ్చరించిందని ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్ వార్తాపత్రిక ఆదివారం నివేదించింది. పాకిస్థాన్‌కు విధించిన షరతుల్లో రూ.17.6 ట్రిలియన్ల బడ్జెట్‌కు పార్లమెంటరీ ఆమోదం, విద్యుత్తు బిల్లులపై రుణ సేవల సర్‌చార్జి పెంపు, మూడేళ్లకుపైగా వినియోగించిన కార్ల దిగుమతిపై ఆంక్షల తొలగింపువంటివి ఉన్నాయి. ఈమేరకు ఐఎంఎఫ్ శనివారం స్టాఫ్ లెవల్ రిపోర్టును విడుదల చేసింది. 'భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు అలాగే కొనసాగినా, పరిస్థితి మరింత దిగజారినా.. అది బెయిల్ అవుట్ ప్రోగ్రామ్ ఆర్థిక, బాహ్య, సంస్కరణ లక్ష్యాలకు ముప్పును పెంచుతుంది' అని పేర్కొంది. తాజా నిబంధనలతో పాక్‌పై ఐఎంఎఫ్ విధించిన షరతుల సంఖ్య 50కి చేరింది. భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలను ఐఎంఎఫ్ తన నివేదికలో ప్రస్తావించింది. అయితే మార్కెట్ ప్రతిస్పందన నియంత్రణలోనే ఉందని పేర్కొంది. వచ్చే ఆర్థిక ఏడాది బడ్జెట్‌లో రక్షణ బడ్జెట్ రూ.2.414 ట్రిలియన్లుగా ఉందని, ఇది గత ఏడాదితో పోలిస్తే 12శాతం పెంపు అని తెలిపింది. ఐఎంఎఫ్ అంచనాలతో పోలిస్తే.. భారత్‌తో ఘర్షణల నేపథ్యంలో రక్షణ రంగానికి రూ.2.5 ట్రిలియన్లు అధికంగా కేటాయిస్తున్నట్లు పాక్ ప్రభుత్వం సూచించింది.

# 33 దేశాల రాజధానులు! 7 ప్రతినిధి బృందాలు

## ఉగ్రవాదంపై భారత వైఖరి వినిపించడానికి సిద్ధం

- ఎన్డీయే నుంచి 31 మంది, ఇతర పార్టీల వారు 20 మంది
- ఏపీ నుంచి లావు, పురందేశ్వరి, హరీశ్‌కు స్థానం
- ఈ నెల 23 నుంచి పర్యటనలు





న్యూఢిల్లీ, మే 18: అంతర్జాతీయ వేదికపై పాక్ కుతంత్రాలను ఎండగట్టేందుకు కేంద్రం ఏర్పాటు చేసిన ఏడు అఖిలపక్ష బృందాలు 33 దేశాల రాజధానులను సందర్శించనున్నాయి. ఈ బృందాల్లో ఎన్డీయే నుంచి 31 మంది, ఇతర పార్టీలకు చెందిన 20 మందితోపాటు 8 మంది మాజీ దౌత్యవేత్తలు కలిపి మొత్తం 59మంది సభ్యులు ఉంటారు. బెల్జియం రాజధాని బ్రస్సెల్స్‌లోని యూరోపియన్ యూనియన్ (ఈయూ) ప్రధాన కార్యాలయాన్ని కూడా వీరు సందర్శిస్తారు. ఈ నెల 23 నుంచి ఈ బృందాల పర్యటనలు ప్రారంభంకానున్నాయి.

- సౌదీ అరేబియా, కువైట్, బహ్రెయిన్, అల్జీరియా దేశాలకు వెళ్లే మొదటి ప్రతినిధి బృందంలో బీజేపీ ఎంపీలు బైజయంత్ పాండా, నిశికాంత్ దూబే, ఫాంగ్నోన్ కొన్యాక్, రేఖా శర్మతోపాటు అసదుద్దీన్ ఒవైసీ (ఏఐఎంఐఎం), సత్నామ్ సింగ్ సంధూ (నామినేటెడ్ ఎంపీ), గులాం నబీ ఆజాద్ (కేంద్ర మాజీ మంత్రి, జమ్మూకశ్మీర్ మాజీ సీఎం), హర్ష్ శ్రింగ్లా (విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి) ఉంటారు.
- యూకే, ఫ్రాన్స్, జర్మనీ, ఈయూ, ఇటలీ, డెన్మార్క్ దేశాలకు వెళ్లే రెండో బృందంలో బీజేపీ ఎంపీలు రవిశంకర్ ప్రసాద్, దగ్గుబాటి పురందేశ్వరి, ఎంపీ), సమిక్ భట్టాచార్యతోపాటు అమర్ సింగ్ (కాంగ్రెస్), ప్రియాంక చతుర్వేది (శివసేన-యూబీటీ), గులాం అలీ ఖతానా (నామినేటెడ్ ఎంపీ), ఎంజే అక్బర్ (కేంద్ర మాజీ మంత్రి), పంకజ్ సరన్ (మాజీ దౌత్యవేత్త) ఉన్నారు.
- ఇండోనేషియా, మలేసియా, దక్షిణ కొరియా, జపాన్, సింగపూర్‌లో పర్యటించే మూడో బృందంలో సంజయ్ కుమార్ ఝా (జేడీయూ), అపరాజితా సారంగి, బ్రిజ్‌లాల్, ప్రదాన్ బారువా, హేమాంగ్ జోషి (బీజేపీ), యూసఫ్ పఠాన్ (టీఎంసీ), జాన్ బ్రిట్టాస్ (సీపీఎం), సల్మాన్ ఖుర్షీద్ (కాంగ్రెస్), మోహన్ కుమార్ (మాజీ దౌత్యవేత్త) ఉంటారు.
- యూఏఈ, లైబీరియా, కాంగో, సిరియా, సియెర్రా లియోన్ దేశాలలో పర్యటించే నాలుగో బృందంలో శ్రీకాంత్ ఏక్‌నాథ్ శిందే (శివసేన), బాన్సురి స్వరాజ్, అతుల్ గార్గ్, మనన్ కుమార్ మిశ్రా(బీజేపీ), ఎస్ఎస్ అహ్లూవాలియా (బీజేపీ మాజీ ఎంపీ), సస్మిత్ పాత్ర (బీజేడీ), మహమ్మద్ బషీర్ (ఐయూఎంఎల్), సుజన్ చినోయ్ (మాజీ దౌత్యవేత్త) ఉన్నారు.
- అమెరికా, పనామా, గయానా, బ్రెజిల్, కొలంబియా దేశాలను సందర్శించే ఐదో బృందంలో శశిథరూర్ (కాంగ్రెస్), శాంభవి (ఎల్‌జేపీ- రామ్‌విలాస్), సర్ఫరాజ్ అహ్మద్ (జేఎంఎం), జీఎం హరీశ్ బాలయోగి (టీడీపీ), శశాంక్ మణి త్రిపాఠి, భువనేశ్వర్ కలితా, తేజస్వి సూర్య (బీజేపీ), మిలింద్ మురళీ దేవరా (శివసేన), తరణ్‌జీత్ సంధూ (మాజీ దౌత్యవేత్త) ఉంటారు.
- స్పెయిన్, గ్రీస్, స్లొవేనియా, లాత్వియా, రష్యాల్లో పర్యటించే ఆరో బృందంలో కనిమొళి(డీఎంకే), రాజీవ్ రాయ్ (ఎస్పీ), మియాన్ అల్తాఫ్ అహ్మద్ (ఎన్‌సీ), బ్రిజేష్ చౌతా (బీజేపీ), ప్రేమ్ చంద్ గుప్తా (ఆర్‌జేడీ), అశోక్ కుమార్ మిట్టల్ (ఏఏపీ), మంజీవ్ ఎస్ పూరీ (మాజీ దౌత్యవేత్త), జావేద్ అష్రాఫ్ (మాజీ దౌత్యవేత్త) ఉంటారు.
- ఈజిప్ట్, ఖతార్, ఇథియోపియా, దక్షిణాఫ్రికా దేశాలను సందర్శించే ఏడో ప్రతినిధి బృందంలో సుప్రియా సూలే (ఎన్‌సీపీ-ఎస్‌సీపీ), రాజీవ్ ప్రతాప్ రూడీ, అనురాగ్ సింగ్ ఠాకూర్, వి.మురళీధరన్ (బీజేపీ), విక్రమజీత్ సింగ్ సాహ్నీ (ఏఏపీ), మనీశ్ తివారీ, ఆనంద్ శర్మ(కాంగ్రెస్), లావు శ్రీకృష్ణ దేవరాయులు (టీడీపీ), సయ్యద్ అక్బరుద్దీన్ (మాజీ దౌత్యవేత్త) ఉన్నారు.

## పాక్.. కాపీ, పేస్ట్ దౌత్యం!

- భారత్‌కు కౌంటర్‌గా విదేశాలకు శాంతి ప్రతినిధుల బృందం

ఇస్లామాబాద్, మే 18: ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోందన్న అపఖ్యాతి నుంచి బయటపడేందుకు, ప్రపంచ వేదికపై తన పరువు ప్రతిష్ఠలు కాపాడుకోవడానికి పాకిస్థాన్ నానాపాట్లు పడుతోంది. పాక్ కుతంత్రాలను ప్రపంచానికి చాటి చెప్పేందుకు భారత ప్రభుత్వం ఏడు అఖిల పక్ష బృందాలను నియమించింది. దీన్ని కాపీ కొడుతూ శాంతి కోసం తాము పాకులాడుతున్నామనే వాదనను వినిపించడానికి పాక్ సిద్ధమైంది. తమపై భారత్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండించడానికి ఒక ఉన్నత స్థాయి దౌత్య ప్రతినిధి బృందాన్ని ప్రధాన దేశాలకు పంపడానికి ప్రధాని షెహబాజ్ షరీఫ్ నిర్ణయించారని రేడియో పాకిస్థాన్ నివేదించింది. భారత ప్రభుత్వం తమ దౌత్య బృందాల వివరాలను వెల్లడించిన గంటల వ్యవధిలోనే ఈ ప్రకటన వెలువడింది. పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ చీఫ్ బిలావల్ భుట్టో జర్దారీ నేతృత్వంలోని ఈ శాంతి ప్రతినిధి బృందం అమెరికా, యూకే, బెల్జియం, ఫ్రాన్స్, రష్యాల్లో పర్యటిస్తుందని...శాంతి, స్థిరత్వం కోసం పాక్ చేస్తున్న ప్రయత్నాలను వివరిస్తుందని పీఎంవో పేర్కొంది.

## సింధ్‌లో లష్కర్ ఉగ్రవాది ఖాలిద్ హతం


- కాల్పులు జరిపిన గుర్తు తెలియని వ్యక్తి



న్యూఢిల్లీ, మే 18: లష్కర్ ఎ తోయిబా (ఎల్ఈటీ) ఉగ్రవాది రజావుల్లా నిజామానీ ఖాలిద్ అలియాస్ అబూ సఫీవుల్లా ఖాలిద్ ఆదివారం పాకిస్థాన్‌లోని సింధ్ ప్రావిన్స్‌లో హతమయ్యాడు. గుర్తు తెలియని వ్యక్తి అతడిపై కాల్పులు జరిపినట్టు అధికారవర్గాలు తెలిపాయి. మధ్యాహ్నం మాట్లీలోని తన ఇంటి నుంచి బయలుదేరి వెళ్తుండగా బాద్నీ క్రాసింగ్ వద్ద కాల్పులు జరిగాయని పేర్కొన్నాయి. 2006లో నాగ్‌పూర్‌లోని ఆరెస్సెస్ ప్రధాన కార్యాలయంపై జరిగిన దాడికి ఇతడే కీలక సూత్రధారి. ముగ్గురు తీవ్రవాదులు వచ్చి కాల్పులు జరపగా ఎదురుకాల్పుల్లో వారంతా మరణించారు. దాదాపు 25ఏళ్లుగా భారత్‌పై ఏదో రూపంలో దాడులు చేస్తూనే ఉన్నాడు. తొలుత 2000లో నేపాల్‌లో లష్కర్ ఎ తోయిబాను ఏర్పాటు చేసి అక్కడి నుంచి కార్యకలాపాలు నిర్వహించాడు. ఉగ్రవాదుల భర్తీని కూడా అప్పుడే చేపట్టాడు. వినోద్ కుమార్, రజావుల్లా, మహమ్మద్ సలీం వంటి మారు పేర్లతో భారత్‌లో పలుమార్లు దాడులు చేశాడు. 2005లో బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌పై జరిగిన దాడికీ కీలక సూత్రధారి ఇతడే. ఆ దాడిలో ప్రొఫెసర్ మునీష్ చంద్ర పురీ ప్రాణాలు కోల్పోగా, మరో నలుగురు గాయపడ్డారు. దాడులు చేసిన ఉగ్రవాదులు తప్పించుకున్నారు. దర్యాప్తు జరిపిన పోలీసులు లష్కర్ అగ్రనాయకుడు అబు అనీస్‌పై కేసు పెట్టారు. అతడు ఇప్పటికీ పోలీసులకు చిక్కలేదు. ప్రస్తుతం హతమైన ఖాలిద్..అబు అనీస్‌కు అత్యంత సన్నిహితుడు. 2008లో ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్‌లో ఉన్న సీఆర్‌పీఎఫ్ స్థావరంపై జరిగిన దాడిలోనూ కీలక పాత్ర పోషించాడు. ఆ దాడిలో ఏడుగురు జవాన్లు, మరో సాధారణ పౌరుడు ప్రాణాలు కోల్పోయారు. దాడి చేసిన ఇద్దరు ఉగ్రవాదులు తప్పించుకున్నారు.

## పాకిస్థాన్ కంటే నరకానికే వెళ్తా

- పుస్తకావిష్కరణ సభలో సినీ గేయ, కథా రచయిత జావేద్ అక్తర్



ముంబై, మే 18: భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో దాయాది దేశంపై ప్రముఖ బాలీవుడ్ సినీ గేయ, కథా రచయిత జావేద్ అక్తర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్‌కు వెళ్లాలా? నరకానికి వెళ్లాలా? అన్న ఆప్షన్లు తన ముందుకొస్తే తాను నరకాన్నే ఎంచుకుంటానని పేర్కొన్నారు. శనివారం ముంబైలో జరిగిన ఒక పుస్తకావిష్కరణ సభలో జావేద్ అక్తర్ మాట్లాడుతూ.. తనపై చాలా మంది ప్రశంసించారని, అదే సమయంలో ఇరుపక్షాల 'వేర్పాటువాదుల' నుంచి అవమానాలు, విమర్శలను ఎదుర్కొన్నానని చెప్పారు. 'నేను నాణేనికి ఒకవైపు చూస్తే నీవు నాస్తికుడి (కఫీర్)వి కనుక నరకాని (జహనుమ్)కి పొమ్మంటుంది. మరోవైపు చూస్తే నువ్వు ఉగ్రవాది (జిహాదీ)వి కనుక పాకిస్థాన్‌కు పొమ్మంటుంది. ఒకవేళ నా ముందు రెండు (పాకిస్థాన్/నరకం) అవకాశాలుంటే నేను నరకానికెళ్లడానికి ఇష్టపడతా' అని చెప్పారు.

## వయసు కనబడకుండా ఇలా...

కొంతమంది వయసు పెరుగుతున్నప్పటికీ ఆకర్షణీయంగా, ఆరోగ్యంగా కనిపిస్తూ ఉంటారు. ఇందుకు వారు అనుసరించే రోజువారీ అలవాట్లే కారణమని చెప్పవచ్చు. వయసును కనిపించనీయకుండా నిరంతరం ఉత్సాహంగా ఉంచే అలవాట్ల గురించి తెలుసుకుందాం...

- ప్రతిరోజూ సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలి. పీచుపదార్థాలు, పిండి పదార్థాలు, విటమిన్లు తదితర పోషకాలతో నిండిన తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు ఆహారంలో చేర్చుకోవాలి. యాంటీఆక్సిడెంట్లు, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు ఎక్కువగా ఉండే గింజలు తినడం వల్ల చర్మం బిగుతుగా ఆరోగ్యంగా ఉంటుంది. తీపి పదార్థాలు, ప్రాసెస్ చేసిన ఆహారం తినకూడదు. క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకుంటూ ఉంటే వృద్ధాప్య లక్షణాలు కనిపించవు.
- ప్రతిరోజూ కనీసం ఎనిమిది గ్లాసుల నీరు తాగాలి. దీనివల్ల శరీరంలోని విషపదార్థాలు విసర్జితమవుతాయి. తగినంత తేమ లభించడం వల్ల చర్మం మృదువుగా మెరుస్తుంది. కళ్లు ప్రకాశవంతంగా ఉంటాయి. తరచూ హెర్బల్ టీ లేదా నిమ్మరసం తాగడం మంచిది. కీరతోపాటు పుచ్చకాయ, నారింజ, బత్తాయి, ద్రాక్ష, వాటర్ యాపిల్ లాంటి పండ్లు తింటూ ఉంటే చర్మం స్థితిస్థాపకత మెరుగుపడుతుంది.
- శరీరం దృఢంగా ఉండాలంటే వ్యాయామం తప్పనిసరి. ప్రతిరోజూ క్రమం తప్పకుండా ఉదయం లేదా సాయంత్రం వ్యాయామం చేస్తూ ఉంటే శరీరానికి ఆక్సిజన్ అందుతుంది. ఒత్తిడి, ఆందోళన తగ్గి అకాల వార్ధక్య లక్షణాలు మాయమవుతాయి. యోగా, నడక వల్ల కూడా శరీరంలో రక్తప్రసరణ మెరుగుపడుతుంది. శరీర భాగాలన్నీ చురుకుగా పనిచేస్తాయి.



- ప్రతిరోజూ కనీసం ఏడు గంటలు నిద్రించాలి. నిద్రలోనే శరీరం కణాలను బాగుచేసుకుంటుంది. శక్తిని పుంజుకుంటుంది. ప్రశాంతంగా నిద్రించడం వల్ల ముఖ వర్చస్సు పెరుగుతుంది. మెదడు చురుకుగా పనిచేస్తుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది.
- రసాయన పద్ధతులతో కాకుండా సహజ విధానాల్లో చర్మాన్ని, శిరోజాలను సంరక్షించుకోవాలి. వాటికి నేరుగా ఎండ తగలకుండా చూసుకోవాలి.
- పుస్తకాలు చదవడం, ఆటలు ఆడడం, తోటపని లాంటి వ్యాపకాలను ఏర్పరచుకోవాలి. ధ్యానం లేదా ఇష్టమైన పని చేయడం ద్వారా ఒత్తిడిని అధిగమించాలి. సానుకూల మనస్తత్వాన్ని పెంచుకోవాలి. వస్త్రధారణ... హుందాగా ఉండేలా చూసుకోవాలి. వీటివల్ల మానసికానందం కలుగుతుంది. ఆహార్యం అందంగా మారుతుంది.



మనసు పలికే మౌన గీతాలను అక్షరాలుగా పేర్చడం... వాటికి కమ్మని రాగాలు అద్దడం... మోహిత గులాటి చిన్ననాటి అభిరుచి. కానీ చదువు... ఉద్యోగం... పెళ్లి... పిల్లలు... జీవితమనే పరుగులో ఆమె అభిరుచి తెర మరుగైపోయింది. క్షణం తీరిక లేకుండా దేశదేశాలు తిరిగే మోహితను... మళ్లీ ఆ పాత రోజులకు తీసుకువెళ్లింది నాన్న జ్ఞాపకం. ఆ స్ఫూర్తితోనే యాభై నాలుగేళ్ల వయసులో ఆమె తొలి పాప్ గీతాన్ని విడుదల చేశారు. వయసు కేవలం శరీరానికే కానీ... సాధించాలనే సంకల్పానికి కాదని నిరూపించారు.



సంకల్పం

# అభిరుచే... ఆమె పాటయింది

"పాప్ సంగీతం... అదీ కెరీర్‌లో మొట్టమొదటి పాట అనగానే బహుశా ఓ ఇరవై ఏళ్ల యువతి మీ కళ్ల ముందు కనిపించవచ్చు. నిజమే... సంగీతాభిరుచి గల నాకూ అదే భావన కలుగుతుంది. ఈ ఆలోచనతోనే చాలామంది తమ కలలను మధ్యలోనే వదిలేస్తున్నారు. 'వయసు మీద పడింది. ఇంకేం చేయలేం' అనే స్థితికి వచ్చేస్తున్నారు. కానీ సాధించాలన్న తపన, పట్టుదల ఉంటే వయసు, పరిస్థితులు అడ్డంకి కాదనేది నా అభిప్రాయం. నేనే అందుకు ప్రత్యక్ష ఉదాహరణ. చిన్నప్పటి నుంచీ నాకు సంగీతంపై మక్కువ. పాటలు తెగ వినేదాన్ని. గిటార్ నేర్చుకోవాలని కూడా ప్రయత్నించాను. నాలోని భావాలు, భావోద్వేగాలన్నిటినీ కలబోసి కవితలు రాసేదాన్ని. మా నాన్న ఆర్మీలో పని చేసేవారు. తరచూ మా నివాస ప్రాంతాలు మారుతూ ఉండేవి. ఇంతలోనే కాలేజీ వయసు వచ్చింది. దీంతో నా అభిరుచులేవీ కొనసాగించలేకపోయాను.

### డిగ్రీ తరువాత...

ఢిల్లీ యూనివర్సిటీలో బీఏ ఇంగ్లీష్ పూర్తి చేశాను. అది అవ్వగానే 1992లో ఢిల్లీలోని తాజ్ హోటల్ గ్రూప్ మార్కెటింగ్ విభాగంలో ఉద్యోగం వచ్చింది. దాదాపు మూడున్నరేళ్లు అక్కడ పని చేశాను. ఫుడ్ ప్రమోషన్స్‌తో పాటు వివిధ కార్యక్రమాలు, ఫ్యాషన్ షోస్ నిర్వహించాను. వైన్ టేస్టింగ్‌లో అనుభవం గడించాను. ఇవన్నీ నా కెరీర్‌కు బలమైన పునాది వేశాయి. తరువాత కొలంబస్ కంపెనీలో బిజినెస్ డెవలప్ మేనేజర్‌గా, వండర్‌లస్ట్ కార్పొరేట్స్‌లో డైరెక్టర్‌గా, బ్రాడ్ విజన్‌లో వైస్ ప్రెసిడెంట్‌గా, అల్కాటెల్ లూసెంట్ ఇండియా మార్కెటింగ్ హెడ్‌గా చేశాను. అక్కడి నుంచి పీఎంజీ ఏషియా పసిఫిక్ సంస్థ నుంచి పిలుపు రావడంతో సింగపూర్ వెళ్లాను. రెండేళ్ల అనంతరం అక్కడి మరో కంపెనీలో క్లయింట్ ఎంగేజ్‌మెంట్ వైస్ ప్రెసిడెంట్‌గా కొంత కాలం పని చేశాను. ప్రస్తుతం సింగపూర్‌లోనే క్లయింట్ సర్వీసింగ్, మార్కెటింగ్ ఏజెన్సీ ఒకటి నడిపిస్తున్నాను.

### క్షణం తీరిక లేదు...

చదువు అయిపోయింది మొదలు నా ప్రయాణం ప్రవాహంలా సాగిపోతోంది. పెళ్లి తరువాత బాధ్యతలు పెరిగాయి. ఆయన ఒక బహుళ జాతి కంపెనీలో కీలక హోదాలో ఉన్నారు. మాకు ఇద్దరు పిల్లలు. చదువు, ఉద్యోగం, పెళ్లి, పిల్లలు, వాళ్ల పెంపకం, వాళ్ల చదువులు... వీటికితోడు వృత్తి నేపథ్యంలో తరచూ విదేశాలకు వెళ్లి రావడం... నా జీవితం నా చేతుల్లో లేకుండా పోయింది. నా గురించి నేను ఆలోచించే తీరిక ఉండేది కాదు. కొన్నేళ్ల తరువాత పై చదువుల కోసం మా అబ్బాయిలు వేరే ప్రాంతాలకు వెళ్లారు. అప్పటికిగానీ నాకంటూ కొంత సమయం దొరకలేదు.

### ఆలోచన మార్చిన రోజు...

ఒక రోజు మా అన్నయ్య ఇంటికి వచ్చాడు. రిబ్బన్‌తో కట్టివున్న ఫోల్డర్‌ను నా చేతులో పెట్టాడు. అది మా నాన్న... నా కోసం దాచిపెట్టింది. నాకు ఇవ్వమని తను చనిపోయేముందు అన్నయ్యకు చెప్పారట. తెరిచి చూస్తే... అందులో నా సర్టిఫికెట్లు, పేపర్ కటింగ్స్ ఉన్నాయి. అవి నేను బడి రోజుల్లో సంగీతం, కవితల పోటీల్లో సాధించిన విజయాలకు గుర్తులు. ఒక్కసారిగా అవి నన్ను నా బాల్యంలోకి తీసుకువెళ్లాయి. అప్పుడు నాన్న చెప్పిన మాటలు మదిలో మెదిలాయి. ఆయనకు నా ప్రతిభపై అపారమైన నమ్మకం. 'కవితలు రాయడం ఎప్పటికీ ఆపవద్దు' అనేవారు. ఆ జ్ఞాపకం నన్ను కదిలించింది. ఆ క్షణం నా జీవితాన్ని మలుపు తిప్పింది.

### అలా నా పాట పుట్టింది...



ముప్పై ఏళ్ల సుదీర్ఘమైన కార్పొరేటు కెరీర్. అందులో విజయవంతమయ్యాను. కానీ ఎక్కడో నాలోని సృజనాత్మకత మాయమైపోయింది. ఈ అసంతృప్తి నాకు నిద్ర పట్టనివ్వలేదు. అంతర్లీనంగా ప్రవహిస్తున్న నాలోని సంగీతాభిలాషకు ఒక రూపం ఇవ్వాలనుకున్నాను. వెంటనే కార్యక్షేత్రంలోకి దిగాను. ఆన్‌లైన్‌లో సంగీత శిక్షణ తీసుకున్నాను. కార్లు, విమానాల్లో ప్రయాణించే సమయంలో సాధన చేశాను. నా అనుభవాలను రంగరించి ఒక పాట రాశాను. నా సంగీత గురువు మిన్సల్ జైన్ ఈ గీతానికి బాణీ కట్టారు. నిర్మాత, మిక్సింగ్ ఇంజనీర్ పతీక్ మనియార్ సహకారంతో గత నెలలో నా మొట్టమొదటి పాప్ సింగిల్... 'దట్ ఒన్ ఎమోషన్' విడుదలైంది. ఐదు పదులు దాటాక పాటల ప్రపంచంలో కొత్తగా కెరీర్ ప్రారంభించేవారు చాలా అరుదు. ఈ వయసులో ఇదేమిటనేవారూ ఉన్నారు. అవేవీ నేను పట్టించుకోను. ఇన్నేళ్ల తరువాత నా అభిరుచికి పట్టం కట్టినందుకు, నాన్న నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిజం చేసినందుకు ఎంతో సంతోషంగా ఉంది."

### అదే పాటకు ప్రాణం...

ప్రముఖ మ్యూజిక్ ప్లాట్‌ఫామ్‌లతో పాటు యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌ల్లో కూడా నా పాటను విడుదల చేశాను. మంచి ఆదరణ లభిస్తోంది. కొందరైతే నా ప్రయత్నాన్ని మనసారా అభినందించారు. లేటు వయసులో ఏమీ సాధించలేమనేవారికి నా ప్రయాణం స్ఫూర్తి నింపుతుందని అంటుంటే మనసు ఉప్పొంగుతుంది. నా 'దట్ ఒన్ ఎమోషన్' పాట... తాత్కాలిక సంబంధాలు కొనసాగుతున్న ఈ ప్రపంచంలో నిజమైన, నిజాయితీ గల ప్రేమానుబంధాల కోసం అన్వేషిస్తుంది. భావోద్వేగాలు, అనుబంధాలే ఈ పాటకు ప్రాణం. ఈ విజయం స్ఫూర్తితో మరో సింగిల్‌తో పాటు ఒక ఆల్బమ్ కూడా తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాను. విభిన్నమైన సంగీతంతో మళ్లీ త్వరలోనే మీ ముందుకు వస్తాను.

---

**సావన్ దత్తా భాష సంగీతం. పర్యటనలు, కమ్మని వంటలు, వాతావరణ మార్పులు... ఇలా ఏ అంశాన్నైనా పాటగా మార్చి, సంగీతం కూర్చి ప్రేక్షకులకు అందించడం ఆమెకు సరదా. వ్లోగర్‌గా సోషల్ మీడియాలో ప్రఖ్యాతి పొందిన ఈ కోల్‌కతా మహిళ ఇప్పుడు గుండె పోటు గురించి ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు... గుండె ఆరోగ్యానికి దోహదం చేసే రెసిపీలను పరిచయం చేస్తున్నారు. తన కొత్త ప్రయాణం గురించి సావన్ ఏం చెబుతున్నారంటే...**

# ఆరోగ్యకరమైన గుండె కోసం..!

"సంగీతం అంటే నాకు ప్రాణం.. దానికి దోహదం చేసింది మా తాతయ్య. నాకు మూడేళ్ళ వయసున్నప్పుడు ఆయన ఒక చిన్న హార్మోనియం బహుమతిగా ఇచ్చారు. దానికి రంగురంగుల మెట్లుండేవి. మేలుకొని ఉన్నంతసేపు నచ్చినట్టు దాన్ని వాయించడమే నా పని. నేను పుట్టింది పెరిగింది కోల్‌కతాలో. మా కుటుంబంలో అందరూ సంగీతాభిమానులే కాదు, కొద్దోగొప్పో సంగీతంలో ప్రవేశం ఉన్నవాళ్ళు కూడా. మా అమ్మ హవాలియన్ గిటార్ వాయించేది. సహజంగానే నా జీవితంలో కూడా సంగీతం విడదీయలేని భాగమైపోయింది.

### ప్రయోగాలంటే ఇష్టం..

నేను పూర్తిస్థాయి సంగీత కళాకారిణిగా మారడానికి పునాది నాకు పదకొండేళ్ళ వయసున్నప్పుడు పడింది. మ్యూజీషియన్స్ కావాలనే ఆలిండియా రేడియో ప్రకటన చూసి, అమ్మ ప్రోత్సాహంతో అప్లై చేశాను. హవాలియన్ గిటార్‌లో ఆడిషన్ ఇచ్చి, రెగ్యులర్ పెయిడ్ లైవ్ పెర్ఫార్మర్‌గా ఎంపికయ్యాను. నా తొలి సంపాదనను అప్పుడే అందుకున్నాను. ఆ తరువాత 'స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్'లో డిగ్రీ చేస్తున్నప్పుడు... సొంతంగా రాక్‌బాండ్ ఏర్పాటు చేసి ప్రదర్శనలు ఇచ్చేదాన్ని. అలాగే పలు వాయిద్యాల్లో శిక్షణ పొంది నైపుణ్యం సాధించాను. అనేక మ్యూజిక్ బాండ్స్‌తో కలిసి దేశ విదేశాల్లో నా సంగీతాన్ని వినిపించాను. నిరంతరం ప్రేక్షకుల ముందు ఉండడం, సంగీతంతో కొత్త కొత్త ప్రయోగాలు చేసి వారికి వినిపించడం నాకు ఇష్టం. దానికి సోషల్ మీడియా చక్కటి సాధనం. ప్రదర్శనలు లేని సమయంలో... నా సొంత స్టూడియోలో తీసిన వీడియోలను అప్‌లోడ్ చేస్తూ వచ్చాను. సాధనతో సాధించలేనిది ఏదీ లేదంటారు. మ్యూజిక్ కంపోజింగ్, పాటలు రాయడం, పాడడం... ఇలా అన్నీ నేనే చెయ్యడం క్రమంగా అలవాటయిపోయింది. వంటల తయారీ, పర్యటనల్లో అనుభవాలు, వాతావరణ మార్పుల గురించి అవగాహన, కొవిడ్ వచ్చినప్పుడు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు... ఇలా ప్రతి అంశాన్నీ నేను సంగీతాన్ని మేళవించి, వినోదభరితంగా చెప్పడం ప్రేక్షకులకు నచ్చింది. మంచి గుర్తింపు సైతం వచ్చింది. హాయిగా సాగిపోతున్న నా జీవితంలో ఊహించని ఘటన చోటుచేసుకుంది.

### తెలిసింది చాలా తక్కువ...

అయిదేళ్ళ క్రితం... నా భర్త అరుణ్‌కు తీవ్రస్థాయిలో గుండె పోటు వచ్చింది. ఆయనకు ఓపెన్ హార్ట్ సర్జరీ చేయాల్సి వచ్చింది. అప్పటివరకూ హాయిగా తిరిగిన అరుణ్‌కు హఠాత్తుగా ఆలా కావడం నన్ను చాలా భయపెట్టింది. గుండె సమస్యల గురించి, వాటికి దారి తీసే కారణాల గురించి మరింత క్షుణ్ణంగా తెలుసుకున్నాను. గుండె ధమనుల్లో పూడికలు ఏర్పడినా... ఎలాంటి లక్షణాలు ముందుగా కనిపించవు. గుండె పోటు వచ్చేవరకూ ఈ సమస్య ఉందని తెలుసుకోవడం కష్టం. యుక్తవయస్కులు కూడా ఎక్కువ సంఖ్యలో దీని బారిన పడుతున్నారు. కానీ ఈ విషయంలో ప్రజలకు తెలిసింది చాలా తక్కువ. నా భర్తకు ఈ సమస్య వచ్చేదాకా



నాకు కూడా దాని గురించి పెద్దగా తెలీదు. నా పరిజ్ఞానం పెంచుకోవడానికి ఎన్నో గంటల సేపు కార్డియాలజిస్టులతో మాట్లాడాను. శస్త్ర చికిత్సల అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి నిపుణులతో చర్చించాను. తద్వారా అరుణ్ ఆరోగ్యం కోసం అవసరమైన జాగ్రత్తలన్నీ తీసుకున్నాను. ఈ క్రమంలో మనం తీసుకొనే ఆహారానికి, గుండె ఆరోగ్యానికి మధ్య ఉన్న సంబంధం ఏమిటో అర్థమయింది. గుండె ఆరోగ్యం, గుండె పోటు నివారణ గురించి ప్రజలకు అవగాహన కల్పించడం అవసరం అనిపించింది. అలా 'హార్ట్ హెల్త్ ఫర్ డమ్మీస్' అనే నా తాజా ఇన్‌స్టాగ్రామ్ సిరీస్‌కు బీజం పడింది.

> పసుపు, వెల్లుల్లి, నీరుల్లి, నట్స్, సీడ్స్ ఆకు కూరలు, మిల్లెట్స్... ఇలా గుండెను ఆరోగ్యంగా ఉంచే ఎన్నో పదార్థాలు మన వంటింట్లోనే ఉన్నాయి. నూనెల వాడకం తగ్గించడం, కొలెస్ట్రాల్ ఎక్కువ కాకుండా చూసుకోవడం లాంటివి గుండె ఆరోగ్యానికి కీలకం. మనకు ఇష్టమైన రుచులను ఆస్వాదిస్తూనే ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఎలాగో చెప్పే వంటలను పరిచయం చేస్తున్నాను.



### రుచిగా, ఆరోగ్యంగా...

ఈ సిరీస్‌లో నేను సంగీతాన్ని ప్రధానంగా తీసుకోవాలని అనుకోలేదు. ఎందుకంటే గుండె ఆరోగ్యం అనేది సీరియస్ విషయం. దాన్ని పాట పరిధిలోకి కుదించడం కష్టం. అలాగే ఒక ఇన్‌స్టాగ్రామ్ రీల్ నిడివి పూర్తి పాటకు సరిపోదు. కాబట్టి వీక్షకులు నా నుంచి ఆశించే వినోదం వీటిలో కాస్త తక్కువే. కానీ అంతకన్నా విలువైన విషయాలను వీటిలో చెబుతున్నాను. పసుపు, వెల్లుల్లి, నీరుల్లి, నట్స్, సీడ్స్, ఆకు కూరలు, మిల్లెట్స్... ఇలా గుండెను ఆరోగ్యంగా ఉంచే ఎన్నో పదార్థాలు మన వంటింట్లోనే ఉన్నాయి. నూనెల వాడకం తగ్గించడం, కొలెస్ట్రాల్ ఎక్కువ కాకుండా చూసుకోవడం లాంటివి గుండె ఆరోగ్యానికి కీలకం. మనకు ఇష్టమైన రుచులను ఆస్వాదిస్తూనే ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఎలాగో చెప్పే వంటలను పరిచయం చేస్తున్నాను. 'హార్ట్ హెల్దీ' చికెన్ బిరియానీ మొదలు కాఫీ వరకు అనేక వంటకాలను వాటి తయారీ విధానాలతో సహా ఇన్‌స్టాగ్రామ్‌లో పెడుతున్నాను.

### ఎప్పటికప్పుడు కొత్త సమాచారంతో...

ఈ కొత్త ప్రయాణం చాలా ఆసక్తిదాయకంగా సాగుతోంది. ఎందుకంటే... వీక్షకులకు మరింత అవగాహన కల్పించడం కోసం ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతున్నాను. మెడికల్ జర్నల్స్ నుంచి, అమెరికన్ హార్ట్ అసోసియేషన్, యూరోపియన్ సొసైటీ ఆఫ్ కార్డియాలజీ, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ తదితర సంస్థల నుంచి సమాచారాన్ని సేకరిస్తున్నాను. గుండె సమస్యలు వచ్చినప్పుడు ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయి? గుండె పోటు వస్తే అత్యవసరంగా తీసుకోవాల్సిన చర్యలేమిటి? అనారోగ్యం బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? శస్త్రచికిత్స జరిగితే... ఆ తరువాత అనుసరించాల్సిన పద్ధతులేమిటి?... ఇలా ఎన్నో విషయాలను చెబుతున్నాను. మరోవైపు నా సంగీత యాత్ర కూడా కొనసాగుతోంది. అయితే మునుపటికన్నా ఇప్పుడు నా జీవితం మరింత అర్థవంతంగా అనిపిస్తోంది."

---

## పిల్లల గది ఇలా ఉండాలి..



పిల్లల ఆలోచనలు, అభిరుచులకు అనుగుణంగా సౌకర్యవంతంగా ఉండేలా వారి గదిని తీర్చిదిద్దాలి. చిన్నారుల్లో సృజనాత్మకతను పెంచుతూ వాళ్లు ఆనందంగా గడిపేలా గదిని అలంకరించాలి. పిల్లల గదిని డిజైన్ చేసేటప్పుడు ఏ అంశాలు పరిగణనలోకి తీసుకోవాలో తెలుసుకుందాం....

- పిల్లల గదిలో గోడలకు ఒకే రంగు కాకుండా మూడు లేదా నాలుగు రంగులు ఉండేలా చూసుకోవాలి. గులాబీ, నీలం, పసుపు, ఆకుపచ్చ లాంటి ముదురు రంగులను ఎంచుకోవడం మంచిది.
- గోడలకు వాల్ పేపర్లు అంటిస్తే గది ఆకర్షణీయంగా కనిపిస్తుంది. కార్టూన్ బొమ్మలు, పిల్లలకు ఇష్టమైన కథల్లోని పాత్రల బొమ్మలు అంటించవచ్చు. ఫ్లోరల్ లేదా జంగిల్ థీమ్‌తో ఉన్న వాల్ పేపర్లు కూడా బాగుంటాయి. వీటిని పిల్లల ఇష్టప్రకారం ఎంపిక చేయడం మంచిది. కొంతమంది పిల్లలకు ప్రపంచంలోని దేశాల గురించి తెలుసుకోవాలనీ, వివిధ ప్రదేశాలకు వెళ్లాలనే ఆసక్తి ఉంటుంది. అలాంటప్పుడు రంగురంగుల ప్రపంచ పటాన్ని వాల్ పేపర్‌గా ఏర్పాటు చేయాలి. సీలింగ్ మీద.... రాత్రిపూట మెరిసే సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాల బొమ్మలు అంటిస్తే పిల్లలు వాటిని చూస్తూ నిద్రపోతారు.
- గది అంతటా వెలుగు ప్రసరించేలా ట్యూబ్‌లైట్ అమర్చాలి. చిన్న బెడ్ లైట్ కూడా ఉంటే మంచిది.
- పిల్లల గదిలో సోఫా కమ్ బెడ్‌ను ఏర్పాటు చేస్తే అది రెండు విధాలుగా పనికివస్తుంది. దిండ్లకు కార్టూన్ బొమ్మలు లేదా మంచి కొటేషన్స్ ఉన్న గలేబులను తొడిగితే బాగుంటుంది. ఆకర్షణీయమైన డిజైన్లతో ఉన్న దుప్పట్లను పిల్లలకు అందుబాటులో ఉంచాలి. తెలుపు లేదా లేత రంగుల్లో ఉన్నవాటిని ఎంపిక చేసుకుంటే బాగుంటుంది.
- పిల్లల గదిలో బుక్ షెల్ఫ్ తప్పనిసరిగా ఉండాలి. ఇందులో వాళ్లు ఆడుకునే బొమ్మలు, చదువుకునే పుస్తకాలు, కథల పుస్తకాలు లాంటివి సర్ది పెట్టాలి.
- గదిలో ఓ పక్కగా స్టడీ టేబుల్, కుర్చీలను ఏర్పాటు చేయాలి. టేబుల్ మీద పెన్నులు, పెన్సిళ్లు, టేబుల్ లైట్, రైటింగ్ ప్యాడ్ సర్దాలి.

## ఇంట్లో ఆఫీస్ స్పేస్



ఇంటి నుంచి పనిచేసే విధానం ఇప్పటికీ కొనసాగుతోంది. కొన్ని సంస్థలు పూర్తి స్థాయిలో ఈ అవకాశాన్ని కల్పిస్తుంటే మరి కొన్ని మాత్రం వారానికి మూడు రోజులు ఇంటి నుంచి పనిచేయమంటున్నాయి. దీంతో ఇల్లే ఆఫీసులా మారిపోతోంది. ఇలాంటప్పుడు కుటుంబ సభ్యులకు ఇబ్బంది కలుగకుండా ఇంట్లో ఆఫీస్ స్పేస్‌ను ఎలా ఏర్పాటు చేసుకోవాలో తెలుసుకుందాం....

- ముందుగా ఇంట్లో ప్రశాంతంగా ఉండే చోటుని ఎంపిక చేసుకోవాలి. కుటుంబ సభ్యులు ఎక్కువగా ఉపయోగించని గది అయితే మంచిది. అలా ప్రత్యేకమైన గది లేని పక్షంలో ఇంట్లో ఒక మూలగా ఆఫీస్ స్పేస్‌ను ఏర్పాటు చేసుకోవాలి. శబ్దాలు వినిపించని చోటైతే పని చేసుకోవడానికి అనుకూలంగా ఉంటుంది.
- ఆఫీసు పని కోసం నిర్దేశించుకున్న చోట లేదా ఆ గదిలో ఒక టేబుల్ దాని ముందు సౌకర్యవంతంగా ఉండే కుర్చీని వేసుకోవాలి. పక్కనే కావాల్సిన వస్తువులు పెట్టుకోవడానికి వీలుగా చిన్న స్టాండ్ లేదా ర్యాక్‌లను అమర్చుకోవాలి. ఓ మూలగా మొక్కల కుండీలు పెట్టుకుంటే ప్రశాంతంగా అనిపిస్తుంది.
- టేబుల్ మీద కంప్యూటర్ లేదా ల్యాప్‌టాప్, కేబుల్ ఆర్గనైజర్, ఛార్జర్, నోట్‌ప్యాడ్, క్యాలెండర్, పెన్ స్టాండ్ తదితరాలను సర్దుకోవాలి. టేబుల్ లైట్, చిన్న ఫ్లవర్ వాజ్‌లను కూడా పెట్టుకుంటే బాగుంటుంది.
- గోడలకు మంచి పెయింటింగ్స్ లేదా స్టిక్కర్స్ ఏర్పాటు చేస్తే కార్యాలయంలో ఉన్న అనుభూతి కలుగుతుంది.
- ఆఫీసు పని చేసుకునే గదిలో గాలి, వెలుతురు ప్రసరించేలా ఉండాలి. రాత్రిపూట పనిచేసేవారు తెల్లటి కాంతిని ఇచ్చే ట్యూబ్‌లైట్లను అమర్చుకోవాలి. ఫ్యాన్ శబ్దం చేయకుండా చూసుకోవాలి.

# పదేళ్ల తర్వాత..

ప్లే ఆఫ్స్‌కు పంజాబ్




## తిప్పేసిన హర్‌ప్రీత్ ● వధేరా, శశాంక్ మెరుపులు

**జైపూర్:** లెఫ్టామ్ స్పిన్నర్ హర్‌ప్రీత్ బ్రార్ (3/22) కీలక వికెట్లతో మ్యాచ్‌ను మలుపు తిప్పడంతో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ 10 పరుగుల తేడాతో రాజస్థాన్ రాయల్స్‌ను ఓడించింది. నేహల్ వధేరా (37 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సులతో 70), శశాంక్ సింగ్ (30 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సులతో 59 నాటౌట్) ధనాధన్ అర్ధ శతకాలతో చెలరేగారు. మరో మ్యాచ్‌లో గుజరాత్ జట్టు ఢిల్లీని ఓడించడంతో పంజాబ్.. పదేళ్ల సుదీర్ఘ విరామానంతరం ప్లే ఆఫ్స్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. చివరిసారిగా 2014లో పేఆఫ్స్ చేరిన పంజాబ్.. ఆ సీజన్‌లో రన్నరప్‌గా నిలిచింది. తొలుత పంజాబ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 219 పరుగులు చేసింది. శ్రేయాస్ అయ్యర్ (30) రాణించాడు. తుషార్ దేశ్‌పాండే రెండు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో రాజస్థాన్ ఓవర్లన్నీ ఆడి 209/7 స్కోరు మాత్రమే చేసింది. ధ్రువ్ జురెల్ (53), యశస్వి జైస్వాల్ (50) హాఫ్ సెంచరీలు వృథా అయ్యాయి. జెన్సన్, ఒమర్జాయ్ చెరో రెండు వికెట్లు దక్కించుకొన్నారు. హర్‌ప్రీత్ బ్రార్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.




**ఆరంభం అదిరినా..:** రాయల్స్ ఓపెనర్లు జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ (40) తొలి వికెట్‌కు 29 బంతుల్లోనే 79 పరుగులతో ఛేదనను ధాటిగా ఆరంభించారు. అయితే, ఐదో ఓవర్‌లో హర్‌ప్రీత్ బౌలింగ్‌కు దిగడంతో సీన్ మారింది. వైభవ్‌ను అవుట్ చేసిన హర్‌ప్రీత్ బ్రేక్‌ను అందించాడు. ఆ తర్వాత 9వ ఓవర్‌లో జైస్వాల్‌ను పెవిలియన్ చేర్చిన బ్రార్.. రాజస్థాన్ జోరుకు కళ్లెం వేశాడు. శాంసన్ (20)ను ఒమర్జాయ్ అవుట్ చేయగా.. పరాగ్ (13)ను కూడా హర్‌ప్రీత్ బౌల్డ్ చేయడంతో 14 ఓవర్లకు రాజస్థాన్ 146/4తో నిలిచింది. డెత్ ఓవర్లలో జురెల్ ధాటిగా ఆడుతూ ఆశలు రేపాడు. కానీ, ఆఖరి ఓవర్‌లో విజయానికి 22 రన్స్ కావల్సి ఉండగా.. జురెల్, హసరంగ (0)ను అవుట్ చేసిన జెన్సన్ జట్టును గెలిపించాడు.

**తడబడి నిలబడి..:** టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న పంజాబ్ పవర్‌ప్లేలోనే 34/3తో కష్టాల్లో పడినా.. వధేరా, శశాంక్ సింగ్ అర్ధ శతకాలతో ఆదుకోవడంతో భారీ స్కోరు చేసింది. ఓపెనర్లు ఆర్య (9), ప్రభ్‌సిమ్రన్ (21)ను దేశ్‌పాండే వెనక్కి పంపగా.. ఓవెన్ (0)ను మఫాక డకౌట్ చేశాడు. ఈ దశలో వధేరాకు జతకలసిన కెప్టెన్ అయ్యర్ నాలుగో వికెట్‌కు 67 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశాడు. అయితే, అయ్యర్‌ను పరాగ్ క్యాచవుట్ చేయడంతో క్రీజులోకి వచ్చిన శశాంక్ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. కానీ, అర్ధ శతకం పూర్తి చేసుకొన్న వధేరాను ఆకాశ్ అవుట్ చేయడంతో.. ఐదో వికెట్‌కు 58 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక, డెత్ ఓవర్లలో శశాంక్, అజ్మతుల్లా ఒమర్జాయ్ (21 నాటౌట్) 24 బంతుల్లో 60 పరుగులు జోడించడంతో.. పంజాబ్ స్కోరు 220 మార్క్‌కు చేరువైంది.

### స్కోరుబోర్డు

**పంజాబ్:** ప్రియాన్ష్ (సి) హెట్‌మయర్ (బి) దేశ్‌పాండే 9, ప్రభ్‌సిమ్రన్ (సి) శాంసన్ (బి) దేశ్‌పాండే 21, ఓవెన్ (సి) శాంసన్ (బి) మఫాక 0, వధేరా (సి)హెట్‌మయర్ (బి) మధ్వాల్ 70, శ్రేయాస్ (సి) జైస్వాల్ (బి) పరాగ్ 30, శశాంక్ (నాటౌట్) 59, అజ్మతుల్లా ఒమర్జాయ్ (నాటౌట్) 21; **ఎక్స్‌ట్రాలు: 9; మొత్తం: 20 ఓవర్లలో 219/5; వికెట్ల పతనం:** 1-19, 2-34, 3-34, 4-101, 5-159; **బౌలింగ్:** ఫజల్ ఫరూకీ 3-0-39-0, దేశ్‌పాండే 4-0-37-2, మఫాక 3-0-32-1, పరాగ్ 3-0-26-1, హసరంగ 3-0-33-0, మధ్వాల్ 4-0-48-1.

**రాజస్థాన్:** జైస్వాల్ (సి) ఓవెన్ (బి) బ్రార్ 50, వైభవ్ (సి) బ్రాట్‌లెట్ (బి) బ్రార్ 40, శాంసన్ (సి) జెన్సన్ (బి) ఒమర్జాయ్ 20, పరాగ్ (బి) బ్రార్ 13, జురెల్ (సి) ఓవెన్ (బి) జెన్సన్ 53, హెట్‌మయర్ (సి) బ్రాట్‌లెట్ (బి) ఒమర్జాయ్ 11, దూబె (నాటౌట్) 7, హసరంగ (సి) ప్రభ్‌సిమ్రన్ (బి) జెన్సన్ 0, మఫాక (నాటౌట్) 8; **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 20 ఓవర్లలో 209/7; వికెట్ల పతనం:** 1-76, 2-109, 3-114, 4-144, 5-181, 6-200, 7-200; **బౌలింగ్:** అర్షదీప్ 4-0-60-0, జెన్సన్ 3-0-41-2, బ్రాట్‌లెట్ 1-0-12-0, హర్‌ప్రీత్ బ్రార్ 4-0-22-3, చాహల్ 4-0-30-0, ఒమర్జాయ్ 4-0-44-2.




### రన్నరప్ యుకీ జోడీ

**న్యూఢిల్లీ:** భారత స్టార్ యుకీ భాంబ్రీ.. ఫ్రాన్స్‌లో జరిగిన బార్డాక్స్ ఏటీపీ చాలెంజర్ ఈవెంట్‌లో డబుల్స్ రన్నరప్‌గా నిలిచాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో యుకీ/రాబర్ట్ గాలోవే (అమెరికా) జోడీ 6-7(1), 6-7(2)తో ఫ్రాన్సిస్కో (పోర్చుగల్)/లుకాస్ (ఆస్ట్రియా) జంట చేతిలో ఓడింది.

### పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | ఫ.తే | పా | నె.ర‌రే |
|---|---|---|---|---|---|---|
| గుజరాత్ | 12 | 9 | 3 | 0 | 18 | 0.795 |
| బెంగళూరు | 12 | 8 | 3 | 1 | 17 | 0.482 |
| పంజాబ్ | 12 | 8 | 3 | 1 | 17 | 0.389 |
| ముంబై | 12 | 7 | 5 | 0 | 14 | 1.156 |
| ఢిల్లీ | 12 | 6 | 5 | 1 | 13 | 0.260 |
| కోల్‌కతా | 13 | 5 | 6 | 2 | 12 | 0.193 |
| లఖ్‌నవూ | 11 | 5 | 6 | 0 | 10 | -0.469 |
| హైదరాబాద్ | 11 | 3 | 7 | 1 | 7 | -1.192 |
| రాజస్థాన్ | 13 | 3 | 10 | 0 | 6 | -0.701 |
| చెన్నై | 12 | 3 | 9 | 0 | 6 | -0.992 |

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.ర‌రే: నెట్ రన్‌రేట్

### నేటి మ్యాచ్

వేదిక లఖ్‌నవూ

హైదరాబాద్ x లఖ్‌నవూ రా.7.30 నుంచి

## హెడ్‌కు కొవిడ్

**న్యూఢిల్లీ:** సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్ ట్రావిస్ హెడ్ కొవిడ్ బారిన పడ్డాడు. దీంతో అతను సోమవారం లఖ్‌నవూ జట్టుతో జరిగే మ్యాచ్‌కు అందుబాటులో ఉండడం లేదని సన్‌రైజర్స్ చీఫ్ కోచ్ వెటోరి ఆదివారం ప్రకటించాడు. అయితే.. హెడ్‌కు ఎప్పుడు, ఎక్కడ వైరస్ సోకిందన్న విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. పూర్తిగా కోలుకున్న తర్వాత హెడ్ జట్టుతో కలుస్తాడని తెలిపాడు.

## క్రికెటర్లకు పెయిడ్ ఫ్యాన్స్ ఉన్నారు!



**న్యూఢిల్లీ:** కొందరు క్రికెటర్లకు పెయిడ్ ఫ్యాన్స్ ఉన్నారని భారత జట్టు మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. అయితే ఆ క్రికెటర్లు ఎవరో అతడు వెల్లడించలేదు. ఓ క్రీడా చానెల్ చర్చలో హర్భజన్ మాట్లాడుతూ 'ఆడినంత కాలం ధోనీ ఐపీఎల్‌లో కొనసాగాలి. మహీ ఇంకా ఐపీఎల్ ఆడాలని అతడి ఫ్యాన్స్ బలంగా కోరుకుంటున్నారు. వారంతా ధోనీకి నిజమైన అభిమానులు. అయితే సోషల్ మీడియాలో కొందరు ఫ్యాన్స్ ఉంటారు. వారు మాత్రం డబ్బులు తీసుకొనే అభిమానులు. వారిని వదిలేయండి. వారిపై చర్చ సాగిస్తే దానికి అంతూ..దరీ ఉండదు' అని వ్యాఖ్యానించాడు. అదే చర్చలో పాల్గొన్న మరో భారత ఆటగాడు ఆకాశ్ చోప్రా కల్పించుకొని 'భజ్జీ భాయ్..మరీ అలా నిజాలు చెప్పకు' అని నవ్వుతూ అన్నాడు.

## తిరుమలేశుడి సేవలో గంభీర్

**తిరుమల (ఆంధ్రజ్యోతి):** భారత క్రికెట్ చీఫ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నాడు. వేకువజామున ఆలయంలో జరిగిన సుప్రభాతసేవలో కుటుంబ సమేతంగా పాల్గొన్నాడు. సుప్రభాత పఠనం అనంతరం గర్భాలయానికి చేరుకుని మూలవిరాట్టును దర్శించుకున్నారు.



## ఒక్కరు గెలిస్తే..ముగ్గురు ముందుకెళ్లారు

ఐపీఎల్‌లో ఆదివారం అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఒకే విజయంతో ఏకంగా మూడు జట్లు ప్లే ఆఫ్ స్థానాలను ఖరారు చేసుకున్నాయి. డబుల్ హెడర్‌లో భాగంగా రాత్రి జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ జట్టు ఢిల్లీని ఓడించి 18 పాయింట్లతో టాప్ లేపింది. అయితే అప్పటిదాకా ప్లేఆఫ్స్ బెర్తులు ఖరారు కాని బెంగళూరు, పంజాబ్ జట్లనూ గుజరాత్ తమతోపాటు ముందుకు తీసుకెళ్లింది. ఇప్పుడిక మిగిలిన ఏకైక బెర్తు కోసం ఢిల్లీ (13), ముంబై (14), లఖ్‌నవూ (10) జట్లు పోటీ పడనున్నాయి.

# ప్లేఆఫ్స్‌కు గుజరాత్

## బెంగళూరు, పంజాబ్ కూడా..

- సుదర్శన్ అజేయ శతకం
- రాణించిన గిల్
- పది వికెట్లతో ఢిల్లీ చిత్తు

రాహుల్ శతకం వృథా




**న్యూఢిల్లీ:** ఐపీఎల్ తాజా సీజన్‌లో అదిరే ఆటతో దూసుకెళుతున్న గుజరాత్ టైటాన్స్ ప్లేఆఫ్స్‌లో అడుగుపెట్టింది. 200 పరుగుల ఛేదనను ఓపెనర్లు సాయి సుదర్శన్ (61 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్సర్లతో 108 నాటౌట్), శుభ్‌మన్ గిల్ (53 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్సర్లతో 93 నాటౌట్) విధ్వంసకర ఆటతీరుతో పూర్తి చేశారు. దీంతో ఆదివారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో 10 వికెట్లతో టైటాన్స్ ఘనవిజయం అందుకుంది. అలాగే 18 పాయింట్లతో పట్టికలో టాప్‌నకు చేరింది. ఈ ఫలితంతో ఆర్‌సీబీ, పంజాబ్ (17 పాయింట్ల చొప్పున) జట్లు కూడా ప్లేఆఫ్స్‌లో చోటు దక్కించుకోవడం విశేషం. ముందుగా ఢిల్లీ 20 ఓవర్లలో 3 వికెట్లకు 199 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (65 బంతుల్లో 14 ఫోర్లు, 4 సిక్సర్లతో 112 నాటౌట్), పోరెల్ (19 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లతో 30), అక్షర్ (16 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 25), స్టబ్స్ (10 బంతుల్లో 2 సిక్సర్లతో 21 నాటౌట్) రాణించారు. ఛేదనలో గుజరాత్ 19 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 205 పరుగులు చేసి నెగ్గింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా సుదర్శన్ నిలిచాడు.




**ఇద్దరూ పోటాపోటీగా..:** 200 పరుగుల ఛేదనను గుజరాత్ మెరుపు ఆటతో ఆరంభించింది. ఓపెనర్లు గిల్, సుదర్శన్‌ల నిలకడ ఈసారీ కొనసాగింది. రెండో ఓవర్‌లోనే సాయి 6,4,4,4తో 20 పరుగులు రాబట్టాడు. దీంతో పవర్‌ప్లేలో జట్టు 59 పరుగులతో నిలిచింది. ఆ తర్వాత 11వ ఓవర్‌లోనే స్కోరు వందకి చేరింది. ఇక డెత్ ఓవర్లలో వీరి దూకుడు మరింత పెరగడంతో లక్ష్యం వేగంగా కరిగింది. 18వ ఓవర్‌లో సిక్సర్‌తో సాయి 56 బంతుల్లోనే శతకం పూర్తి చేశాడు. సమీకరణం 12 బంతుల్లో 6 రన్స్‌కు మారడంతో ఓవర్ ఉండగానే మ్యాచ్‌ను ముగించారు.

**అజేయ శతకంతో అదుర్స్:** టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ ఇన్నింగ్స్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగిన రాహుల్ కదం తొక్కాడు. చివరి వరకు క్రీజులో నిలిచి అజేయ శతకంతో అండగా నిలిచాడు. అయితే జట్టు ఆరంభం నత్తనడకన సాగినా మధ్య ఓవర్ల నుంచి వేగం పుంజుకుంది. రాహుల్‌కు పోరెల్, అక్షర్, స్టబ్స్ సహకారం అందించారు. ఓపెనర్ డుప్లెసి (5) నిరాశపర్చగా.. ఐదు ఓవర్లలో డీసీ 28/1 స్కోరు మాత్రమే. రాహుల్ మాత్రం రబాడ ఓవర్‌లో 6,4,6 బాదడంతో 17 రన్స్ సమకూరాయి. దీంతో పవర్‌ప్లేలో జట్టు 45 పరుగులతో పర్వాలేదనిపించింది. మరో ఎండ్‌లో పోరెల్ తొమ్మిదో ఓవర్‌లో 4,6తో ఆకట్టుకున్నాడు. కానీ పోరెల్‌ను స్పిన్నర్ సాయికిశోర్ అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు 90 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. రాహుల్ మాత్రం ధాటిని కొనసాగిస్తూ 14వ ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో స్కోరును పెంచే ప్రయత్నం చేశాడు. కెప్టెన్ అక్షర్ ఉన్న కాసేపు ఎదురుదాడికి దిగి మూడో వికెట్‌కు 45 పరుగులు జోడించాడు. 15-18 ఓవర్ల మధ్య రాహుల్ కేవలం ఆరు బంతులే ఎదుర్కోవడంతో చివర్లో వేగం తగ్గింది. అయితే 19వ ఓవర్‌లో తను 6,4తో శతకం పూర్తి చేసుకున్నాడు. ఇక ఆఖరి ఓవర్‌లో రాహుల్ 4,4 స్టబ్స్ 6తో 16 రన్స్ రాగా టైటాన్స్ ముందు 200 లక్ష్యాన్ని ఉంచింది.

**1** టీ20ల్లో వేగంగా (224 ఇన్నింగ్స్) 8 వేల రన్స్ పూర్తి చేసిన తొలి భారత క్రికెటర్‌గా రాహుల్. ఓవరాల్‌గా గేల్, బాబర్ తర్వాత నిలిచాడు.

### స్కోరుబోర్డు

**ఢిల్లీ:** కేఎల్ రాహుల్ (నాటౌట్) 112, డుప్లెసీ (సి) సిరాజ్ (బి) అర్షద్ 5, పోరెల్ (సి) బట్లర్ (బి) సాయి కిశోర్ 30, అక్షర్ (సి) సాయి కిశోర్ (బి) ప్రసిద్ధ్ 25, స్టబ్స్ (నాటౌట్) 21, **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 20 ఓవర్లలో 199/3; వికెట్ల పతనం:** 1-16, 2-106, 3-151; **బౌలింగ్:** సిరాజ్ 4-0-37-0, అర్షద్ ఖాన్ 2-0-7-1, రబాడ 2-0-34-0, ప్రసిద్ధ్ 4-0-40-1, రషీద్ 4-0-32-0, సాయి కిశోర్ 4-0-47-1.

**గుజరాత్:** సాయి సుదర్శన్ (నాటౌట్) 108, గిల్ (నాటౌట్) 93, **ఎక్స్‌ట్రాలు: 4; మొత్తం:** 19 ఓవర్లలో 205/0; **బౌలింగ్:** అక్షర్ 3-0-35-0, నటరాజన్ 3-0-49-0, ముస్తాఫిజుర్ 3-0-24-0, చమీర 2-0-22-0, విప్రజ్ 4-0-37-0, కుల్దీప్ 4-0-37-0.

## 'శాఫ్' చాంపియన్ భారత్

**యుపియా (అరుణాచల్‌ప్రదేశ్):** దక్షిణాసియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ (శాఫ్) అండర్-19 చాంపియన్‌షిప్‌లో ఆతిథ్య భారత్ విజేతగా నిలిచింది. ఆదివారం ఇక్కడ హోరాహోరీగా సాగిన ఫైనల్..పెనాల్టీ షూటౌట్‌లో మనోళ్లు 4-3తో బంగ్లాదేశ్‌ను ఓడించారు. నిర్ణీత సమయానికి ఇరుజట్లు 1-1 గోల్‌తో సమంగా నిలిచాయి. ఈ టోర్నీలో భారత్ విజేతగా నిలవడం ఇది రెండోసారి.

# బంగ్లా ఆంక్షలకు ప్రతి ఆంక్షలు

- చెల్లుకు చెల్లు చెప్పిన భారత్
- దేశీయ ఎంఎస్ఎంఈలకు ఊరట



న్యూఢిల్లీ: భారత-బంగ్లాదేశ్ మధ్య వైరం ముదురుతోంది. ఆ దేశం నుంచి దిగుమతయ్యే రెడీమేడ్ దుస్తులు, ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు, ప్లాస్టిక్ వస్తువుల దిగుమతులను భూమార్గం ద్వారా కాకుండా కోల్‌కతా లేదా ముంబై సమీపంలోని నవసేనా రేవుల ద్వారా మాత్రమే అనుమతిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. భారత నూలు, బియ్యం దిగుమతులతో పాటు అనేక వస్తువులపై బంగ్లాదేశ్ ఇటీవల ఇదే తరహా ఆంక్షలు విధించింది. ఎవరైనా భారత ఎగుమతిదారు భూమార్గం ద్వారా బంగ్లాదేశ్‌కు సరుకులు ఎగుమతి చేయాలంటే ప్రతి కిలోమీటరుకు టన్నుకు 1.8 టాకాల చొప్పున ప్రత్యేక ఫీజు విధించింది. దీంతో కేంద్ర ప్రభుత్వం బంగ్లా దిగుమతులపై ఈ ఆంక్షలు విధించింది. ఈ నిషేధం ప్రభావం మన దేశానికి బంగ్లాదేశ్ చేసే 42 శాతం (77 కోట్ల డాలర్లు) ఎగుమతులపై ఉంటుందని అంచనా.

### ఎంఎస్ఎంఈలకు ఊరట

ఈ నిషేధం ప్రభావం ఈశాన్య రాష్ట్రాలు, దేశంలో ఇతర ప్రాంతాల్లో రెడీమేడ్ దుస్తులు తయారు చేసే దేశీయ ఎంఎస్ఎంఈలకు మేలు చేస్తుందని భావిస్తున్నారు. నిజానికి బంగ్లాదేశ్ చౌకగా చైనా నుంచి వస్త్రాలు దిగుమతి చేసుకుని వాటిని దుస్తులుగా మార్చి మన దేశానికి జీరో డ్యూటీతో ఎగుమతి చేస్తోంది. దీనికి చెక్ పెట్టాలని దేశీయ పరిశ్రమ ముఖ్యంగా ఎంఎస్ఎంఈలు ఎప్పటి నుంచో ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. 'మేము ఎప్పటి నుంచో దీని గురించి అడుగుతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం దేశీయ పరిశ్రమకు ఎంతో మేలు చేస్తుంది. ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం' అని దుస్తుల ఎగుమతి ప్రోత్సాహక మండలి (ఏఈపీసీ) జాతీయ వైస్ చైర్మన్ ఏ శక్తివేల్ అన్నారు.

### బంగ్లాకే అధిక నష్టం

ఈ పరస్పర ఆంక్షలతో బంగ్లాదేశ్ అధికంగా నష్టపోతుందని భావిస్తున్నారు. ఇప్పటి వరకు ఆ దేశ ప్రధాన ఎగుమతులైన దుస్తులు, ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలను భూమార్గం ద్వారా కోల్‌కతా, లేదా ముంబైకి తరలించి విదేశాలకు ఎగుఎమతి చేసేది. దీంతో ఈ రేవులు బంగ్లాదేశ్ సరుకులతో నిండిపోయి తమ సరుకులు నిల్వ చేసేందుకు కనీసం చోటు కూడా దొరకడం లేదని భారత ఎగుమతిదారులు ఎప్పటి నుంచో ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నారు. గత ఏడాది బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా నేతృత్వంలోని ప్రభుత్వాన్ని పడగొట్టి మహ్మద్ యూనస్ నాయకత్వంలోని ప్రభుత్వం అధికారం చేపట్టాక అక్కడ భారత వ్యతిరేకత ప్రబలిపోయింది. దీంతో కేంద్ర ప్రభుత్వం బంగ్లాదేశ్‌పై ఆర్థిక యుద్ధాన్ని తీవ్రం చేస్తోంది.

# బిజినెస్

## స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు 2 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: గత మూడేళ్లలో మన దేశ ఎగుమతుల స్వరూపం మారిపోయింది. స్మార్ట్‌ఫోన్ల ఎగుమతులు పెట్రో ఉత్పత్తులు, వజ్రాల ఎగుమతులను మించిపోయాయి. 2023-24లో 1,557 కోట్ల డాలర్లుగా ఉన్న వీటి ఎగుమతి 2024-25 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో 55 శాతం వృద్ధి రేటుతో 2,414 కోట్ల డాలర్లకు (సుమారు రూ.2.05 లక్షల కోట్లు) చేరాయి. గత ఆర్థిక సంవత్సరం మన దేశం నుంచి అమెరికా, నెదర్లాండ్స్, ఇటలీ, జపాన్, చెక్ రిపబ్లిక్ దేశాలు అత్యధికంగా స్మార్ట్‌ఫోన్లు దిగుమతి చేసుకున్నాయి. గత మూడేళ్లలో మన దేశం నుంచి స్మార్ట్‌ఫోన్లు అమెరికాకు ఐదు రెట్లు, జపాన్‌కు నాలుగు రెట్లు పెరిగాయని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ తెలిపింది.

- ప్రభుదాస్ లీలాధర్ గ్రూప్ సంస్థ పీఎల్ క్యాపిటల్.. తొలి ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (ఏఐఎఫ్)ను ప్రారంభించింది. పీఎల్ క్యాపిటల్ పెర్‌ఫార్మింగ్ క్రెడిట్ ఫండ్ పేరుతో దీన్ని తీసుకువచ్చింది. కేటగిరీ -2 ఏఐఎఫ్ అయిన ఈ ఫండ్ రూ.500 కోట్ల కార్పస్‌ను లక్ష్యంగా పెట్టుకుంది. మరో రూ.500 కోట్లు అదనంగా గ్రీన్‌షూ ఆప్షన్ ద్వారా సమీకరించనుంది. వృద్ధి ఆధారిత వ్యాపారాల్లో సెక్యూర్డ్ డెట్ ఇన్వెస్ట్‌మెంట్స్ ద్వారా పెట్టుబడులకు రక్షణ కల్పించటంతో పాటు రిస్క్‌ను సర్దుబాటు చేసుకుంటూ రిటర్నులు అందించేలా ఈ ఫండ్‌ను రూపొందించింది.
- ఇసుజు మోటార్స్ ఇండియా ఆంధ్రప్రదేశ్‌లో తన కార్యకలాపాలను మరింత పటిష్ఠం చేస్తోంది. ఇందులో భాగంగా తిరుపతిలో కొత్త షోరూమ్‌ను ప్రారంభించింది. రాష్ట్రంలో సంస్థకిది 35వ షోరూమ్.

## త్వరలో హారియర్ ఈవీ

టాటా మోటార్స్

న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ వాహన (ఈవీ) రంగంలో తన స్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకోవాలని టాటా మోటార్స్ భావిస్తోంది. ఇందులో భాగంగా హారియర్ ఈవీని ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే మార్కెట్లోకి విడుదల చేయనున్నట్లు కంపెనీ ప్రకటించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27) కంపెనీకి చెందిన సియెర్రా ఈవీ మార్కెట్లోకి రానుంది. వీటితో పాటు ఇప్పటికే మార్కెట్ చేస్తున్న ఈవీలకు మరిన్ని ఫీచర్లు జోడించబోతోంది. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో టాటా మోటార్స్ 65,000 ఈవీలను విక్రయించింది. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 10 శాతం తక్కువ. దీంతో కొత్త మోడల్స్, ఉన్న మోడల్స్‌కు మరిన్ని ఫీచర్లు జోడించడం ద్వారా ఈవీ మార్కెట్లో దూసుకుపోవాలని కంపెనీ భావిస్తోంది.

**టాటా ఈవీ మెగాచార్జర్స్:** ఇంటర్‌సిటీ, అర్బన్ ఈవీ మొబిలిటీ కోసం టాటా ఈవీ వ్యూహాత్మకంగా హైస్పీడ్ చార్జర్ల సదుపాయాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. చార్జర్‌జోన్, స్టాటిక్‌తో కలిసి 10 టాటా ఈవీ మెగాచార్జర్స్‌ను ప్రారంభించింది. వ్యూహాత్మకంగా కొన్ని నగరాలు, హైవేలపై వీటిని ఏర్పాటు చేసినట్లు తెలిపింది.

## స్థిరంగా సిమెంట్ డిమాండ్

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)పై సిమెంట్ పరిశ్రమ చాలా ఆశలు పెట్టుకుంది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం డిమాండ్ 7 నుంచి 7.5 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని 'ఇక్రా' రేటింగ్ సంస్థ అంచనా. 2024-25 మార్చి త్రైమాసికంలో కంపెనీల సిమెంట్ అమ్మకాల పరిమాణం 3.5 నుంచి 10 శాతం వరకు పెరిగింది. మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, గ్రామీణ డిమాండ్ పుంజుకోవడం ఇందుకు ప్రధానంగా కలిసి వస్తోంది.

**ధరలపై నిరాశే:** గత ఆర్థిక సంవత్సరం ప్రముఖ కంపెనీల బస్తా (50 కిలోలు) సిమెంట్ ధర ఒక దశలో రూ.300కు పడిపోయింది. మార్చి నెలాఖరులో మాత్రమే ఇది రూ.350కి చేరింది. 2024-25లో కంపెనీలకు బస్తాకు సగటున రూ.340కి మించి రాలేదు. 2023-24తో పోలిస్తే ఇది 7 శాతం తక్కువ

## 25,400పైన బుల్లిష్

(మే 19-23 తేదీల మధ్య వారానికి)

ఆస్ట్రో ట్రెండ్


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 23,379-25,116 పాయింట్ల మధ్యన కదలాడి 339 పాయింట్ల నష్టంతో 25,020 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,400 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

**బ్రేకౌట్ స్థాయి:** 25,400 **బ్రేక్‌డౌన్ స్థాయి** : 24,600
**నిరోధ స్థాయిలు:** 25,225, 25,325, 25,425 (25,125 పైన బుల్లిష్)
**మద్దతు స్థాయిలు:** 24,800 24,700, 24,600 (24,900 దిగువన బేరిష్)

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

19వ తేదీ



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 525 | విజయవాడ | 550 |
| వరంగల్ | 527 | గోదావరి | 540 |
| చిత్తూరు | 613 | విశాఖపట్నం | 545 |
| | | డజను గుడ్లు రూ. 72 | |

### ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 125 | విజయవాడ | 124 |
| వరంగల్ | 125 | గుంటూరు | 127 |
| కరీంనగర్ | 125 | ఒంగోలు | 127 |
| మహబూబ్‌నగర్ | 125 | చిత్తూరు | 122 |
| కర్నూలు | 125 | నెల్లూరు | 127 |
| విశాఖపట్నం | 121 | అనంతపురం | 127 |
| గోదావరి | 124 | | |

## 25,000 ఎగువన నిలదొక్కుకుంటేనే..

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం ఆరంభంలో బుల్లిష్ ట్రెండ్‌తో ప్రారంభమై ఆ తర్వాత కరెక్షన్‌కు లోనైంది. అనంతరం కోలుకుని చివరకు 25,000 స్థాయిలకు స్వల్ప ఎగువన క్లోజైంది. వారం మొత్తానికి నిఫ్టీ 1,000 పాయింట్లకు పైగా లాభపడింది. నిఫ్టీ గత ఆరు వారాలుగా 22,000 పాయింట్ల నుంచి ర్యాలీని కనబరుస్తూ వచ్చింది. రికార్డు స్థాయిలో 12 శాతం మేర ర్యాలీని సాధించింది. అయినప్పటికీ నిఫ్టీ ఇంకా ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయిలైన 26,200 పాయింట్లకు దిగువనే ఉంది. మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్స్ కూడా గత వారం మంచి లాభాలను నమోదు చేశాయి. కాగా ఈ వారం మార్కెట్ పాజిటివ్‌గా ప్రారంభమైనా అప్రమత్త ధోరణిలో కొనసాగే వీలుంది. కీలకమైన 25,000 పాయింట్ల వద్ద మరోసారి పరీక్షను ఎదుర్కొనే వీలుంది. కొద్ది రోజుల పాటు ఇక్కడ నిలదొక్కుకుంటేనే అప్‌ట్రెండ్‌ను కొనసాగిస్తుందా లేదా అనేది తెలుస్తుంది.

**బుల్లిష్ స్థాయిలు:** ప్రస్తుత గరిష్ఠ స్థాయిలైన 25,000 వద్ద కన్సాలిడేషన్‌కు అవకాశం ఉంది. సానుకూల ట్రెండ్‌ను సూచిస్తే 25,200 వద్ద మైనర్ నిరోధ స్థాయిలుంటాయి. ఇది గత ఏడాది అక్టోబరు 15న ఏర్పడిన స్థాయి. పాజిటివ్ ట్రెండ్‌ను కొనసాగిస్తే తదుపరి నిరోధ స్థాయి 25,500.

**బేరిష్ స్థాయిలు:** ఏదేనీ బలహీనతను సూచిస్తే తదుపరి 25,000 దిగువన మద్దతు స్థాయిలుంటాయి. ప్రస్తుత అప్‌ట్రెండ్‌ను కొనసాగించాలంటే మాత్రం ఈ స్థాయిల వద్ద కచ్చితంగా నిలదొక్కుకోవాలి. తదుపరి మద్దతు స్థాయిలు 24,800, 24,500. అయితే ఈ మద్దతు స్థాయి కొంత దూరంగా ఉన్నందు వల్ల తక్షణ ముప్పు ఉండదు.

**బ్యాంక్ నిఫ్టీ:** వీక్లీ ప్రాతిపదికన ఈ సూచీ 3.2 శాతం లాభపడి 55,350 వద్ద క్లోజైంది. ఈ వారం అప్‌ట్రెండ్‌ను కనబరిస్తే తదుపరి నిరోధ స్థాయిలు 56,000 వద్ద ఉంటాయి. అప్‌ట్రెండ్ కోసం ఈ స్థాయిలకు ఎగువన నిలదొక్కుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుత మద్దతు స్థాయిలైన 55,500 వద్ద విఫలమైతే బలహీనతగా భావించి అప్రమత్తం కావాలి.

**పాటర్న్:** మార్కెట్ ప్రస్తుతం 20 డీఎంఏను అధిగమించి సానుకూల సంకేతాలు వెలువరించింది. ఈ వారం 25,000 వద్ద అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్ కన్నా పైన నిలదొక్కుకున్నప్పుడే మరింత సానుకూల ధోరణి ఏర్పడుతుంది. స్వల్పకాలిక ఓవర్‌బాట్ పొజిషన్‌లోకి మార్కెట్ ప్రవేశిస్తుండటంతో స్వల్పకాలిక ఇన్వెస్టర్లు గరిష్ఠ స్థాయిల వద్ద అప్రమత్తంగా ఉండాలి.

**టైమ్:** ఈ సూచీ ప్రకారం బుధవారం మైనర్ రివర్సల్ ఉంది.

| సోమ వారం స్థాయిలు | |
|---|---|
| నిరోధం | 25,140, 25,200 |
| మద్దతు | 25,000, 24,920 |

## పడితే కొనుగోలు చేసే వ్యూహం బెటర్!

అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు, సరిహద్దుల్లో ఉద్రిక్తతలు తగ్గటంతో దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం రాణించే అవకాశం కనిపిస్తోంది. గత శుక్రవారం నిఫ్టీ 25,000 పైన ముగియటం పాజిటివ్ సెంటిమెంట్‌ను నింపుతోంది. ప్రస్తుతం రక్షణ, షిప్ బిల్డింగ్, రైల్వే, ఏవియేషన్, చమురు, గ్యాస్ సరఫరా, డైమండ్, జువెలరీ రంగాలకు చెందిన షేర్లు బలాన్ని ప్రదర్శిస్తున్నాయి. మీడియా, హాస్పిటాలిటీ, హెల్త్‌కేర్, ఐటీ రంగాల్లో అంతగా మూమెంటమ్ కనిపించటం లేదు. ఇన్వెస్టర్లు నాణ్యమైన షేర్లను బై ఆన్ డిప్స్ పద్ధతిలో కొనుగోలు వ్యూహాన్ని పాటించటం మంచిది.

### స్టాక్ రికమండేషన్స్

**టాటా టెక్నాలజీస్:** గత ఏడాది సెప్టెంబరు నుంచి డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ కౌంటర్‌లో ప్రస్తుతం అక్యుములేషన్ జరుగుతోంది. షార్ట్‌టర్మ్ మూమెంటమ్, వాల్యూమ్ క్రమంగా పెరుగుతున్నాయి. పైగా నెల రోజుల గరిష్ఠాన్ని బ్రేక్ చేశాయి. గత శుక్రవారం 4.3 శాతం లాభంతో రూ.750 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.740 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.810/900 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.710 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

**ఆర్‌వీఎన్ఎల్:** ఏడాది కాలంగా డౌన్‌ట్రెండ్‌లో సాగుతూ వస్తున్న ఈ షేరులో ప్రస్తుతం మూమెంటమ్ పెరిగింది. బేస్‌తో పాటు 20, 50 రోజుల సగటు ధరను అధిగమించింది. గత శుక్రవారం ఈ షేరు 8.9 శాతం లాభంతో రూ.409 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.400 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.425/440 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.385 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

**కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా:** సుదీర్ఘకాలంగా పతనమవుతూ వస్తున్న ఈ కౌంటర్‌లో ప్రస్తుతం మంచి బేస్ ఏర్పడింది. గత శుక్రవారం 5.8 శాతం లాభంతో రూ.730 వద్ద క్లోజయి గత నెల గరిష్ఠ స్థాయిని అధిగమించింది. రిలేటివ్ స్ట్రెంత్ కూడా పెరుగుతోంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.700 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.810 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.775 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.


**మోతీలాల్ ఓస్వాల్:** ప్రస్తుతం ఈ కౌంటర్‌లో మూమెంటమ్, రిలేటివ్ స్ట్రెంత్ పెరుగుతున్నాయి. జనవరి నుంచి కొనసాగిన పతనం ముగిసింది. అక్యుములేషన్ కొనసాగుతోంది. పైగా నెల రోజుల గరిష్ఠాన్ని అధిగమించింది. గత శుక్రవారం 3.8 శాతం లాభంతో రూ.789 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.780 శ్రేణిలో ఎంటరై రూ.850/890 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.750 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

**సీజీ పవర్:** ప్రస్తుతం ఈ షేరు అక్యుములేషన్ ముగింపు దశలో ఉంది. షార్ట్, మిడ్ టర్మ్‌లో మూమెంటమ్ ప్రదర్శిస్తున్నాయి. 20, 50 రోజుల మూవింగ్ యావరేజెస్‌ను అధిగమించింది. గత శుక్రవారం 2.7 శాతం లాభంతో రూ.696 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.690 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.770/800 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.670 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com



నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.



జీవితంలో ఎవరికీ దక్కని విధంగా.. ఒకప్పుడు హైదరాబాద్.. ఇప్పుడు తెలుగు జాతి కోసం అమరావతిని టాప్ సిటీగా తీర్చిదిద్దే అవకాశం నాకే దక్కింది. దేశంలో టాప్ సిటీలుగా హైదరాబాద్, అమరావతి నంబర్ వన్, నంబర్ టూ స్థానాల్లో ఉంటాయని భావిస్తున్నా.

- చంద్రబాబు

# వ్యక్తిత్వ హననం బాధాకరం

» సోషల్ మీడియాను కట్టడి చేయాలి: సీఎం

» ఎన్ని జన్మలెత్తినా తెలుగువాడిగానే పుట్టాలని ఉంది: చంద్రబాబు

హైదరాబాద్, మే 18(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననం, దుర్మార్గమైన ఆలోచనలు చేసినప్పుడు వాటిని ఎలా కట్టడి చేయాలన్నదానిపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. సాంకేతిక పురోగతి మంచిదేనని.. కానీ దానిని కొందరు చెడుకు ఉపయోగిస్తున్నారని ఆక్షేపించారు. సోషల్‌మీడియా వేదికగా దుష్ప్రచారాలు, వ్యక్తిత్వహననానికి పాల్పడడం బాధాకరమని.. ఇంట్లో ఉండే ఆడబిడ్డలకూ ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఓ వెబ్‌సైట్ రజతోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సరైన మీడియాను ఏవిధంగా ప్రోత్సహించాలో ప్రభుత్వాలు దృష్టిపెట్టాలని సూచించారు. తాను సీఎంగా ఉన్నపుడు హైటెక్ సిటీ కట్టించి.. తెలుగువారికి ఐటీ రంగాన్ని చేరువ చేశామన్నారు. దానివల్లే ఆ రంగంలో తెలుగువారు వివిధ దేశాల్లో తమ ప్రతిభ చాటుతున్నారని తెలిపారు. 'ప్రస్తుతం ఆఫీసులకు వెళ్లి కష్టపడే పనిలేకుండా వర్క్ ఫ్రమ్ హోం విధానంలో పనిచేసి.. సంపాదించే అవకాశాలొచ్చాయి. భవిష్యత్‌లో ఇంకా మార్పులొస్తాయి. క్వాంటమ్ వ్యాలీ, ఏఐ వంటి నైపుణ్యాంశాల్లో తెలుగువారు అగ్రస్థానంలోఉండాలి. మనం పనిచేస్తే.. ప్రజలు గుర్తుంచుకోరని అనుకుంటాం.. నేను కష్టంలో ఉన్నప్పుడు, జైల్లో ఉన్నప్పుడు నాకోసం ప్రజలు స్పందించడాన్ని జీవితాంతం మరచిపోను.. ఎన్ని జన్మలెత్తినా తెలుగువాడిగానే పుట్టాలని.. ఈ జాతికి సేవ చేయాలని భావిస్తున్నా' అని తెలిపారు. త్రిదండి చిన జీయర్ స్వామి, మాజీ సీజేఐ జస్టిస్ ఎన్‌వీ రమణ, ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, తెలంగాణ వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ మురళీ మోహన్, నటుడు, దర్శకుడు ఆర్.నారాయణ మూర్తి, తనికెళ్ల భరణి తదితరులు పాల్గొన్నారు.



కడప శివారులో జరిగిన సమన్వయ భేటీలో మంత్రులు, టీడీపీ నేతలు

## మహానాడు చివరి రోజున..
# 5 లక్షల మందితో భారీ సభ!

» 50 నియోజకవర్గాల నుంచి జనసమీకరణ

» కడప శివారులో టీడీపీ నేతల సమన్వయ సమావేశం

కడప, మే 18(ఆంధ్రజ్యోతి): కడప గడపలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించే మహానాడును భారీ స్థాయిలో విజయవంతం చేయాలని టీడీపీ నేతలు నిర్ణయించారు. చివరి రోజున 5 లక్షల మందితో కనీవినీ ఎరుగని రీతిలో బహిరంగ సభ నిర్వహించాలని.. చరిత్రలో నిలిచిపోయేలా చేయాలని సంకల్పించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన ఆదివారం సాయంత్రం కడప నగర శివారులోని మహానాడు నిర్వహించే వేదిక వద్ద సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. మంత్రులు అనిత, పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, ఎం.రాంప్రసాద్‌రెడ్డి, సవిత, బీసీ జనార్దనరెడ్డి, ఎమ్మెల్యేలు కాల్వ శ్రీనివాసులు, పుత్తా చైతన్యరెడ్డి, ఆర్.మాధవి, వరదరాజులరెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, అమర్‌నాథరెడ్డి, నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు రాంగోపాలరెడ్డి, బీద రవిచంద్ర, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, పొలిట్‌బ్యూరో సభ్యుడు, టీడీపీ కడప జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి దేవినేని ఉమ, ప్రభాకర్‌చౌదరి తదితరులు హాజరయ్యారు. ముందుగా పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో చనిపోయిన వారి స్మారకార్థం 2నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం మహానాడు నిర్వహణపై చర్చించారు. తరలివచ్చే ప్రతినిధులకు వసతి ఏర్పాట్లు, బహిరంగ సభకు జనసమీకరణపై ప్రధానంగా చర్చ జరిగింది. కడప సమీప సీమ జిల్లాలతో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని 50 నియోజకవర్గాల నుంచి ప్రజలను సమీకరించాలని నిర్ణయించారు. ఉమ్మడి కడప జిల్లా నుంచి 2.10 లక్షల మందిని.. మిగతావాటిలో ఒక్కో నియోజకవర్గం నుంచి 5-10 వేల మందిని తరలించాలని నిశ్చయించారు. నియోజకవర్గాలవారీగా ఇన్‌చార్జులను కూడా నియమించారు.

**ఇంతకుముందు లేదు.. ఇక ముందూ జరగదు!**

మహానాడు నిర్వహణలో టీడీపీకి రికార్డు ఉందని, కడప మహానాడును 'ఇంతకుముందు ఎప్పుడూ జరుగలేదు.. ఇక ముందూ జరగదు' అన్న రీతిలో నిర్వహించనున్నట్లు పల్లా శ్రీనివాసరావు విలేకరులకు తెలిపారు. 'సమయం తక్కువ ఉన్నా సరే గడువులోపు ఏర్పాట్లు పూర్తి చేస్తాం. ఇంత అద్భుతమైన వేదిక దొరకలేదు. 125 ఎకరాల్లో సువిశాలమైన మైదానం. పార్కింగ్‌కు ఎలాంటి సమస్య ఉండదు. తొలి రెండ్రోజుల్లో ప్రతినిధుల సభ జరుగుతుంది. 23 వేల మందికి ఆహ్వానం పంపించాం. వీరందరికీ అవసరమైన వసతి సిద్ధం చేశాం. పార్టీ సిద్ధాంతాలు, భవిష్యత్‌లో చేయాల్సినవి, సీమలో జరిగిన అభివృద్ధిపై చర్చిస్తాం. మంత్రి లోకేశ్ రూపొందించిన 'మై టీడీపీ' యాప్‌ను ఆవిష్కరిస్తాం. మహానాడులో లోటుపాట్లు లేకుండా 13 కమిటీలు.. సమన్వయం, వేదిక నిర్వహణ, కో-ఆర్డినేషన్ క్యాంపు కమిటీ, రవాణా, పార్కింగ్, ఆహారం, వసతి, తొక్కిసలాట లేకుండా పర్యవేక్షణ కమిటీ, రక్తదానం, వలంటీర్, రిజిస్ట్రేషన్, పారిశుధ్యం, పుష్పాలంకరణ కమిటీలను ఏర్పాటు చేశాం' అని వివరించారు.



హైదరాబాద్‌లోని చార్మినార్ సమీపంలో అగ్ని ప్రమాదం జరిగిన గుల్జార్ హౌజ్ వద్ద గుమిగూడిన జనం, మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది



# మృత్యు జ్వాల

## చార్మినార్ గుల్జార్‌హౌజ్ వద్ద ఘోర అగ్నిప్రమాదం

» 17 మంది మృతి.. మృతుల్లో 8 మంది చిన్నారులు, ఐదుగురు మహిళలు, నలుగురు వృద్ధులు

హైదరాబాద్ సిటీ, మంగళ్‌హాట్, అఫ్జల్‌గంజ్, మే 18 (ఆంధ్రజ్యోతి): రాజధాని హైదరాబాద్ మహనగరంలో ఆదివారం ఉదయాన్నే ఘోర విషాదం చోటు చేసుకుంది. చార్మినార్ సమీపంలోని గుల్జార్ హౌజ్ వద్ద ఓ భవనం మొదటి అంతస్తులో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 17 మంది దుర్మరణం చెందారు. మృతుల్లో ఎనిమిది మంది చిన్నారులు, ఐదుగురు మహిళలు ఉన్నారు. 60 ఏళ్లు దాటిన వారు నలుగురు ఉన్నారు. ఆ పిల్లలను, వయోధికులను వదిలి వెళ్లలేక.. వారిని కాపాడే ప్రయత్నంలో మిగతా ఐదుగురూ చనిపోయారు. అంతా నిద్రలో ఉండగానే ప్రమాదం జరగడం.. ఉన్న పళంగా మంటలు, పొగ కమ్ముకోవడంతో వారు బయటకు వెళ్లలేకపోయారని అగ్ని మాపక శాఖ వర్గాలు చెబుతున్నాయి. చార్మినార్ గుల్జార్ హౌజ్ ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రహ్లాద్‌రాయ్ మోదీ (73) కొంతకాలంగా అక్కడ నగల దుకాణాన్ని నడుపుతున్నారు. ఆయన భార్య మున్నీ (73). ఆ దంపతులకు నలుగురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రహ్లాద్‌రాయ్ తమ్ముడు రాజేందర్ (67), ఆయన భార్య సుమిత్ర మోదీ (65). అన్నదమ్ములిద్దరూ ఒకే భవనంలో (జీ+2) నివాసం ఉంటున్నారు. ఆ భవనం కింది భాగంలో వారికి ఒక బంగారం దుకాణం ఉంది. వేసవి సెలవుల సందర్భంగా.. ప్రహ్లాద్‌రాయ్ కుమారుడైన పంకజ్ (36), అతడి భార్య వర్ష (32), వారి ముగ్గురు పిల్లలు అనన్య (11), ఇదిక (8), ఇరాజ్ (2)తో ఆ ఇంటికి వచ్చారు. అలాగే, ప్రహ్లాద్ కుమార్తె శీతల్ (35) తన ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడితో, ప్రహ్లాద్ మరో కుమార్తె రజని తన కుమారుడితో, ఇంకో కుమార్తె సంతోషి.. పుట్టింటికి వచ్చారు. రాజేందర్ మోదీ పిల్లల్లో కూడా కొందరు ఆ ఇంటికి వచ్చారు. అంతా కలిసి శనివారం రాత్రి సరదాగా గడిపారు. రాత్రి భోజనం చేసి ఆలస్యంగా పడుకున్నారు. తెల్లవారుజామున 6.16 గంటల సమయంలో గ్రౌండ్‌ఫ్లోర్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. మంటలు చుట్టుముట్టి, పొగ కమ్ముకోవడంతో.. లోపలున్నవారంతా తమను కాపాడాలంటూ హాహాకారాలు చేశారు. అది గమనించిన స్థానిక యువకులు.. వెంటనే స్పందించి లోపలున్నవారిని బయటకు తేవడానికి ప్రయత్నించారు. కానీ.. పొగ ఎక్కువగా ఉండడంతో వారికి శ్వాస తీసుకోవడమే కష్టమైంది. దీంతో పక్క భవనానికి ఉన్న షట్టర్ పగలగొట్టి లోపలికి వెళ్లి సహాయ చర్యల్లో పాల్గొన్నారు. మరోవైపు.. ప్రమాద సమాచారం తెల్సుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు ఫైరింజన్లతో అక్కడికి చేరుకొని సహాయ చర్యలు ప్రారంభించారు.

**ఒకటే మార్గం..**

భవనంలోకి వెళ్లేందుకు ఒకటే మెట్ల మార్గం ఉండడం.. అక్కడే అగ్ని ప్రమాదం జరిగి మంటలు, పొగ వ్యాపించడంతో సహాయక చర్యలు ముందుకు సాగలేదు. పై అంతస్తుకు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు లేకపోవడంతో.. అగ్నిమాపకశాఖ అధికారులు పక్క భవనం గోడలకు రంధ్రాలు చేసి ఆ భవనంలోకి వెళ్లారు. మంటలు, పొగలో చిక్కుకున్న వారిని కిందకు తీసుకువచ్చారు. ఒక గదిలో ఒక మహిళ.. ఐదుగురు చిన్నారులను పట్టుకుని ఉందని, కానీ వారంతా అప్పటికే స్పృహతప్పి ఉన్నారని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. బయటకు తీసుకొచ్చాక వారందరిని డీఆర్‌డీఏ, మలక్‌పేట యశోద, ఉస్మానియా ఆస్పత్రులకు తరలించారు. కానీ.. వారిలో చాలామంది ఆస్పత్రులకు తరలించే లోపే తుది శ్వాస విడిచారు. కొందరు ఆస్పత్రికి వెళ్లాక చనిపోయారు. వారంతా పొగ ఊపిరితిత్తుల్లోకి వెళ్లిపోయి, ఊపిరాడక మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మంటలు ఆర్పడానికి 11 అగ్నిమాపక శకటాలను వినియోగించారు. మొత్తం 87 మంది అధికారులు, సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ప్రమాదం చిన్నదే అయినప్పటికీ.. లోపలికి, బయటకు తిరగడానికి ఒకే మార్గం ఉండడం, ప్రమాద సమయంలో లోపల 24 మంది ఉండడం వల్లనే ఇంతమంది చనిపోయినట్లు అధికారులు తెలిపారు. గదిలోకి వెళ్లి తలుపులు మూసేసుకుంటే ప్రాణాలు కాపాడుకోవచ్చని భావించడం వల్లే వారు చనిపోయారని.. అలా కాకుండా వారంతా ఇంట్లోంచి ఎలాగోలా భవనం పైభాగానికి వెళ్లి ఉంటే ఇంతమంది ప్రాణాలు పోయేవి కావని అధికారులు ఆవేదన వెలిబుచ్చారు.

**ఘటనాస్థలికి మంత్రి పొన్నం..**

ప్రమాదం గురించి తెలియగానే.. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతుల బంధువులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక శకటాలు, అంబులెన్సులు రాలేదని.. వచ్చిన ఫైరింజన్‌లో సరిపడా నీళ్లు లేకపోవడంతో వెనక్కి వెళ్లిపోయిందని.. అంబులెన్సులో ఆక్సిజన్ లేదని, అందుకే ఇంతమంది చిన్నారుల ప్రాణాలు కోల్పోయారంటూ వారిని చుట్టుముట్టి ఆందోళనకు దిగారు. ఘటనాస్థలిని పరిశీలించిన ఫైర్ సేఫ్టీ డీజీ నాగిరెడ్డి ప్రమాదానికి కారణం షార్ట్ సర్క్యూటేనని ప్రాథమికంగా నిర్ధారించారు.

**మృతిచెందినవారు:** ప్రహ్లాద్ రాయ్ మోదీ (70), మున్నీబాయ్ మోదీ (70), రాజేందర్ గుప్తా (67), సుమిత్ర (60), రజనీ అగర్వాల్ (47), శీతల్ జైన్ (35), ఆరుషి జైన్, రిషాప్ జైన్, పంకజ్ మోదీ (35), వర్ష (35), అనన్య(11), ఇదిక (8), ఇరాజ్ (2), ప్రాన్షి (6), ప్రథమ్ (14), అభిషేక్ (31), అర్షలి (7).

**ఘటనపై బాబు, పవన్ తీవ్ర దిగ్భ్రాంతి**

అగ్ని ప్రమాదంపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'ప్రమాదంలో మరణించినవారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాం' అని పేర్కొన్నారు.

# ముంబై తారలతో బంధమేంటో!

» నాడు మోనికా బేడీ వివాదంలో కృష్ణమోహన్ రెడ్డి

» జెత్వానీ కేసులో పీఎస్ఆర్

» ఇప్పుడు ఇద్దరూ బెజవాడ జైల్లో రిమాండ్ ఖైదీలు



మోనికా బేడీ



కృష్ణమోహన్ రెడ్డి



జెత్వానీ



పీఎస్ఆర్ ఆంజనేయులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ గ్యాంగ్ లీలలు అన్నీఇన్నీ కావు! ఆర్థిక వ్యవహారాల్లోనే వారికి బంధాలు, బాంధవ్యాలు ఉన్నాయని అనుకుంటారు కానీ.. కాస్త లోతుల్లోకి వెళితే కొత్త కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. యాదృచ్ఛికమే అయినా.. జే బ్యాచ్‌లోని ఇద్దరు కీలక వ్యక్తుల 'ఘనత' ముంబై దాకా చేరింది. సుమారు పాతికేళ్ల క్రితం ఒకరు ఎస్పీగా, మరొకరు ఎమ్మార్వోగా కర్నూలులో పనిచేశారు. ఆ ఇద్దరూ ఇప్పుడు విజయవాడ జైలులో ఒకేబ్యారక్‌లో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. వారే.. జగన్‌కు కుడిఎడమ భుజాలుగా పనిచేసిన ఐపీఎస్ పీఎస్ఆర్ ఆంజనేయులు, మాజీ ఓఎస్డీ పెళ్లకూరు కృష్ణమోహన్‌రెడ్డి. వీరి గత 'చరిత్ర' ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే... 2001లో దేశాన్నే కుదిపేసిన నటి మోనికా బేడీ నకిలీ పాస్‌పోర్టు వ్యవహారంలో చాలామంది పేర్లు బయటికి వచ్చాయి. కానీ ఒక్క పేరు మాత్రం తెరమరుగైపోయింది. ఆయనే... కృష్ణమోహన్ రెడ్డి. ఆయన రెవెన్యూ అధికారి అని, జగన్ దగ్గర పనిచేశారనే తెలుసు. మోనికా బేడీ వ్యవహారానికి, ఆయనకూ లింకు ఉందని ఇప్పుడు బయటికి వచ్చింది. 2001లో ఆయన కర్నూలు ఎమ్మార్వోగా పనిచేశారు. అప్పట్లో మాఫియా డాన్ అబూ సలీం, మోనికా బేడీలు దొంగ పేర్లతో పాస్‌పోర్టు పొందడం వివాదంగా మారింది. అబూ సలీం, మోనికా బేడీ కర్నూలు వాసులుగా దొంగ పేర్లతో సర్టిఫికెట్ తీసుకుని పాస్‌పోర్టు పొందగలిగారు. మోనికా బేడీ.. సనా మాలిక్ కమల్ పేరుతో, అబూ సలీం.. రమిల్ కమల్ మాలిక్ పేరుతో స్థానికంగా నివాసం ఉంటున్నట్టు 2001 ఏప్రిల్ 9న అప్పటి కర్నూలు ఎమ్మార్వో హోదాలో కృష్ణమోహన్ రెడ్డి నివాస ధ్రువీకరణ పత్రం ఇచ్చారు. దీని ఆధారంగా వారు పాస్‌పోర్టు పొందారు. అప్పట్లో ఏమి జరిగిందో ఏమో కానీ ఫేక్ సర్టిఫికెట్ ఇచ్చిన కృష్ణమోహన్ రెడ్డి ప్రాసిక్యూషన్ సాక్షిగా మారిపోయారు. సరిగ్గా అదే సమయంలో కర్నూలు ఎస్పీగా పీఎస్ఆర్ పనిచేశారు. ఫేక్ ఎన్‌కౌంటర్లు చేశారంటూ ఆయనపై ఎన్‌హెచ్ఆర్‌సీలో కేసులు నమోదయ్యాయి. ఆయన కూడా ఎలాగోలా ఆ కేసుల నుంచి బయటపడ్డారు. అప్పట్లో వీరిద్దరి మధ్య సంబంధాలు ఎలా ఉన్నాయో తెలియదు కానీ.. ప్రస్తుతం వేర్వేరు కేసుల్లో ఇద్దరూ ఒకే జైలులో ఉన్నారు. అప్పట్లో నకిలీ పాస్‌పోర్టు వ్యవహారంలో బయటపడ్డ కృష్ణమోహన్ రెడ్డి ఇప్పుడు వేల కోట్ల లిక్కర్ కేసులో అరెస్టయి విజయవాడ జైలులో ఉన్నారు. ఇక అప్పట్లో ఎన్‌కౌంటర్ల కేసులో బయటపడిన పీఎస్ఆర్ ఆంజనేయులు ఇప్పుడు ముంబై నటి కాదంబరి జెత్వానీని అకారణంగా చిత్రహింసలకు గురి చేసిన కేసులో జైలు పాలయ్యారు. ఇలా.. ఇద్దరూ ముంబై నటీమణుల వ్యవహారాల్లో వివాదాస్పదులే. పోలీసు వర్గాల్లో ఇప్పుడు హాట్ టాపిక్ అయింది.

## సిట్ విచారణతో జగన్ గుండెల్లో గుబులు

» ఒక్కొక్కటిగా బయటికొస్తున్న వైసీపీ లిక్కర్ స్కామ్‌లు

» అక్రమార్కులు తప్పించుకునే పరిస్థితి లేదు

» భార్యను కేసుల్లో ఇరికించిన బియ్యం దొంగ పేర్ని

» గాలి మైనింగ్ బాగోతం బట్టబయలు: మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం టౌన్, మే 18(ఆంధ్రజ్యోతి): అనేక అవినీతి కేసుల్లో కూరుకుపోయిన జగన్మోహన్‌రెడ్డికి సిట్ విచారణతో గుండెల్లో గుబులు మొదలైందని, ఆయనను చట్టరీత్యా అరెస్టు చేయడంలో ఆశ్చర్యమేమీలేదని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆదివారం మచిలీపట్నంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ లిక్కర్ స్కామ్‌లు ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయన్నారు. ప్రభుత్వానికి ఆదాయం రాకుండా తమ సొంత ఖాతాలలోకి లిక్కర్ షాపుల ద్వారా వచ్చే ఆదాయాన్ని అక్రమంగా జమ చేసుకున్నారని, దోచుకున్న డబ్బును విదేశాలకు పంపారని ఆరోపించారు. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో భారీ లిక్కర్ స్కాం జరిగిందన్నారు. ప్రజల ఆరోగ్యాలతో ఆడుకున్నారని, ప్రజలు విషపూరిత లిక్కర్‌కు బలై ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. భారీ అవినీతి, అక్రమాలకు పాల్పడి.. కక్షసాధింపు చర్యలు చేపడుతున్నారని విమర్శించడం సరికాదన్నారు. ఎక్సైజ్, మైనింగ్ పాలసీలను కూటమి ప్రభుత్వం పక్కాగా నిర్వహించిందని, సిట్‌తో విచారణ నుంచి అక్రమార్కులు తప్పించుకునే పరిస్థితి లేదని చెప్పారు. ఓబులాపురం గనులు దోచుకున్న గాలి జనార్దనరెడ్డి బండారం బయటపడిందని, నాడు రాజశేఖరరెడ్డితో కుమ్మక్కై మైనింగ్ దోపిడీ చేసిన జనార్దనరెడ్డికి ఎట్టకేలకు శిక్ష పడిందన్నారు. దీనిపై ఆనాడు టీడీపీ పోరాడిందని, టీడీపీ నిబద్ధతకు ఇది నిదర్శనమని చెప్పారు. రేషన్ బియ్యాన్ని దోచుకుని భార్యను కేసుల్లో ఇరికించిన వారు అమాయకంగా మీడియా ముందు మాట్లాడటం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఐదేళ్ల మంత్రిగా ఉన్న పేర్ని నాని బందరులో కనీసం రోడ్లు కూడా వేయలేదన్నారు.

## వ్యక్తిని చితక బాదిన కేసులో...
# నందిగం సురేశ్ అరెస్టు

» ఆయన భార్య, అనుచరులపైనా కేసు



తుళ్లూరు, మే 18(ఆంధ్రజ్యోతి): బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను తుళ్లూరు పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ మురళీకృష్ణ ఆదివారం విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. ఉద్దండరాయునిపాలెం బొడ్డు రాయి సెంటర్ వద్ద శనివారం రాత్రి 8.30 గంటల సమయంలో గ్రామానికి చెందిన ఇసుకపల్లి కృష్ణ అలియాస్ రాజుకు నందిగం సురేశ్ కారు తగిలింది. ఏమిటని ప్రశ్నించిన రాజును... సురేశ్, అతని అనుచరులు 8మంది కలసి విపరీతంగా కొట్టారు. మాజీ ఎంపీ ఇంటికి తీసుకెళ్లి నందిగం భార్య, అనుచరులు కర్రలు, చెప్పులతో చితక బాదారు. తీవ్రంగా గాయపడిన బాధితుడిని ఆయన బంధువులు మంగళగిరి ఎయిమ్స్‌లో చేర్పించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నందిగం సురేశ్, అతని భార్య బేబి, అనుచరులు 8మంది మీద కేసు నమోదు చేసినట్టు డీఎస్పీ తెలిపారు. కాగా, నందిగం సురేశ్‌ను అరెస్టు చేయటంతో కొంతమంది అనుచరులు స్టేషన్ దగ్గరకు వచ్చారు. వారిని పోలీసులు అడ్డుకుని గేటు మూసేశారు. సురేశ్ భార్య బేబిని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. డ్రోన్‌లతో తమ ఇంటి వద్ద రెక్కీ నిర్వహించారని గతంలో ఫిర్యాదు చేస్తే ఇంతవరకు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. రాజు ఏం చేశాడో విచారించకుండా తన భర్తను అరెస్టు చేయటం ఏంటని స్టేషన్ వద్ద పోలీసులతో వాదనకు దిగారు.

# లిక్కర్ స్కామ్‌లో అసలు విలన్ ఎవరు?

(మొదటి పేజీ తరువాయి)

వీళ్ల పాత్రధారులుగా ముందుండి లిక్కర్ దందా నడిపారన్నది సుస్పష్టం. కానీ వాళ్ల నోరు విప్పడానికి ససేమిరా అంటున్నారు. తెరవెనుక ఏదో ఓ శక్తికి భయపడి నిజాలు మాట్లాడేందుకు జంకుతున్నారు. తమతో ఇన్ని అక్రమాలు చేయించింది ఎవరో పేరు చెబితే తమకు అదే చివరి రోజు అవుతుందేమోనన్న భయం వారిని వెంటాడుతోంది. దీంతో ఈ కేసులో అసలు లబ్ధిదారు ఎవరు? లిక్కర్ సొమ్మును తెగమింగిన గజదొంగ ఎవరో తెలిసేదెట్లా? అన్న సంశయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో కేసు విచారణకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించాలని సిట్ భావిస్తోంది. ఇప్పటిదాకా అరెస్ట్ అయిన వారిని దశలవారీగా కస్టడీలోకి తీసుకొని కీలక సమాచారం రాబట్టాలనుకుంటోంది. లిక్కర్ సిండికేట్ నుంచి వసూలు చేసిన ముడుపులను ఎటు మళ్లించారు? ఎక్కడ పెట్టుబడులు పెట్టారు? గోల్డ్‌బాండ్స్‌లో పెట్టిన పెట్టుబడులు ఏమయ్యాయి? వంటి వివరాలను తెలుసుకోనున్నట్టు సమాచారం. అలాగే దుబాయి, బెంగళూరు, న్యూఢిల్లీ, గుర్‌గావ్, హైదరాబాద్, విశాఖ, తదితర ప్రాంతాల్లో రియల్ పెట్టుబడుల గురించి ఆరా తీయనున్నారని తెలిసింది. ఇందుకోసం రాజ్ కసిరెడ్డి, ధనుంజయ్ రెడ్డిల ఆర్థిక లావాదేవీలన్నింటిని దర్యాప్తు అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంకా పలు కొత్త పేర్లు తెరమీదకు వస్తున్నట్లు తెలిసింది.

**'ఢిల్లీ'ని మించిన స్కామ్**

ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో మధ్యవర్తులు, కాంట్రాక్టర్‌లు, కవిత, ఏజెంట్లను విచారించిన మీదటే అప్పటి ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాను అరెస్ట్ చేశారు. ఆ తర్వాత కూడా అనేక అరెస్ట్‌లు కొనసాగాయి. పక్కా ఆధారాలు లభించిన తర్వాతే అసలు సూత్రధారి కేజ్రీవాల్ అని నిర్ధారణ అయ్యాక అరెస్ట్ చేశారు. ఈ కేసుతో పోలిస్తే ఏపీ లిక్కర్ స్కామ్ అనేక రెట్లు పెద్దది. రూ.3,230 కోట్ల అవినీతి జరిగిందని సిట్ చెబుతోంది. హవాలా, మనీలాండరింగ్, ముడుపులు.. ఇలా సకల అవినీతితో నిండిన ఈ కేసు దర్యాప్తు ఓ కొలిక్కి రావడానికి మరికొంత సమయం పడుతుందని భావిస్తోంది. ఏపీ మద్యం కేసులో ఎంపీ మిథున్ రెడ్డి, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి, నాటి సీఎం జగన్ ఐటీ సలహాదారుగా ఉన్న రాజ్‌కసిరెడ్డి బయటి నుంచి వ్యవహారాలు నడిపించినవారే. జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డి సీఎంఓ కేంద్రంగా స్కామ్‌లో పని చేశారన్నది అభియోగం. ఆ తర్వాత ఎవరు? స్కామ్ చేయడానికి తెర వెనుక నుంచి వీరిని నడిపించిందెవరు? వారు వసూలు చేసిన సొమ్ము తీసుకొని లబ్ధిపొందిన విలన్ ఎవరు? ఈ కేసు విచారణ ఎక్కడి వరకు వెళ్తుంది? అన్నవి తేల్చడానికి మరికొంత సమయం పడుతుందని సీనియర్ అధికారులు చెబుతున్నారు. రాజ్ కసిరెడ్డి, ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, మిథున్‌రెడ్డి మాత్రమే కలిసి చేసిన నేరం కాదిది. వీళ్ల పాత్రధారులు మాత్రమేనని, సూత్రధారి వేరే ఉన్నారని దర్యాప్తు అధికారులు ఘంటాపథంగా చెబుతున్నారు. ఈ కేసులో ఇంకా పెద్దలు ఎవరెవరు ఉన్నారు? అసలు విలన్ ఎవరు? ఇప్పుడు రాష్ట్రంలో ఇదే హాట్‌టాపిక్‌గా మారింది. ఇటు రాజకీయ రంగం, అటు సోషల్ మీడియాతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఏ ఇద్దరు ముగ్గురు కలిసినా జరుగుతున్న చర్చ ఇదే.

**మాన్యువల్‌తో దోపిడీకి నాంది**

లిక్కర్ స్కామ్‌లో కీలకమైన అంశాలు రెండు. ఒకటి.. కంప్యూటర్ ఆధారిత ఆటో జనరేటెడ్ ఆర్డర్ ఫర్ సప్లై(ఓఎఫ్ఎస్). రెండోది.. లిక్కర్ పాలసీని మార్చడం. 2014-19 కాలంలో ఓఎఫ్ఎస్ విజయవంతంగా అమలైంది. జగన్ ప్రభుత్వం వచ్చాక కూడా తొలుత కొద్ది నెలలు అమలు చేశారు. కానీ లిక్కర్ స్కామ్ చేయాలంటే దీన్ని తీసేయాలని, కేవలం మనుషులు నిర్ణయించే ఆర్డర్ సప్లై విధానం అమలు చేయాలని బేవరేజెస్ కార్పొరేషన్‌కు ఆదేశాలు ఇచ్చారు. ఇది ఎవరు పడితే వాళ్లు తీసుకొనే నిర్ణయం కాదు. ప్రభుత్వ స్థాయిలో అంటే.. ఎక్సైజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదేశాలు ఇస్తేనే అమలు చేయాల్సిన విధాన పరమైన నిర్ణయం. కానీ ఇక్కడ అలాంటిదేమీ లేకుండానే రాజ్ కసిరెడ్డి చెప్పారని కార్పొరేషన్ ఈ నిర్ణయాన్ని అమలు చేసింది. ఈ నిర్ణయాన్ని కార్పొరేషన్ ద్వారా అమలు చేయించాలని ఆయనకు ఎవరు చెప్పారు? ఇదే తాజా విచారణలో తేలాల్సిన విషయం. లిక్కర్ స్కామ్‌కు బీజం పడింది కూడా ఇక్కడే. కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్దిష్ట పద్ధతి ప్రకారం లిక్కర్ కంపెనీలకు పంపిణీ ఆర్డర్ వెళ్లేది. వాటి అమ్మకాలు, పురోగతిని పరిగణనలోకి తీసుకొని ఇండెంట్ ఇచ్చేవారు. కానీ మాన్యువల్ విధానంతో లిక్కర్ సిండికేట్ కిందకు వచ్చిన కొత్త బ్రాండ్లకే ఎక్కువ ఆర్డర్ ఇచ్చారు. దీని వల్ల పేరున్న, వినియోగదారులు ఆసక్తి చూపే బ్రాండ్ల సరఫరా తగ్గించేశారు. తర్వాత ప్రముఖ బ్రాండ్లేవి కనిపించనంతగా తొక్కేశారు. కసిరెడ్డి సిఫారసుచేసిన బ్రాండ్ల వ్యాపారం భారీగా జరిగింది. వాటినే ప్రభుత్వ మద్యం షాపుల ద్వారా విక్రయించారు. ఇలా మాన్యువల్ విధానం.. దోపిడీకి నాంది పలికింది. మరి రాజ్ కసిరెడ్డి చెప్పగానే ఇలాంటి పాలసీని ఎలా అమలు చేశారన్నది అతిపెద్ద ప్రశ్న. ఇంకా ఎవరో తెరవెనక పెద్ద వ్యక్తి, అసలు సిసలైన విలన్ చెబితేనే దాన్ని అమలు చేశారు. ఆ విలన్ ప్రభుత్వ వ్యవస్థను శాసించే స్థాయిలో ఉండి చెబితేనే దీన్ని అమలు చేయగలరు. ఆ తెర వెనక శక్తి ఎవరో తేల్చే పనిలో సిట్ నిమగ్నమైంది.

## జగన్ ప్రతిపాదనలతోనే..

మద్యం ప్రైవేటు షాపుల ద్వారా అమ్మితేనే ప్రభుత్వానికి ఆదాయం ఉంటుంది. ప్రభుత్వ రిటైల్ దుకాణాలు(జీఆర్ఓ) ద్వారా విక్రయాలు వద్దని నాడు నిపుణులు సైతం సూచించారు. కానీ నాటి సీఎం జగన్ వినలేదు. ప్రైవేటు అమ్మకాలు జరిగిన 2014-19లో అక్రమాలు జరిగాయని ఆరోపణలు చేస్తూ, ప్రభుత్వమే ఆ వ్యాపారం చేయాలని జగన్ ప్రతిపాదించినట్లుగా తాజాగా విచారణలో తేలింది. లిక్కర్ పాలసీని ఎందుకు మార్చారు? దీని వెనక అసలేం జరిగింది? అని దర్యాప్తు సంస్థ ప్రభుత్వ నివేదికలను పరిశీలిస్తుండగా ఈ విషయం వెలుగు చూసినట్లు తెలిసింది. జగన్ అధ్యక్షతన జరిగిన అధికారుల సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారని, ఆ తర్వాత పాలసీ మార్పు ఉత్తర్వులు ఇచ్చారని తెలిసింది. లిక్కర్ పాలసీ మార్పు అనేది మంత్రివర్గంలో తీసుకున్న నిర్ణయమని జగన్ చెప్పడానికి అవకాశం ఉంది. కానీ అంతకన్నా ముందు జరిగిన సమావేశంలో పాలసీని మార్చాలని జగన్ స్వయంగా అధికారులకు సిఫారసు చేసినట్లు గుర్తించారు. ఆ తర్వాత పాలసీ మార్పును మంత్రివర్గానికి ప్రతిపాదించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో పాలసీని మార్చడంలో నాటి ముఖ్యమంత్రిదే కీలకపాత్ర అని దర్యాప్తు సంస్థ గుర్తించింది. ఈ విషయంలో కీలకమైన డాక్యుమెంట్లను తమ నియంత్రణలోకి తీసుకొని నిశిత పరిశీలన చేయాలని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. దీనిపై ఆరా తీసేందుకు ధనుంజయ్‌రెడ్డి, రాజ్ కసిరెడ్డి, మరికొందరిని కస్టడీకి తీసుకోవాలని సన్నాహకాలు చేసుకుంటున్నారు.

## కొనసాగుతున్న వర్షాలు

» నేడు రాయలసీమకు భారీ వర్షసూచన

విశాఖపట్నం, మే 18 (ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలోకి ప్రవేశించిన ఉపరితల ఆవర్తనం, దీని నుంచి తమిళనాడు మీదుగా కేరళ వరకు విస్తరించిన ఉపరితల ద్రోణి ప్రభావంతో సముద్రం నుంచి తేమగాలులు అధికమయ్యాయి. ఫలితంగా రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో మేఘాలు ఆవరించాయి. అలాగే ఉక్కపోతే అధికమైంది. పలుచోట్ల పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు రాయలసీమలో అక్కడక్కడా భారీ వర్షాలు కురవనున్నాయి. రానున్న 24 గంటల్లో రాయలసీమలో అనేక చోట్ల, కోస్తాలో పలుచోట్ల పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నెల 20న రాయలసీమ, ఉత్తరకోస్తా, 21, 22తేదీల్లో కోస్తాలో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, ఆదివారం జంగమహేశ్వరపురంలో 39.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

## మందుబాబులకు షాక్!

» మద్యం ధరలు పెంచిన తెలంగాణ ప్రభుత్వం

» క్వార్టర్‌కు రూ.10.. ఫుల్‌బాటిల్‌కు 40 పెంపు

హైదరాబాద్, మే 18(ఆంధ్రజ్యోతి): మందుబాబులకు తెలంగాణ ప్రభుత్వం షాకిచ్చింది. రాష్ట్రంలో మద్యం ధరలను పెంచిం ది. క్వార్టర్‌కు రూ.10, హాఫ్‌కు రూ.20, ఫుల్ బాటిల్‌కు రూ. 40 చొప్పున ధరలు పెంచుతూ ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ధరల పెంపు వల్ల ప్రభుత్వానికి నెలకు రూ.160 కోట్ల మేర అదనపు ఆదాయం లభించనుంది. కాగా, క్వార్టర్ రూ.110కి అమ్ముతున్న చీప్‌లిక్కర్, తక్కువ ఆల్కహాల్ శాతం ఉండే బ్రీజర్ ధరలను పెంచలేదు. ఈ రెండు మినహా మిగతా అన్ని బ్రాండ్ల మద్యం ధరలనూ పెంచారు. పెరిగిన ధరలు ఆదివారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి వస్తాయని అధికారులు తెలిపారు.

# కాలేజీల బంతాట!

(మొదటి పేజీ తరువాయి)

అడ్డుకున్నాయి. అటు సర్టిఫికెట్ల జారీ, ఇటు పరీక్షలు, ఫీజుల విషయంలో ఉన్నత విద్యాశాఖ ఆదేశాలను కాలేజీలు లెక్క చేయకపోవడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### మెలిక మామూలుగా లేదు!

ఏదైనా కోర్సులో అడ్మిషన్ పొందాలంటే విద్యా సంస్థలు దానికి ముందు చదివిన అర్హత కోర్సు సర్టిఫికెట్లను పరిశీలించి నిర్ధారించుకుంటాయి. ఇంజనీరింగ్, డిగ్రీ లాంటి కోర్సుల్లో చేరాలంటే టెన్త్, ఇంటర్మీడియట్ సర్టిఫికెట్లను పరిశీలిస్తాయి. పీజీ కోర్సుల్లో చేరితే టెన్త్, ఇంటర్‌తో పాటు డిగ్రీ సర్టిఫికెట్లను చూస్తారు. నకలు మాత్రమే తీసుకుంటాయి. కానీ, రాష్ట్రంలో దాదాపుగా అన్ని కాలేజీలు అడ్మిషన్ సమయంలో ఒరిజినల్స్‌ను తీసేసుకుంటున్నాయి. కోర్సు మొత్తం పూర్తయ్యాక ఫీజుల్లో ఎలాంటి వివాదం లేకపోతేనే వాటిని తిరిగి ఇస్తున్నాయి. ఫీజులు చెల్లించకపోతే ఆ కాలేజీలో చదివిన కోర్సు సర్టిఫికెట్లతో పాటు అడ్మిషన్ల సమయంలో తీసుకున్న ఒరిజినల్స్ కూడా ఇవ్వడం లేదు. అలాగే కోర్సులో చేరిన కొంత కాలం తర్వాత విద్యార్థులు కాలేజీ మారాలనుకున్నా, డ్రాప్ అవ్వాలనుకున్నా ఒరిజినల్ సర్టిఫికెట్లను అడ్డుపెట్టుకుని మొత్తం ఫీజులు కట్టాలని ఒత్తిడి చేస్తున్నాయి. ప్రస్తుతం చదువుతున్న కోర్సు ఫీజులు ప్రభుత్వం విడుదల చేయకపోయినా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ముక్కు పిండి మరీ వసూలు చేస్తున్నాయి.

### ఉన్నత విద్యాశాఖ ఆదేశాలు

విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఫీజుల విషయంలో ఈ ఏడాది జనవరిలో ఉన్నత విద్యామండలి ఆదేశాలు జారీ చేసింది. ఏదైనా కోర్సులో చేరిన విద్యార్థి అడ్మిషన్ వద్దనుకుని మధ్యలోనే మానేస్తే.. మొత్తం ఫీజులో గరిష్ఠంగా 5 శాతం(రూ.5 వేలు మించకుండా) మినహాయించుకుని అడ్మిషన్ ఉపసంహరణకు అనుమతించాలి. అదేవిధంగా విద్యార్థి దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోగా ఫీజు వెనక్కి ఇవ్వాలి. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వర్తించే విద్యార్థులు సీటు వద్దనుకుంటే ఎలాంటి అదనపు చార్జీలు వసూలు చేయకూడదు. మార్కుల షీట్లు, స్టడీ సర్టిఫికెట్లతో సహా ఎలాంటి ఒరిజినల్ సర్టిఫికెట్లను కాలేజీలు తీసుకోకూడదు. అడ్మిషన్ సమయంలో ఒరిజినల్స్‌ను పరిశీలించి తిరిగి విద్యార్థులకు ఇచ్చేయాలి. ఒకవేళ వాటిపై ఏవైనా అనుమానాలుంటే, వాటిని జారీచేసిన అథారిటీ పరిశీలనకు పంపించాలి. ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించే విద్యార్థులను ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేయకూడదు. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజుల కంటే అదనంగా కట్టాలని డిమాండ్ చేయకూడదు.

### జగన్.. మూడు క్వార్టర్లు పెండింగ్

2024-25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వం మొదటి క్వార్టర్‌కు రూ.788 కోట్లు విడుదల చేసింది. రెండో క్వార్టర్ ఫీజులు కూడా విడుదల చేసినట్లు ప్రకటించింది. షెడ్యూలు ప్రకారం ఇప్పటికి మూడో క్వార్టర్ ఫీజులు కూడా విడుదల చేయాలి. ఇవి కాకుండా జగన్ హయాంలో 2023-24 విద్యా సంవత్సరంలో మూడు క్వార్టర్ల ఫీజులు సుమారు రూ.2,100 కోట్లు పెండింగ్ పెట్టారు. ఇది కూడా ప్రస్తుత ప్రభుత్వానికి భారంగా పరిణమించింది. అంతిమంగా ఇది విద్యార్థులపై ప్రభావం చూపిస్తోంది.

### ఫీజులపై ఫైన్లు!

"ప్రభుత్వం నుంచి ఫీజులు రాలేదు. కాబట్టి మీరే కట్టాలి. లేదంటే హాల్ టికెట్లు ఇవ్వం. పరీక్షలు రాయడం కుదరదు." అంటూ ఈ నెల మొదట్లో మార్కాపురంలోని ఓ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులకు అల్టిమేటం జారీ చేసింది. ఇక, కృష్ణా జిల్లాలోని మరో ప్రముఖ కాలేజీ పెండింగ్ ఫీజులపై రోజువారీ జరిమానాల విధానం అమలు చేస్తోంది. వెంటనే ఫీజు చెల్లించాలని, లేదంటే ప్రభుత్వం ఫీజులు విడుదల చేసేవరకు రోజుకు రూ.500 చొప్పున ఫైన్ కట్టాలని స్పష్టం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా పలు కాలేజీలు విద్యార్థులపై ఇలానే ఫీజుల కోసం ఒత్తిడి చేస్తున్నాయి. తొలుత ప్రభుత్వ షరతులకు అంగీకరించి, ఇప్పుడు విద్యా సంవత్సరం మధ్యలో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం పట్ల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఆపరేషన్ సిందూర్‌పై వాస్తవాలు ప్రకటించండి

» ఎంపీ సంతోశ్ కుమార్, నారాయణ



తిరుపతి(ఆటోనగర్), మే 18(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం వాస్తవాలను వెల్లడించాలని సీపీఐ రాజ్యసభ సభ్యుడు సంతోశ్ కుమార్, ఆ పార్టీ జాతీయ కార్యదర్శి కె.నారాయణ డిమాండు చేశారు. తిరుపతిలో ఆదివారం వీరు మీడియా సమావేశంలో మాట్లాడారు. 'పాకిస్థాన్‌పై జరిగిన ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం అనేక ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సి ఉంది. ఉన్నపళంగా అగ్రదేశం చేసిన ప్రకటనతో సీజ్ ఫైర్‌కు ఆమోదం తెలపడం వెనుక పలు అనుమానాలు ఉన్నాయి. అఖిల పక్ష పార్టీలు, ఎంపీలతో చర్చలు జరపకుండా, బీజేపీ తనకు అనుకూలమైన వారికే ఆహ్వానం పలికి ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడంలో ఆంతర్యం ఏమిటి? బీజేపీ అనుసరిస్తున్న వైఖరితో దేశానికి ప్రమాదం పొంచి ఉంది. దౌత్య చర్చలకు పార్టీల ప్రమేయం లేకుండా సభ్యులను ఎంపిక చేయడం సరికాదు. ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకలించడానికి మేమెప్పుడూ అభ్యంతరం చెప్పలేదు. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని పెంచి పోషించడంపై దౌత్యపరంగా ప్రపంచ దేశాలను ఐక్యమత్యం చేసి ఆ దేశాన్ని ఏకాకిని చేయాలి' అని సంతోశ్, నారాయణ సూచించారు.

## రక్షణ కార్యదర్శి తూర్పు నావికాదళం సందర్శన

విశాఖపట్నం, మే 18(ఆంధ్రజ్యోతి): భారత రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్‌కుమార్ సింగ్ శుక్ర, శనివారాలు తూర్పు నావికాదళ ప్రధాన కేంద్రాన్ని సందర్శించారు. పాకిస్థాన్‌తో యుద్ధం తాత్కాలికంగా ఆగినప్పటికీ.. ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న సమయంలో కేంద్ర రక్షణ కార్యదర్శి ఇక్కడకు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సందర్భంగా తూర్పు నావికాదళం కమాండింగ్-ఇన్-చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్, ఇతర ఉన్నతాధికారులతో ఆయన భేటీ అయ్యారు. తూర్పునావికాదళం కార్యాచరణ సామర్థ్యం, కీలక కార్యకలాపాల గురించి కమాండింగ్-ఇన్-చీఫ్ వివరించారు. వ్యూహాత్మక సామర్థ్యాలను మరింత పెంచే లక్ష్యంతో తూర్పుతీరంలో కొనసాగుతున్న ప్రణాళికాబద్ధమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులపై నివేదించారు.



# తెలంగాణ సెక్రటేరియట్‌లో సుందరీమణుల సందడి

» పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ సందర్శన

హైదరాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): సాయం సంధ్యవేళ.. హుస్సేన్‌సాగర తీరాన.. విద్యుత్ కాంతుల వెలుగుల్లో.. రాష్ట్ర సచివాలయంలో అందాల భామలు సందడి చేశారు. పరిపాలనకు గుండెకాయ.. ప్రజల సంక్షేమం కోసం విధానాల రూపకల్పన జరిగే తెలంగాణ సచివాలయాన్ని ప్రపంచ సుందరి పోటీదారులు ఆదివారం సాయంత్రం సందర్శించారు. సచివాలయం మధ్యలో పచ్చికబయళ్లపై ఏర్పాటుచేసిన తేనీటి విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. దాదాపు 110 దేశాల నుంచి వచ్చిన సుందరీమణులకు పసందైన తెలంగాణ పిండి వంటకాలతోపాటు మిర్చి బజ్జీ, పునుగులు, ఇరానీ చాయ్ సహా పలురకాల చిరు తిళ్లు, ప్రత్యేకమైన ఐస్‌క్రీమ్‌లను అందించారు. ఇక ఉఫ్.. ఉఫ్ అనుకుంటూ చాయ్ తాగారు. మిస్‌వరల్డ్ పోటీదారులు సచివాలయానికి వచ్చిన సందర్భంగా తెలంగాణ చరిత్ర, అభివృద్ధి, పారిశ్రామిక విధానాలు సహా పలు అంశాలతో కూడిన ప్రత్యేక వీడియోను ప్రదర్శించారు. మిస్‌వరల్డ్ పోటీదారులు సచివాలయ సందర్శనకు వస్తున్న సందర్భంగా వారికి స్వాగతం పలికేందుకు, రాష్ట్ర పురోగతి, అభివృద్ధి కార్యక్రమాలను వివరించేందుకు ఆర్‌అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన, ఉపముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి కృష్ణభాస్కర్ వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. మిస్‌వరల్డ్ పోటీదారులను ఉద్దేశించి మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడారు. కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, పర్యాటక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, ఆర్‌అండ్‌బీ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్, డీజీపీ జితేందర్, మిస్ వరల్డ్ క్రిస్టినా తదితరులు పాల్గొన్నారు. సచివాలయం సందర్శనకు ముందు వారంతా ఇంటిగ్రేటెడ్ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించారు.



# ఆటలోనే ఆఖరి ఊపిరి!

» రెండు జిల్లాల్లో ఐదుగురు చిన్నారుల అకాల మరణం

» చిత్తూరులో నీటికుంటలో పడి ముగ్గురు...

» పశ్చిమలో జలాశయంలో పడి ఇద్దరు..



మృతి చెందిన సిద్దిక్, అబ్దుల్ మజీద్ (ఫైల్)

కుప్పం, బుట్టాయగూడెం, మే 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వేర్వేరు ప్రాంతాల్లో ఆదివారం ఐదుగురు చిన్నారులు అకాల మరణం చెందారు. చిత్తూరు జిల్లా కుప్పం మండలం దేవరాజపురంలో ముగ్గురు చిన్నారులు నీటికుంటలో పడి మృతి చెందగా, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఇద్దరు చిన్నారులు జలాశయంలో దిగి ఆడుకుంటూ మునిగిపోయారు. వివరాలివీ.. కుప్పం మండలం దేవరాజపురంలో చర్చి సమీప గుడిసెల్లో తిరుపతి, వరలక్ష్మిల కుమార్తె గౌతమి (7), రాజ, సుమతిల కుమార్తె షాలిని (6), శరవణ, యశోదల కుమారుడు అశ్విన్ (7) నివాసం ఉంటున్నారు. పిల్లలు ముగ్గురూ ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు వాన ఆగాక ఇళ్లకు సమీపంలో ఆడుకుంటున్నారు. అక్కడ చర్చికి ఆనుకుని ఇటీవల ఏదో కట్టడం కోసి తీసిన గోతిలో వాననీరు నిండి ఉంది. ఆడుకుంటూ ఆ కుంటలో ప్రమాదవశాత్తూ పడి మునిగిపోయారు. ఆ సమయంలో అక్కడెవరూ లేకపోవడంతో ముగ్గురు చిన్నారులూ మృతి చెందారు. కుప్పం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు, పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడేనికి చెందిన షేక్ అన్వర్, ఫర్విన్ దంపతులకు సిద్దిక్ (11), అబ్దుల్ మజీద్ (7) ఇద్దరు కుమారులు. అన్వర్ తాడేపల్లిగూడెంలో ఫుట్‌పాత్‌పై బట్టలు, ఫ్యాన్సీషాపు నడుపుకుంటూ జీవనం సాగి స్తున్నాడు. వేసవి సెలవులు కావడంతో ఫర్విన్ పిల్లలను తీసుకుని రెండు రోజుల క్రితం పుట్టినిల్లయిన ఏలూరు జిల్లాలోని జంగారెడ్డిగూడెం వచ్చారు. ఆదివారం బుట్టాయగూడెం మండలంలోని జల్లేరు జలాశయం చూడటానికి వెళ్లారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇద్దరు పిల్లలు జలాశయంలో దిగి ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ మునిగి చనిపోయారు. పోలీసులకు సమాచారం అందడంతో ఈతగాళ్లతో గాలించి.. చిన్నారుల మృతదేహాలను బయటకు తీశారు.

## అపరిచితుడి అరాచకం

» సిగరెట్ అందించలేదని టెకీపై దాడియత్నం

» బైకుపై వెళ్తుండగా కారుతో గుద్ది హత్య

» బెంగళూరులో ఘటన.. నిందితుడి అరెస్టు



నిందితుడు ప్రతీక్

బెంగళూరు, మే 18(ఆంధ్రజ్యోతి): సిగరెట్ తీసుకురాలేదన్న అక్కసుతో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీరును ఏకంగా కారుతో ఢీకొట్టి చంపేవాడో ఉన్మాది. మరో టెకీని ఆస్పత్రిపాలయ్యేలా చేశాడు. నిందితుడిని బెంగళూరు పోలీసులు శనివారం అరెస్టు చేశారు. బెంగళూరులోని సుబ్రమణ్యపుర పోలీసుల కథనం ప్రకారం.. హాసన్‌కు చెందిన సంజయ్(29), హుబ్బళ్ళి వాసి చేతన్(30) ఒకే కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. వర్క్ ఫ్రం హోం ఉండడంతో ఈనెల 9న సంజయ్ ఇంట్లో కలిసి వర్క్ చేశారు. 10న తెల్లవారుజామున బెంగళూరు పరిధి కోణనకుంటె క్రాస్ వద్దకు టీ తాగేందుకు బైక్‌పై వెళ్లారు. మెయిన్‌రోడ్డులో ఓ కొట్టువద్ద టీ తాగుతుండగా.. వీరితో సంబంధంలేని ప్రతీక్(32) అనే వ్యక్తి, అక్కడికి భార్యతోపాటు కారులో వచ్చాడు. కారు దిగకుండానే సంజయ్‌ను 'నాకో సిగరెట్ తీసుకురా..' అని ఆదేశించాడు. షాక్‌కు లోనైన సంజయ్ 'మీరే తెచ్చుకోండి' అన్నాడు. అంతే.. ఒక్కక్షణంలో కారు దిగి సంజయ్‌పై దాడికి దిగాడు. ఈలోగా భార్య వెళ్లి ప్రతీక్‌ను వెనక్కి తీసుకొచ్చింది. కాసేపటి తర్వాత సంజయ్, చేతన్ బైక్‌పై అక్కడి నుంచి బయల్దేరారు. వేచివున్న ప్రతీక్.. అదను చూసి వెనుక నుంచి వేగంగా వెళ్లి కారుతో బైక్‌ను ఢీకొట్టాడు. బైక్‌లోని ఇద్దరూ కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. సంజయ్‌ను వెంటనే ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సంజయ్ మృతిచెందాడు. చేతన్ ఆస్పత్రిలో ఉన్నాడు.

## కారు డోర్లు లాకై.. నలుగురు చిన్నారులు దుర్మరణం

(మొదటి పేజీ తరువాయి)

నలుగురు చిన్నారులు తుదిశ్వాస విడిచారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ద్వారపూడి గ్రామానికి చెందిన జోగ పరమేశ్ తన కారును రోడ్డుపై పార్కింగ్ చేసి ఇంటికి వెళ్లాడు. అక్కడికి సమీపంలోని ఓ ఇంట్లో శుభకార్యం జరుగుతోంది. దీనికి వచ్చిన నలుగురు చిన్నారులు కంది మనస్వి(7) మంగి ఉదయ్(8), బూర్లి జస్విత(7), బూర్లి చారుమతి(5) ఆడుకునేందుకు కారులోకి వెళ్లారు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో వీరు కారులోకి వెళ్లడాన్ని గమనించలేదు. కొద్దిసేపటికి ఆటోమేటిక్‌గా డోర్లు లాక్ అయ్యాయి. ఆటలో మునిగిపోయిన చిన్నారులు ఈ విషయాన్ని గుర్తించలేకపోయారు. అయితే.. డోర్లు లాక్ కావడంతో వారికి ఊపిరి సలపడం కష్టమైంది. తర్వాత కొద్దిసేపటికే ఊపిరాడక నలుగురూ కారులోనే మృతి చెందారు. ఇదిలావుంటే, చాలాసేపటి తర్వాత.. శుభకార్యానికి తీసుకువచ్చిన తమ చిన్నారులు కనిపించకపోవడంతో వారి కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఆందోళనతో పక్కనే ఉన్న నుయ్యి, రైలు ట్రాక్, సమీపంలోని పొలాలు, తోటల్లో వెతికారు. అయినప్పటికీ ఎలాంటి ఆచూకీ లభ్యం కాలేదు. అంతలోనే తేలికపాటి వర్షం కురిసింది. చిన్నారుల కుటుంబ సభ్యులు వానలో తడుస్తూనే.. తమ బిడ్డల కోసం వెతుకుతూ కారు వైపుగా వచ్చారు. వర్షం నీటికి కారు అద్దాలు శుభ్రమై లోపలున్న చిన్నారులు అచేతన స్థితిలో కంట పడ్డారు. వెంటనే కారు అద్దాలు పగులగొట్టి వారిని జిల్లా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతి చెందిన చిన్నారుల్లో బూర్లి జస్విత(7) బూర్లి చారుమతి(5) అక్కాచెల్లెళ్లు. మరో బాలిక కంది మనస్వి(7) సురేశ్, అరుణ దంపతులకు ఏకైక కుమార్తె. దీంతో ఆ కుటుంబాలు తీవ్ర విషాదంలో మునిగిపోయాయి. ఆడుకునేందుకు వెళ్లిన తమ బిడ్డలు విగజీవులుగా మారడం చూసి ఆ తల్లిదండ్రులు గుండెలవిలసేలా రోదించారు. కాగా, విషయం తెలుసుకున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయడు, విజయనగరం జిల్లా కలెక్టర్ అంబేడ్కర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే అదితి గజపతిరాజు గ్రామానికి వెళ్లి చిన్నారుల తల్లిదండ్రులను ఓదార్చారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనిత ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించారు.

### చిన్నారుల మృతిపై చంద్రబాబు దిగ్భ్రాంతి

అమరావతి, మే 18(ఆంధ్రజ్యోతి): విజయనగరం, చిత్తూరు జిల్లాల్లో ఆదివారం జరిగిన వేర్వేరు ఘటనల్లో పట్టుమని పదేళ్లు కూడా నిండని ఏడుగురు పిల్లలు ప్రాణాలు కోల్పోవడంపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలు తనను తీవ్రంగా కలిచివేసిందని పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా కుప్పం మండలం దేవరాజపురంలో ఒకే కుటుంబానికి చెందిన పిల్లలు గౌతమీ, శాలినీ, అశ్విన్ నీటి కుంటలో దిగి ప్రాణాలు కోల్పోవడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బిడ్డల మృతితో తీవ్ర శోకంలో ఉన్న వారి తల్లిదండ్రులకు సీఎం సానుభూతి తెలిపారు. అలాగే, విజయనగరం జిల్లా ద్వారపూడిలో కారు డోర్లు లాక్ పడిన ఘటనలో నలుగురు చిన్నారులు చనిపోవడంపై సీఎం విచారం వ్యక్తం చేశారు. కారులో చిక్కుకుని, ఊపిరి అందక ఉదయ్, జాశ్రిత, చారులత, మణీశ్వరి ప్రాణాలు కోల్పోవడంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని సీఎం భరోసా ఇచ్చారు.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.